
శుక్రవారం 10-11-2023



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 230

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL









ఉన్నతమైన సాంప్రదాయ వస్త్రాలు

మినిస్టర్ వైట్®

పెళ్లి పట్టు పంచలు & పట్టు షర్ట్స్ • కుర్తాలు • మ్యాచింగ్ పంచలు & షర్ట్స్ • ఫ్లెక్సీ వేస్టి పంచలు

కలర్ షర్ట్స్ • వైట్ షర్ట్స్ • షర్ట్ ఫ్యాబ్రిక్ • టవల్స్ • వెస్ట్ & బ్రీఫ్స్

AVAILABLE AT ALL LEADING STORES | www.ministerwhite.com | @ministerwhiteofficial

For Trade Enquiry : +91 92480 83889



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 230

శుక్రవారం 10-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




కివీస్‌కు సెమీస్ పిలుపు!

శ్రీలంకపై 5 వికెట్లతో విజయం.
పాకిస్తాన్ సెమీస్ ఆశలు ఆవిరి! -15లో



జై జవాన్‌కు టిఫిన్ బాక్స్

సైన్యానికి మంచి ఆహారాన్ని అందిస్తోన్న కట్టికోల మాధవిపై కథనం -13లో



వారి కేసులపై ప్రత్యేక బెంచ్‌లు

ప్రజాప్రతినిధులపై ఉన్న క్రిమినల్ కేసుల్లో విచారణకు ప్రత్యేక బెంచ్‌లు పెట్టాలని హైకోర్టులను సుప్రీంకోర్టు ఆదేశించింది.

- వివరాలు 6లో



4 నుంచి శీతాకాల పార్లమెంట్

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 4న మొదలై డిసెంబర్ 22 వరకు జరుగుతాయని మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు.

- వివరాలు 6లో



నాకు ఒక్క ఇల్లూ లేదు

పేదలకు తమ ప్రభుత్వం 4 కోట్ల పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చిందని, తన కోసం ఒక్క ఇల్లు కూడా కట్టుకోలేదని ప్రధాని మోదీ అన్నారు.

- వివరాలు 6లో



మొయిత్రాను బహిష్కరించాలి

తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాపై అనర్హత వేటువేయాలని లోక్‌సభ ఎథిక్స్ కమిటీ సిఫారసు చేసింది.

- వివరాలు 6లో

చురక పెట్టాలె..!

జనాన్ని ఆగం చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ నేతలు వస్తున్నరు

కామారెడ్డి ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్

- ఒకరు మనను ఆంధ్రాలో కలిపి 50 ఏళ్ల గోస పెట్టారు
- మరొకరు తొమ్మిదేళ్లుగా తెలంగాణపై వివక్ష చూపుతున్నారు
- అలాంటి వారికి ఒక్క ఓటూ వెయ్యకుండా నిలదీయాలి
- ఎమ్మెల్యేలను కొంటూ పట్టుబడ్డ మహాత్ముడు నాపై పోటీకి వస్తున్నడు
- విచక్షణతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని పిలుపు
- గజ్వేల్, కామారెడ్డిలలో నామినేషన్లు వేసిన బీఆర్ఎస్ అధినేత



కామారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తున్న సీఎం కేసీఆర్

సాక్షి, కామారెడ్డి/గజ్వేల్: తెలంగాణ ప్రజలను ఆగం చేసేందుకు కాంగ్రెస్, బీజేపీల నేతలు వస్తున్నారని.. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు. ఉన్న తెలంగాణను ఆంధ్రాలో కలిపి 50 ఏళ్ల గోసపడేలా చేసిన కాంగ్రెస్ పార్టీ నేతలు ఒకవైపు.. తెలంగాణకు ఏమీ ఇవ్వకుండా గోసపెడుతున్న బీజేపీ వాళ్లు మరోవైపు ఓట్ల కోసం వస్తున్నారని.. వారికి ఓటుతో చురక (వాత) పెట్టాలని పేర్కొన్నారు. ఏ అభ్యర్థి ఏమిటో, వారి గుణగణాలు, మంచీచెడ్డతోపాటు వారి వెనుక ఉన్న పార్టీని కూడా చూడాలన్నారు. ఎమ్మెల్యేలను కొంటూ యాభై లక్షలతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ మహాత్ముడు తనపై పోటీకి వస్తున్నారని, ప్రజలు విచక్షణతో ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. గురువారం గజ్వేల్, కామారెడ్డిలలో బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్లు వేసిన సీఎం కేసీఆర్.. అనంతరం కామారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''ప్రజలకు ఉండే ఆయుధం ఓటు. తమాషాకు వేయొద్దు. విచక్షణా జ్ఞానంతో ఆలోచించి ఓటేయాలి. ప్రతీ విషయం మీద చర్చ జరగాలన్నదే నా అభిమతం. ఎన్నికల్లో గెలవాల్సింది నాయకులు కాదు. ప్రజలే గెలవాలి. ఎన్నికలు రాగానే అబద్ధాలు, అభాండాలు, గోల్‌మాల్ తిప్పుడు, గోలగాళ్లు తయారవుతున్నరు. అట్లా కాకుండా చర్చించుకుని నిర్ణయం తీసుకోవాలి.

బీడీ కార్మికులందరికీ జీవన భృతి

యాభై ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ చేసిందేమిటో ప్రజలు ఆలోచించాలి. 1956కు ముందు మనం మనంగానే ఉంటే, మనను తీసుకుపోయి

మిగతా 2వ పేజీలో ▶

1,129 నామినేషన్లు

గురువారం ఒక్కరోజే రికార్డు సంఖ్యలో దాఖలు

- నేటితో ముగియనున్న గడువు
- 13న నామినేషన్ల పరిశీలన.. 15 వరకు ఉపసంహరణ గడువు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల దాఖలు ఘట్టం శుక్రవారం ముగియనుంది. గురువారం ఏకాదశి సుముహూర్తం కావడంతో భారీసంఖ్యలో అభ్యర్థులు తరలివచ్చి నామినేషన్లు వేశారు. రాష్ట్రంలోని మొత్తం 119 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో గురువారం రికార్డు సంఖ్యలో 1,129 నామినేషన్లు దాఖలైనట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో) కార్యాలయ వర్గాలు తెలిపాయి. బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గురువారం ఉదయం 11 గంటలకు గజ్వేల్‌లో, మధ్యాహ్నం 2 గంటలకు కామారెడ్డిలో నామినేషన్లు వేశారు. సిరిసిల్లలో మంత్రి కేటీఆర్, సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు కూడా నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు ప్రారంభమైన నాటి నుంచి బుధవారం వరకు 119 శాసనసభ నియోజకవర్గాల్లో మొత్తం 1,188 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో) కార్యాలయం ప్రకటించింది. గురువారం నాటికి దాఖలైన మొత్తం నామినేషన్ల వివరాలను అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. రెండురోజుల తర్వాత (13వ తేదీన) నామినేషన్ల పరిశీలన నిర్వహించనున్నారు. 15వ తేదీతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుంది. అదేరోజు అన్ని నియోజకవర్గాల్లో పోటీలో ఉండే అభ్యర్థులెవరో తేలిపోతుంది. నవంబర్ 30న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటాయి.

మరో ఏడుగురికి బీజేపీ టికెట్లు!

అధికారికంగా ప్రకటించకుండా ఫోన్‌లో సమాచారం



- నామినేషన్లు వేసుకోవాలని సూచించిన నేతలు
- ఇంకా ఐదు సీట్లకు అభ్యర్థుల ఖరారు పెండింగ్

సాక్షి, హైదరాబాద్: పెండింగ్‌లో ఉన్న నియోజకవర్గాలకు సంబంధించి బీజేపీ ఏడుగురు అభ్యర్థులను ఖరారు చేసింది. అయితే అధికారికంగా జాబితా విడుదల చేయలేదు. బీజేపీ నాయకత్వం ఆయా అభ్యర్థులకు ఫోన్లు చేసి పార్టీ తరఫున నామినేషన్లు వేసుకోవాల్సిందిగా సూచించింది. దీనితో ఇప్పటివరకు 106 మందిని ప్రకటించినట్లు అయింది. మరో ఐదు సీట్లకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. మిగతా 8 స్థానాలను పొత్తులో భాగంగా ఇప్పటికే జనసేనకు కేటాయించారు.

కీలక స్థానాలకు ఎంపిక

శేరిలింగంపల్లి నుంచి మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ కుమారుడు రవికుమార్ యాదవ్ పేరు ఖరారైంది. నిజానికి

మిగతా 12వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ఆల్మట్టి.. శ్రీశైలం నోట్లో మట్టి!



ఆల్మట్టి నుంచి ఏపీ, తెలంగాణకు రావాల్సిన కృష్ణా జలాల నికర వాటా నుంచి కర్ణాటకకు 15.89 టీఎంసీలు కేటాయించాలని కేంద్రం ప్రతిపాదించింది. ఇది అమలైతే శ్రీశైలానికి రావాల్సిన నికర జలాలకు గండిపడుతుంది.

- వివరాలు 5లో


బీఆర్ఎస్, బీజేపీ ఓటమే లక్ష్యం: చాడ



అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీని ఓడించడమే తమ లక్ష్యమని, రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం రావాలన్నదే తమ ఆకాంక్ష అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు.

- వివరాలు 12లో

చంద్రబాబుకి దక్కని ఊరట



చంద్రబాబుకు సుప్రీంకోర్టులో మరోసారి ఊరట లభించలేదు. ఫైబర్‌నెట్ కేసులో ముందస్తు బెయిలు కోసం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఈనెల 30కి వాయిదా వేసింది.

- వివరాలు 12లో

సీమ థర్మల్ విద్యుత్ కేంద్రానికి 'ఎంవీఆర్' పేరు



రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్ పేరును డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంటుగా మారుస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది

- వివరాలు 12లో



సార్! మీరు దోశ వేయకుండా ఉంటేనే ఓటేస్తారట సార్!

బీజేపీ, బీఆర్ఎస్ మధ్యనే పోటీ

చాలా చోట్ల కాంగ్రెస్‌కు డిపాజిట్ వచ్చే పరిస్థితి లేదు



- ఊరికే గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ హైప్ సృష్టించే ప్రయత్నంలో నిమగ్నమైంది
- ప్రజల ఆగ్రహ జ్వాలల అగ్నిపర్వతం 30న బద్దలవుతుంది
- ఢిల్లీలో కాంగ్రెస్ ఫ్రంట్ ఏర్పడితే అక్కడికి వెళ్లాలని కేసీఆర్ కలలు కంటున్నారు... అప్పుడే సీఎం అయిపోయినట్లు కేటీఆర్ ఊహల్లో విహరిస్తున్నారు...
- 'సాక్షి' ఇంటర్వ్యూలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

7లో

అధికారంలోకొస్తే ప్రత్యేక మైనారిటీ సబ్‌ప్లాన్

మైనారిటీ సంక్షేమ బడ్జెట్ రూ. 4 వేల కోట్లకు పెంచుతాం



- ఏటా రూ. 1,000 కోట్లతో సబ్సిడీ రుణాలు అందిస్తాం
- మైనారిటీ డిక్లరేషన్ విడుదల చేసిన టీ కాంగ్రెస్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అధికారంలోకి వస్తే మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక మైనారిటీ సబ్‌ప్లాన్ అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, సీడబ్ల్యూసీ సభ్యులు నాసిర్, షకీల్ అహ్మద్, కర్ణాటక మంత్రి జమీరుద్దీన్ అహ్మద్ తదితరులు మైనారిటీ డిక్లరేషన్

మిగతా 14వ పేజీలో ▶

పొంగులేటి ఇళ్లు, కార్యాలయాలపై ఐటీ దాడులు



- ఖమ్మం, హైదరాబాద్‌లలో 30 చోట్ల ఏకకాలంలో అధికారుల తనిఖీలు... ఆ సమయంలో ఖమ్మం ఇంట్లోనే పొంగులేటి.. బయటకు పంపేందుకు ససేమిరా
- ఎన్నికల అధికారికి లేఖ రాయడంతో నామినేషన్ వేసేందుకు అనుమతి... భారీ ర్యాలీగా వెళ్లి పాలేరు స్థానానికి నామినేషన్ వేసిన పొంగులేటి

14లో

నా అల్లుడిపై చేయి చేసుకున్నారు

పొంగులేటి ఆరోపణ

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనే విషయాన్ని జీర్ణించుకోలేని ముఖ్యమంత్రి కేసీఆర్.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో కలిసి ఐటీ దాడులు చేయిస్తున్నారని పొంగులేటి ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతూ ఆరోపించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలను దీటుగా ఎదుర్కొంటామని, ఈ విషయమై కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. హైదరాబాద్‌లో తనిఖీల సందర్భంగా తన బిడ్డ భర్త (అల్లుడు)పై అధికారులు చేయి చేసుకున్నారని, ఇంకొన్ని చోట్ల బంధువులు, కంపెనీ ఉద్యోగులతో దురుసుగా ప్రవర్తించారని ఆయన ఆరోపించారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 10-11-2023

● సక్సెస్ స్టోరీ


కిషన్ బగారియా

కిషన్‌ని చూసినప్పుడు చాలామందికి అమెరికన్ ఇన్వెంటర్, ఇంజనీర్ చార్లెస్ కెటరింగ్ ఒకప్పుడు చెప్పిన మాట తప్పకుండా గుర్తుకు వస్తుంది.

'ఇన్వెంటర్ అంటే చదువును మరీ సీరియస్‌గా తీసుకోని వ్యక్తి' అంటాడు చార్లెస్ కెటరింగ్. అతడు నవ్వులాటకు అన్నాడో, సీరియస్‌గా అన్నాడో తెలియదుగానీ అస్సాంకు చెందిన కిషన్ చదువును సీరియస్‌గా తీసుకోలేదు. లక్ష్యాన్ని మాత్రం సీరియస్‌గా తీసుకున్నాడు.

లక్ష్యం ఉన్న చోట క్రమశిక్షణ, అంకితభావం ఉంటాయి. విజయానికి దారిచూపుతాయి. కిషన్ విషయంలోనూ ఇది నిజమైంది.

ఒకప్పుడు 'కిషన్ బగారియా' అంటే పక్క గ్రామం వాళ్లకు కూడా తెలియదు.

ఇప్పుడు అస్సాం మొత్తం సుపరిచితమైన పేరు....కిషన్ బగారియా.

26 సంవత్సరాల కిషన్ బగారియా సృష్టించిన ఆల్-ఇన్-వన్ యాప్ 'టెక్స్ట్.కామ్'ను అమెరికాకు చెందిన టెక్ కంపెనీ 'ఆటోమేటిక్ ఇంక్' రూ. 416 కోట్లకు కొనుగోలు చేసింది...

చెఫ్ కాదు టెక్ జీనియస్

అస్సాంలోని దిబ్రుగఢ్‌లో ఎనిమిది, అగ్రసేన్ అకాడమీలో తొమ్మిది, పదో క్లాస్ చదివాడు కిషన్. ఇంటర్నెట్ అతడి ప్రపంచంగా ఉండేది. రోజూ ఏదో ఒక కొత్త విషయం గురించి తెలుసుకోవడమో, నేర్చుకోవడమో చేసేవాడు. పన్నెండు సంవత్సరాల వయసులోనే యాప్స్ తయారీపై ఆసక్తి చూపించడం మొదలు పెట్టాడు. తన వినోదం కోసం చిన్న చిన్న యాప్స్ తయారుచేసేవాడు.

'వీడికి ఇంటర్నెట్ అందుబాటులో ఉంటే ప్రపంచంతో పనిలేదు' అని నవ్వుతూ ఇతరులతో చెప్పేవాడు తండ్రి మహేంద్ర బగారియా.

'ఎప్పుడు చూసినా కంప్యూటర్‌లో మునిగిపోయి కనిపిస్తావు. భవిష్యత్‌లో ఓ మంచి ఉద్యోగం చేయాలనే లక్ష్యం లేదా?' అని ఒక సందర్భంలో బంధువు ఒకరు కిషన్‌ను అడిగాడు.

'ఉద్యోగం చేయాలని లేదు. లక్ష్యం మాత్రం ఉంది' అన్నాడు కిషన్.

'ఏమిటి అది?' అని ఆసక్తిగా అడిగాడు బంధువు.

'సొంతంగా కంపెనీ పెట్టాలనేది నా లక్ష్యం' గంభీరంగా అన్నాడు కిషన్.

బంధువుతో పాటు అక్కడ ఉన్న వాళ్లు అందరూ బిగ్గరగా నవ్వారు. అలా నవ్విన వాళ్లందరికీ కిషన్ ఇప్పుడు తప్పనిసరిగా గుర్తుకు వచ్చి ఉంటాడు.

మరో సందర్భంలో...

'పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లు ప్రవర్తించకు. పగటికలల



ప్రపంచం నుంచి బయటికి వచ్చేయ్. సొంతంగా కంపెనీ అంటే మాటలనుకున్నావా?' అంటూ ఒకప్పుడు తనకు హైస్కూల్‌లో చదువు చెప్పిన టీచర్ మందలించాడు.

ఇప్పుడు ఆ గురువు గారికి కిషన్ తప్పనిసరిగా గుర్తుకు వచ్చి ఉంటాడు.


ఎవరినీ ఎప్పుడూ తక్కువ అంచనా వేయవద్దు!

'డీల్ ఫైనలైజ్ కావడానికి మూడు నెలల సమయం పట్టింది. డీల్ ఓకే అయిన సందర్భంలో తట్టుకోలేని సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాను. ఇది కలా నిజమా! అనుకుంటూ ఒత్తిడికి గురయ్యాను. ఈ స్థితి నుంచి బయటపడడానికి కాస్త సమయం పట్టింది' అంటాడు కిషన్. 'మరి నెక్స్ట్ ఏమిటి?' అనే ప్రశ్నకు కిషన్ ఇచ్చిన జవాబు... 'టెక్స్ట్.కామ్‌పై మరింత పనిచేయాల్సి ఉంది. వర్క్ కంటిన్యూ అవుతుంది'

కిషన్ రూపొందించిన 'ఆల్-ఇన్-వన్' యాప్ ట్విట్టర్, వాట్సప్, ఐ మెసేజ్, సిగ్నల్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్... మొదలైన యాప్‌లను ఒకే డ్యాష్‌బోర్డ్‌లో అందుబాటులోకి తెస్తుంది. యూజర్ కమ్యూనికేషన్ ప్రక్రియను సులభతరం చేసే యాప్ ఇది.

● సంక్లిష్టమైన డిజిటల్ డేటాను వినసొంపైన సంగీతంగా రూపొందించే అల్గోరిథంను రూపొందించాయి టాంపెర యూనివర్శిటీ (ఫిన్‌లాండ్), ఈస్టర్న్ వాషింగ్టన్ యూనివర్శిటీ పరిశోధక బృందాలు ● కోళ్లు అద్దంలో తమను తాము గుర్తు పడతాయని చెబుతుంది జర్మనీలోని యూనివర్శిటీ ఆఫ్ బాన్ పరిశోధన ● బొద్దుగా, ముద్దుగా ఉండే జంతువుల బొమ్మలను ఎక్కువగా చూస్తే ఏకాగ్రత పెరుగుతుందని చెబుతుంది 'ఎన్విరాన్‌మెంటల్ రిసెర్చ్ అండ్ పబ్లిక్ హెల్త్' ఇంటర్నేషనల్ జనరల్‌లో ప్రచురితమైన పరిశోధన పత్రం.

అవును... ఇది నిజమే!



యువర్స్

అడోరిక్ 8 ఇన్ వన్ ఎలక్ట్రానిక్ క్లీనర్



బ్రాండ్: అడోరిక్; డైమెన్షన్స్: 15×5×5 సెం.మీ; బరువు: 200 గ్రా.; మౌంటింగ్ హార్డ్‌వేర్: క్లీనింగ్ కిట్;
● ఎయిర్‌పాడ్ క్లీనింగ్ కిట్ ● ల్యాప్‌టాప్ క్లీనింగ్ కిట్
● స్క్రీన్ డస్ట్ బ్రష్ ● స్ప్రే బాటిల్

● టెక్.. టాక్

రెడ్‌మీ ప్యాడ్



స్క్రీన్ సైజ్: 10.61 అంగుళాలు
డిస్‌ప్లే: 2000×1200;
మెమొరీ: 128జీబి;
రిఫ్రెష్ రేట్: 90 హెచ్‌జడ్;
బ్యాటరీ: 8000 ఎంఏహెచ్;
వోఎస్: ఆండ్రాయిడ్; స్పెషల్ ఫీచర్: ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్

యూట్యూబ్‌లో ఏఐ పవర్డ్ ఫీచర్స్



యూట్యూబ్ కొత్త జెనరేటివ్ ఏఐ పవర్డ్ ఫీచర్స్‌ను పరీక్షిస్తుంది. టాపిక్స్ ఆధారంగా ఈ ఏఐ ఫీచర్‌లు కామెంట్స్‌ను సమరైజ్ చేయడానికి, క్యాటగిరైజ్ చేయడానికి ఉపకరిస్తాయి. కన్వర్‌సేషనల్ టూల్ మనం చూస్తున్న వీడియోకి సంబంధించిన సందేహాలకు సమాధానం చెబుతుంది. కంటెంట్‌కు సంబంధించి మరిన్ని వివరాలు తెలుసుకోవాలనుకునే వారికి ఇది ఉపయోగపడుతుంది. ఈ సమయంలో వీడియోప్లేబ్యాక్‌కు అంతరాయం కలగదు. కామెంట్స్ ఆధారంగా వేగంగా, సులభంగా కొత్త కంటెంట్ క్రియేట్ చేయడానికి క్రియేటర్‌లకు కామెంట్ సమరైజ్ ఫీచర్ ఉపయోగపడుతుంది. ఒక టాపిక్‌కు సంబంధించి వర్గీకరించిన వ్యక్తిగత కామెంట్స్‌ను క్రియేటర్‌లు డిలిట్ చేయడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది.

గూగుల్ స్కాన్ టెక్స్ట్



జీ బోర్డ్ (ఆండ్రాయిడ్) కోసం గూగుల్ 'స్కాన్ టెక్స్ట్' ఫీచర్‌ని రూపొందించే పనిలో ఉంది. లెన్స్ యాప్ ఇమేజ్‌ల నుంచి టెక్స్ట్ రెకగ్నైజ్ చేసినట్లే ఈ కొత్త ఫీచర్ 'ఆప్టికల్ క్యారెక్టర్ రెకగ్నైజ్'తో ఫోన్ కెమెరాలోని ఫోటోల నుంచి టెక్స్ట్‌ను ఎక్స్‌ట్రాక్ట్ చేస్తుంది. యూజర్‌లు తాము కోరుకున్న చోట పేస్ట్ చేయవచ్చు. గత కొన్ని నెలలుగా గూగుల్ జీ బోర్డ్ కోసం కొత్త ఫీచర్‌లను తీసుకువచ్చింది. అందులో 'రీసైజ్ ఆప్షన్' ఒకటి. కీబోర్డ్ హైట్‌ను అడ్జస్ట్ చేసుకోవడానికి ఇది యూజర్‌లకు ఉపయోగపడుతుంది.

● గేమింగ్ : నేడే విడుదల


యుద్ధం పిలిచిన చోట



ఫస్ట్-పర్సన్ షూటర్ వీడియో గేమ్ కాల్ ఆఫ్ డ్యూటీ: మోడ్రన్ వార్‌ఫేర్ నేడు విడుదల అవుతుంది. గత గేమ్స్‌లాగే ఈ గేమ్‌లోనూ రియలిస్టిక్, మోడ్రన్ సెట్టింగ్‌లు కనువిందు చేస్తాయి. మల్టీ-నేషనల్ స్పెషల్ ఆపరేషన్స్ యూనిట్ టాస్క్ ఫోర్స్ ప్రత్యేక ఆకర్షణ. 'కాల్ ఆఫ్ డ్యూటీ' సిరీస్ గత గేమ్స్‌లో ఉన్న ఫీచర్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన ఫీచర్‌లు కూడా ఉంటాయి.

ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్
జానర్: ఫస్ట్-పర్సన్ షూటర్ మోడ్స్: సింగిల్-ప్లేయర్, మల్టీప్లేయర్

● ఇంగ్లిష్ ఇడియమ్స్



ఎట్ ది డ్రాప్ ఆఫ్ ఏ హ్యాట్

మనం ఏ పని చేయాలన్నా కాస్తో కూస్తో ఆలోచించి మరీ చేస్తాం. అలా కాకుండా అప్పటికప్పుడు తోచినట్లు చేసే సందర్భంలో వాడే మాట... ఎట్ ది డ్రాప్ ఆఫ్ ఏ హ్యాట్.

ఉదా: హీ ఈజ్ రెడీ టు ఫైట్ ఎట్ ది డ్రాప్ ఆఫ్ ఏ హ్యాట్

వోల్ట్-ఫేస్

నమ్ముకున్న అభిప్రాయం, సిద్ధాంతాలు, ప్లాన్ ఆఫ్ యాక్షన్‌లో అకస్మాత్తుగా మార్పు వచ్చే సందర్భంలో వాడే మాట...వోల్ట్-ఫేస్. *ఉదా: ఇన్ 1986 హీ మేడ్ ఏ వెరీ పబ్లిక్ అండ్ డ్రామటిక్ పొలిటికల్ వోల్ట్-ఫేస్ ఫ్రమ్ లెఫ్ట్ టు రైట్*

● మ్యూజిక్ వరల్డ్

వరం లాంటి స్వరం



'వీరే ది వెడ్డింగ్' సినిమాతో బాలీవుడ్ సింగర్‌గా అరంగేట్రం చేసింది లీసా మిశ్రా. యూనిక్ వాయిస్‌తో ప్రేక్షకులను మెప్పించింది. తనకు ఇష్టమైన పాటలు పాడి సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లలో పోస్ట్ చేసే మిశ్రా చికాగోలో డాటా-ఎనలిస్ట్‌గా ఉద్యోగం చేసింది. సంగీతాన్నే కెరీర్ చేసుకోవడానికి అమెరికా నుంచి ముంబై వచ్చింది. రెండు సంవత్సరాల క్రితం ప్రఖ్యాత సింగర్ లేడీ గాగాతో కలిసి మ్యూజిక్ ప్రోగ్రామ్ చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో మిశ్రాకు ఎనిమిది లక్షల ఫాలోవర్స్ ఉన్నారు. తన యూట్యూబ్ చానల్‌కు మూడు లక్షలమంది సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు.

'మ్యూజిషియన్‌గా పేరు తెచ్చుకోవడానికి నాకు యూట్యూబ్ ఎంతో ఉపయోగపడింది. నా సంగీతం ప్రపంచ వ్యాప్తంగా చాలామందికి పరిచయం కావడానికి సోషల్ మీడియా ఉపయోగపడింది. కష్టాల్లో ఉన్నప్పుడు ఓదార్పులా, ఒత్తిడిని జయించే శక్తిలా నా సంగీతం ఉండాలనుకుంటాను. చాలామందికి మన విజయం తప్ప ఆ విజయం కోసం గతంలో పడిన కష్టం గురించి తెలియదు. దీంతో వోవర్ నైట్ సక్సెస్ అంటుంటారు' అంటుంది సింగర్-సాంగ్ రైటర్ లీసా మిశ్రా.

సినిమా

గోవా టు హైదరాబాద్


● ఎన్టీఆర్

హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'దేవర'. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా, సైఫ్ అలీఖాన్ విలన్ రోల్ చేస్తున్నారు. ఇటీవల గోవాలో మొదలైన ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్ పూర్తయినట్లు తెలిసింది. ఈ షెడ్యూల్‌లో ఎన్టీఆర్, జాన్వీ.. ఇలా ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. అలాగే 'దేవర' నెక్స్ట్ షెడ్యూల్ డిసెంబరులో హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని సమాచారం. కల్యాణ్‌రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలోని తొలి భాగం 'దేవర పార్ట్ 1' ఏప్రిల్ 5న విడుదల కానుంది.

ఆ కథలు నాకు ధైర్యాన్నిచ్చాయి
- సమంత



''నా జీవితంలో విడాకులు, నా సినిమాలు వరుసగా పరాజయం చెందడం.. ఆరోగ్య సమస్యలు (మయోసైటిస్).. ఇలా అన్నీ ఒకేసారి చుట్టుముట్టడంతో ఎంతో కుంగిపోయాను'' అని సమంత అన్నారు. ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ విధంగా పేర్కొన్నారు. అదే ఇంటర్వ్యూలో సమంత ఇంకా మాట్లాడుతూ– ''జీవితంలో ఎవరికైనా ముఖ్యమైనది వివాహం. నా వైవాహిక జీవితం విఫలమైంది.. ఆరోగ్యం క్షీణించింది. అదే టైమ్‌లో నా సినిమాలూ ప్రేక్షకులను మెప్పించలేదు. ఈ సమస్యలతో సుమారు రెండేళ్లు జీవితంలో ఎంతో కుంగిపోయాను. అప్పుడు బుక్స్ చదవటం మొదలుపెట్టాను. ఆరోగ్య సమస్యలను ఎదుర్కొని, మళ్లీ సినిమాలు చేసిన నటుల గురించి, జీవితంలో ట్రోలింగ్‌కి, మానసిక ఒత్తిడికి గురైన వారు ఎలా కోలుకున్నారో తెలుసుకున్నాను. వారి కథలు చదవడం నాకెంతో ఉపయోగపడింది. వారిలా నేనూ చేయగలననే ధైర్యం వచ్చింది. ఈ దేశంలో ఎందరో స్టార్స్ ఉన్నారు. అందరిలో నాక్కూడా గుర్తింపు రావడం గొప్ప అదృష్టం. నా లైఫ్‌లోని ఒడిదుడుకులు బహిర్గతమైనందుకు నాకు బాధ లేదు. ఇక్కడ నాలా ఇబ్బందులు పడేవారు ఎందరో ఉన్నారు. వారందరూ నాలాగే పోరాడాలని ఆశిస్తున్నాను'' అన్నారు.

కన్నప్పలో ఎంట్రీ


● మోహన్‌బాబు, శరత్‌కుమార్

సీనియర్ నటులు మంచు మోహన్‌బాబు, శరత్‌కుమార్ 'కన్నప్ప' మూవీ సెట్స్‌లో ఎంట్రీ ఇచ్చారు. మంచు విష్ణు కలల ప్రాజెక్ట్‌గా రూపొందుతోన్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో అవా ఎంటర్‌టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీపై నటుడు, నిర్మాత మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ మూవీ చిత్రీకరణ ప్రస్తుతం న్యూజిల్యాండ్‌లో జరుగుతోంది. హీరో ప్రభాస్, మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్ వంటి స్టార్స్ ఈ చిత్రంలో నటించనున్న విషయం తెలిసిందే. తాజాగా నటుడు మంచు మోహన్‌బాబు, శరత్ కుమార్ 'కన్నప్ప'లో భాగమైనట్లు ప్రకటించి, వారిద్దరూ కలిసి ఉన్న ఫొటోని విడుదల చేశారు. ''శివ భక్తుడు కన్నప్ప జీవిత చరిత్ర చుట్టూ ఈ చిత్రకథ తిరుగుతుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

తొలి ప్రయత్నంలోనే హిట్టవడం ఆనందం
- నిర్మాత అల్లు అరవింద్


● అల్లు అరవింద్, వంశీ నందిపాటి

'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో గౌరీకృష్ణ నిర్మించిన ఈ సినిమాను గీతా ఆర్ట్స్‌కు చెందిన వంశీ నందిపాటి ఈ నెల 3న విడుదల చేశారు. ఈ సినిమా బ్లాక్‌బస్టర్ దిశగా ముందుకు వెళ్తోందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా వంశీ నందిపాటిని ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ అభినందించారు. వంశీ మంచి అభిరుచిగలవాడని, మొదటి ప్రయత్నంలో చిరస్మరణీయమైన హిట్ అందుకోవడం తనకు ఆనందంగా ఉందని అల్లు అరవింద్ అన్నారు. ఈ సినిమాను హిట్ చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపేందుకు ఈ యూనిట్ నవంబరు 10 నుంచి ఆంధ్రాలో పర్యటించనుందని కూడా ఆయన వెల్లడించారు.

ప్రతి కథకు పలు కోణాలు ఉంటాయి
- అవసరాల శ్రీనివాస్


● అవసరాల, చైత్ర, రుక్మిణి, హేమంత్, అనుదీప్, వివేక్, రక్షిత్ శెట్టి

రక్షిత్ శెట్టి హీరోగా నటించిన కన్నడ చిత్రం 'సప్తసాగరదాచే ఎల్లో: సైడ్ బి'. హేమంత్ రావు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్, చైత్ర జె. ఆచార్ హీరోయిన్లుగా నటించారు. ఈ ఏడాది విడుదలైన 'సప్తసాగరదాచే ఎల్లో: సైడ్ ఏ' సినిమాకు ఇది సీక్వెల్. 'సప్తసాగరదాచే ఎల్లో: సైడ్ బి' సినిమాను తెలుగులో 'సప్తసాగరాలుదాటి సైడ్ బి'గా టీజీ విశ్వ ప్రసాద్ , వివేక్ కూచిభొట్ల ఈ నెల 17న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశానికి ఓ అతిథిగా హాజరైన అవసరాల శ్రీనివాస్ మాట్లాడుతూ– ''ప్రతి కథకు పలు కోణాలు ఉంటాయి. 'సైడ్ ఏ'లో కనిపించని కోణాలు ఏమైనా 'సైడ్ బి'లో కనిపిస్తాయా? అని ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నాను'' అన్నారు. ''సప్తసాగరాలు దాటి సైడ్ ఏ'కు లభించిన ప్రేక్షకాదరణ 'సైడ్ బి'కి కూడా లభిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు మరో అతిథి కేవీ అనుదీప్. రక్షిత్‌శెట్టి మాట్లాడుతూ– ''అతడే శ్రీమన్నారాయణ', '777 చార్లీ', 'సప్త సాగరాలు దాటి సైడ్ ఎ' చిత్రాలపై తెలుగు ప్రేక్షకులు చూపించిన ప్రేమ, ఆదరణ 'సప్త సాగరాలు దాటి సైడ్ బి'కి కూడా లభిస్తాయని ఆశిస్తున్నాను' అన్నారు. ''నా జీవితంలో తారసపడిన కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా 'సప్త సాగరాలు దాటి..' సినిమా కథ రాసుకున్నాను'' అన్నారు హేమంత్ రావు. ''సప్తసాగరాలు దాటి: సైడ్ ఏ'కు లభించినట్లే 'సైడ్ బి'కీ ప్రేక్షకాదరణ లభిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు వివేక్ కూచిభొట్ల.

అవార్డుల కంటే ప్రేక్షకుల గుర్తింపే ముఖ్యం
- దర్శకుడు రాజు మురుగన్



''అవార్డుల కోసం సినిమాలు తీయాలనే ఆలోచన నాకు ఉండదు. ప్రేక్షకులు ఇచ్చే గుర్తింపు, ప్రేమ, అభిమానం, ఆప్యాయత చాలా ముఖ్యం. అవార్డులు వస్తే అదనపు బోనస్‌గా భావిస్తాను. ప్రేక్షకుల ప్రేమ, అభిమానంతో పాటు 'జోకర్' చిత్రానికి జాతీయ అవార్డు తీసుకోవడం నాకు గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. 'జపాన్' కూడా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుంది'' అని దర్శకుడు రాజు మురుగన్ అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'జపాన్'. ఎస్‌ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్‌ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో అన్నపూర్ణ స్టూడియోస్ విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా రాజు మురుగన్ మాట్లాడుతూ– ''నేను సినిమాల్లోకి రావడానికి చార్లీ చాప్లిన్‌గారే స్ఫూర్తి. మూకీ చిత్రాలతోనే ఎన్నో ఆలోచనలు, భావోద్వేగాలను రేకెత్తించారు ఆయన. ఇక కార్తీగారిని దృష్టిలో పెట్టుకునే 'జపాన్' కథ రాశాను. కార్తీ, నిర్మాతలు ప్రభు, ప్రకాశ్‌గార్ల సహకారంతోనే 'జపాన్' చిత్రం ఇంత గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది. ఒక దర్శకుడిగా చిన్నా పెద్దా అని కాకుండా అన్ని రకాల సినిమాలు చేయాలనుకుంటున్నాను'' అన్నారు.

కథే హీరో
- దినేష్ తేజ్



దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ హీరో హీరోయిన్లుగా నటించిన లవ్ స్టోరీ ఫిల్మ్ 'అలా నిన్ను చేరి..'. మారేష్ శివన్ దర్శకత్వంలో కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో దినేష్ తేజ్ మాట్లాడుతూ– ''జీవితంలోని ఓ దశలో ప్రేమ ముఖ్యమా? లక్ష్యం ముఖ్యమా? అంటూ ప్రతి మధ్యతరగతి అబ్బాయి గురయ్యే సంఘర్షణను ఇందులో చూపించాం. ఈ సినిమాలో నేను కొత్తగా కాస్త కమర్షియల్ రోల్‌లో నటించాను. ఓ మంచి సినిమా చూశామనే ఫీలింగ్‌తో ప్రేక్షకులు థియేటర్స్ నుంచి బయటకి వస్తారని చెప్పగలను. కథ ఉంటేనే ఏమైనా చేయగలం. అందుకే కథే హీరో అని నమ్మే వ్యక్తిని నేను. ప్రేక్షకులు మెచ్చుకునే కథల్లో భాగం కావాలనుకుంటాను'' అన్నారు.

నిర్మాత వేణుగోపాల్ మృతి


● వేణుగోపాల్

'నక్షత్రం'(2017) సినిమా నిర్మాతల్లో ఒకరైన ఎస్‌వీఎస్ వేణుగోపాల్(60) బుధవారం రాత్రి మృతిచెందారు. కాచిగూడ నుంచి మహబూబ్‌నగర్ వెళుతున్న రైలు నుంచి ఆయన ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందారు. సీరియల్స్ నిర్మాతగా ఆయన బుల్లితెర ప్రేక్షకులకు సుపరిచితులే. 'ఆనందో బ్రహ్మ' (1996) సీరియల్‌తో నిర్మాతగా ఆయన ప్రస్థానం మొదలైంది. దాదాపు పది సీరియల్స్ నిర్మించారాయన. 'ప్రియురాలు పిలిచె' ఆయన తీసిన చివరి సీరియల్. 'తులసీదళం' సీరియల్‌కి నంది అవార్డు అందుకున్నారు వేణుగోపాల్. సినిమా నిర్మాతగా 'నక్షత్రం' ఆయన తొలి చిత్రం.. అదే చివరి చిత్రం కూడా. హీరో చిరంజీవి నటించిన తొలి టీవీ షో 'విజయం వైపు పయణం' కి వేణుగోపాల్ నిర్మాత. ఈ షోకి యండమూరి వీరేంద్రనాథ్ దర్శకత్వం వహించారు. వేణుగోపాల్‌కి భార్య, ఇద్దరు కుమారులున్నారు. వేణుగోపాల్ మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. నేడు ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. కాగా 'నక్షత్రం' సినిమా నిర్మాతల్లో ఒకరైన సజ్జు మాట్లాడుతూ– ''వేణుగోపాల్‌గారు రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందారు. ఆయన ఆత్మహత్య చేసుకున్నాడన్నది అవాస్తవం. ఆయనకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవు'' అన్నారు.

నాలుగేళ్లు పరిశోధన చేశాను
- దర్శకుడు ఓంకార్ శ్రీనివాస్



హన్సిక టైటిల్ రోల్ చేసిన తాజా చిత్రం 'మై నేమ్ ఈజ్ శృతి'. ఓంకార్ శ్రీనివాస్ దర్శకత్వంలో బురుగు రమ్యా ప్రభాకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఓంకార్ శ్రీనివాస్ మాట్లాడుతూ– ''కొన్ని సినిమాలకు దర్శకత్వ విభాగంలో చేసిన నాకు 'మై నేమ్ ఈజ్ శృతి' దర్శకుడిగా తొలి చిత్రం. ఓ అమ్మాయి జీవితంలో జరిగిన వాస్తవ ఘటన స్ఫూర్తిగా తీసుకుని ఈ చిత్రకథ రాసుకున్నాను. స్కిన్ మాఫియా గురించిన స్క్రీన్‌ప్లే బేస్డ్ ఫిల్మ్ ఇది. హన్సికగారి అమ్మగారు స్కిన్ డాక్టర్ కావడంతో ఈ కథకు హన్సికగారు బాగా కనెక్ట్ అయ్యారు. జీవితంలో ఓ కలను నిజం చేసుకునేందుకు గ్రామం నుంచి సిటీకి వచ్చిన శృతి (హన్సిక పాత్ర పేరు) స్కిన్ మాఫియా ట్రాప్‌లో ఎలా చిక్కుకుంది? ఆ తర్వాత తనను తాను ఏ విధంగా కాపాడుకోగలిగింది? అనేది ఈ చిత్రం కథాంశం. మగవారికంటే మహిళలు చాలా స్ట్రాంగ్‌గా ఉంటారని, పెప్పర్ స్ప్రేలు లేకపోయినా తలలో ఉండే ఓ సేఫ్టీ పిన్‌తో కూడా ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోగలరని ఈ సినిమాలో చూపించాం. ఈ సినిమా కోసం నాలుగేళ్లు పరిశోధన చేశాను'' అని అన్నారు.


'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 230

శుక్రవారం 10-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



జ్యోతి సురేఖకు స్వర్ణం, రజతం

ఆసియా ఆర్చరీలో రెండు పతకాలు గెలిచిన ఏపీ క్రీడాకారిణి. - 15లో



ఈక్విటీలోకి భారీ పెట్టుబడులు

అక్టోబర్‌లో రూ.20,000 కోట్లు రాక. సిప్ రూపంలో రూ.17వేల కోట్లు. -12లో



గాజా సిటీపై దండయాత్ర

హమాస్ మిలిటెంట్లపై ఇజ్రాయెల్ యుద్ధం మరో మలుపు తిరిగింది. పెద్ద నగరమైన గాజా సిటీని ఇజ్రాయెల్ సైన్యం చుట్టుముట్టింది.

- వివరాలు 6లో



ఆ 8 మందికి మరణశిక్షపై అప్పీల్

గూఢచర్యానికి పాల్పడ్డారనే ఆరోపణలపై 8 మంది మాజీ నేవీ అధికారులపై ఖతర్ కోర్టు విధించిన మరణశిక్షపై భారత్ అప్పీల్ చేసింది.

- వివరాలు 6లో



రిలయన్స్, ఇన్ఫీ షేర్లు పడేశాయ్

రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు 1% పతనంతో సూచీలు గురువారం నష్టాలు చవిచూశాయి.

- వివరాలు 12లో



రిషి సునాక్ ఇంట దీపావళి వేడుక

బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్, అక్షతా మూర్తి దంపతులు తమ అధికార నివాసంలో దీపావళి వేడుకలు జరుపుకున్నారు.

- వివరాలు 6లో

జంగ్ తెలంగాణ

ఎన్నికల బరిలో వారసులు..

రాజకీయాల్లోకి రెండోతరం

ఇందూరుకు ఇవి కావాలి..

పీపుల్స్ మేనిఫెస్టో

జాతి కోసమే బతికిన నేతల ఆశయమేదీ?

ఆ వారసత్వం మసకబారడానికి కారణాలేంటి?

నైతికత లోపిస్తున్న రాజకీయం...

చట్టసభల్లో అసభ్య పద ప్రయోగం

ఎన్నికల తీరుపై సాక్షితో సీనియర్ నేత డీకే సమరసింహారెడ్డి

బరిలో బంధువులు

- వివరాలు 7,8లో



గురువారం కొడంగల్ రోడ్‌షోలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సీఎం కేసీఆర్ గొంతు నొక్కే కుట్ర..

- తెలంగాణపై ఢిల్లీ నేతల దండయాత్ర: మంత్రి కేటీఆర్
- 55 ఏళ్లలో కాంగ్రెస్, తొమ్మిదిన్నరేళ్లలో బీజేపీ.. రాష్ట్రానికి ఏం చేశాయని ధ్వజం
- సిరిసిల్లలో నామినేషన్ వేసిన కేటీఆర్.. కొడంగల్‌లో రోడ్‌షో

2లో

కేటీఆర్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం..

- ఆర్మూర్‌లో ప్రచారరథానికి సడెన్ బ్రేక్ వేయడంతో విరిగిన రెయిలింగ్
- వాహనం పైనుంచి కిందికి జారిన మంత్రి
- కింద పడిన ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి -2లో

అంతా జనంలోనే!

దీపావళి తర్వాత 16 రోజుల్లో మరో 54 బీఆర్‌ఎస్ సభలు

- అవసరమైన చోట కేటీఆర్, హరీశ్‌రావు రోడ్‌షోలు కూడా..
- 60కిపైగా స్థానాల్లో పరిస్థితిని పర్యవేక్షిస్తున్న ఇన్‌చార్జులు
- పార్టీ అభ్యర్థితో పొసగని నేతలకు ఇతర చోట్ల బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కూడా ముగుస్తుండటంతో పూర్తిగా క్షేత్ర స్థాయిలో ప్రచారంపై ఫోకస్ చేయాలని బీఆర్‌ఎస్ నిర్ణయించింది. ఈ నెల 28న ఎన్నికల ప్రచారం ముగుస్తున్న నేపథ్యంలో.. వచ్చే 20రోజుల పాటు పార్టీ యంత్రాంగం మొత్తాన్ని ప్రజాక్షేత్రంలోకి తెచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ పాల్గొనే బహిరంగ సభలతోపాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీశ్‌రావులతో రోడ్‌షోలు, సభల నిర్వహణకు షెడ్యూల్ ఖరారైంది. ప్రచార గడువు ముగిసేవరకు కూడా పార్టీ అభ్యర్థులు, మిగతా 2వ పేజీలో ▶

నీలం స్థానంలో కాట..

పటాన్‌చెరు అభ్యర్థి మార్పు.. కాంగ్రెస్ చివరి జాబితా ప్రకటన

- తన అనుచరుడికే ఆ టికెట్ లభించేలా పంతం నెగ్గించుకున్న దామోదర రాజనర్సింహ
- సూర్యాపేట సీటు కోసం పటేల్ రమేశ్‌రెడ్డి పోరాడినా ఆర్. దామోదర్‌రెడ్డి వైపే మొగ్గిన అధిష్టానం
- తుంగతుర్తి నుంచి అనూహ్యంగా మందుల శామ్యూల్

సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల పర్వం శుక్రవారంతో ముగుస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థుల చివరి, నాలుగో జాబితాను గురువారం రాత్రి ప్రకటించింది. మిగిలిన నాలుగు స్థానాలకు కొత్తగా అభ్యర్థులను ప్రకటించడంతోపాటు అదనంగా పటాన్‌చెరు అభ్యర్థిని మార్చింది. ఈ స్థానంపై తలెత్తిన పంచాయితీని పరిష్కరించింది. ముందుగా ప్రకటించిన నీలం మధు ముదిరాజ్ స్థానంలో పాతకాపు కాట శ్రీనివాస్‌గౌడ్ వైపే మిగతా 14వ పేజీలో ▶



16 నుంచి కాంగ్రెస్ ప్రచార హోరు

- ఉధృతంగా రాహుల్, ప్రియాంక ప్రచారం.. షెడ్యూల్ రూపొందిస్తున్న టీపీసీసీ
- వారు వారానికిపైగా రాష్ట్రంలోనే ఉండేలా ప్రణాళిక.. జిల్లాల్లో పర్యటనలు -14లో
- చివరిగా సోనియా గాంధీ సభతో ప్రచార పర్వాన్ని ముగించాలనే యోచన





'అడ్వాన్స్‌డ్' మోతాదూ తగ్గింపు..!

- ఎన్‌టీఏపై రాష్ట్రాల ఒత్తిడి.. జేఈఈ మెయిన్స్ సిలబస్ మాదిరి మార్పులకు అవకాశం
- నిపుణులతో ఎన్‌టీఏ సమాలోచనలు.. మేథ్స్‌లో కొన్ని టాపిక్స్ తప్పించే యోచన - 3లో

14 నుంచి లాసెట్ కౌన్సెలింగ్

- వివరాలు 3లో

కేటీఆర్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం

డ్రైవర్ సడెన్ బ్రేక్.. విరిగిన ప్రచారరథం రెయిలింగ్

- వాహనం పైనుంచి కిందికి జారిన మంత్రి
- కింద పడిన రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి



వాహనం మీది నుంచి కిందకు జారుతున్న మంత్రి కేటీఆర్ (వృత్తంలో)

ఆర్మూర్/సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్రమంత్రి కె.తారకరామారావుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ప్రచారరథం రెయిలింగ్ విరిగిపోవడంతో వాహనంపైనున్న ఆయన కిందికి జారారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో గురువారం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ పార్టీ ఆర్మూర్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో కేటీఆర్ పాల్గొన్నారు. పట్టణశివారులోని ధోబీఘాట్ నుంచి కిందిబజార్, గోల్‌బంగ్లా మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీ బయలుదేరింది. ప్రచారరథంపై కేటీఆర్, జీవన్‌రెడ్డి, ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి, ఇతర నేతలు నిలబడి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగుతున్నారు. మార్గమధ్యంలో ఓ చోట విద్యుత్ వైర్లు కొద్దిగా కిందికి వేలాడుతుండటంతో అప్రమత్తమైన ప్రచారరథం డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయగా వాహనం రెయిలింగ్ విరిగిపోయింది. దీంతో రెయిలింగ్ పట్టుకొని నిలబడి ఉన్న కేటీఆర్, జీవన్‌రెడ్డి కిందికి జారారు. రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి మాత్రం అదుపు తప్పి వాహనం పైనుంచి కింద పడిపోయారు. ఆయనకు స్వల్పగాయాలు కావడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత నామినేషన్ కేంద్రానికి వెళ్లకుండానే కేటీఆర్ కొడంగల్ రోడ్ షోలో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లిపోయారు.

నాకేమీ కాలేదు: కేటీఆర్

ఆర్మూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి తరఫున ప్రచారానికి వెళ్లినప్పుడు చిన్న ప్రమాదం జరిగిందని, తనకేమీ కాలేదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి కేటీఆర్ 'ఎక్స్'(ట్విట్టర్)లో స్పష్టం చేశారు. ప్రమాదంపై ఆందోళన చెందిన, తన గురించి వాకబు చేసిన వారందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

సారుకు కారు లేదు!



గురువారం గజ్వేల్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న సీఎం కేసీఆర్

- కేసీఆర్‌తోపాటు సతీమణి శోభమ్మకు కలిపి రూ. 58.93 కోట్ల ఆస్తులు
- నామినేషన్లతో సమర్పించిన ఎన్నికల అఫిడవిట్లలో వివరాలు వెల్లడి

సాక్షి, సిద్దిపేట/ సాక్షి, కామారెడ్డి: బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తన పేరిట విడిగా సొంత కారు, ద్విచక్ర వాహనం, వ్యవసాయ భూమి వంటివేవీ లేవని ఎన్నికల అఫిడవిట్లలో పేర్కొన్నారు. గురువారం గజ్వేల్, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా కేసీఆర్ నామినేషన్లు వేశారు. ఈ సందర్భంగా తనతోపాటు సతీమణి ఆస్తులు, అప్పులు, కేసుల వివరాలను వెల్లడించారు.

- కేసీఆర్, సతీమణి శోభమ్మకు కలిపి మొత్తం ఆస్తులు రూ.58,93,31,800 కాగా.. ఇందులో చరాస్తులు రూ.35,43,31,800, స్థిరాస్తులు రూ.23.50 కోట్లు ఉన్నాయి. మొత్తం అప్పులు రూ.24,51,13,631 ఉన్నాయి. ఇందులో ఇద్దరి పేరిట విడివిడిగా ఉన్న ఆస్తులు కొన్ని, ఉమ్మడిగా మరికొన్ని ఉన్నాయి.
- విడిగా పరిశీలిస్తే.. కేసీఆర్ చరాస్తులు రూ.17,83,87,492. ఇందులో 95 గ్రాముల బంగారం (రూ. 17.40 లక్షలు విలువ), చేతిలో నగదు రూ 2,96,605 ఉన్నాయి. ఆయన పేరిట ఉన్న స్థిరాస్తుల విలువ రూ.8.5 కోట్లు. రూ.17,27,61,818 అప్పులు ఉన్నాయి.
- కేసీఆర్ సతీమణి శోభమ్మ పేరిట ఉన్న చరాస్తుల విలువ రూ.7,78,24,488 ఉండగా అందులో 2.841 కిలోల బంగారు అభరణాలు, 45 కేజీల వెండి వస్తువులు (రూ.1,49,16,084 విలువ), అప్పులు ఏమీ లేవు.
- కేసీఆర్, శోభమ్మ ఉమ్మడి ఆస్తులు రూ.24,81,19,820 ఉన్నాయి. ఇందులో ఉమ్మడి చరాస్తుల విలువ రూ.9,81,19,820. (దీనిలో రూ.1,16,72,256 విలువైన 14 వాహనాలు ఉన్నాయి), ఉమ్మడి స్థిరాస్తుల విలువ రూ.15 కోట్లు. ఉమ్మడి అప్పులు రూ.7,23,51,813.
- కేసీఆర్ దంపతులు సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలో 2010 సంవత్సరం నుంచీ ఉమ్మడి ఆస్తులుగా వ్యవసాయ భూమిని కొనుగోలు చేయడం ప్రారంభించారు. ఇప్పటివరకు రూ.1,35,00,116 విలువైన 53.30 ఎకరాల వ్యవసాయ భూమిని కొన్నట్టు అఫిడవిట్‌లో తెలిపారు. అలాగే 9.365 ఎకరాల వ్యవసాయేతర భూమి ఉందని, దానికి నాలా పన్నును సైతం చెల్లించామని వివరించారు.
- కేసీఆర్‌కు ముఖ్యమంత్రిగా వచ్చే వేతనం/అలవెన్సులతోపాటు వ్యవసాయ ఆదాయం.. సతీమణి శోభమ్మకు బ్యాంకులోని డిపాజిట్ల నుంచి వచ్చే వడ్డీని ఆదాయంగా చూపించారు. కేసీఆర్‌పై తెలంగాణ ఉద్యమ సమయంలో నమోదైన 9 కేసులు ఉన్నట్టు తెలిపారు.

కేసీఆర్ గొంతు నొక్కే కుట్ర

- తెలంగాణపై ఢిల్లీ నేతల దండయాత్ర: మంత్రి కేటీఆర్
- వారి కుట్రలు, కుతంత్రాలకు ప్రజలు లొంగవద్దు
- అంతా ఆలోచించి ఓటు వేయాలని పిలుపు
- సిరిసిల్లలో నామినేషన్ వేసిన కేటీఆర్.. కొడంగల్‌లో రోడ్‌షో



కొడంగల్ రోడ్‌షోలో మంత్రి కేటీఆర్

సిరిసిల్ల/ కొడంగల్: తెలంగాణ 60ఏళ్ల గోస పోయేలా సీఎం కేసీఆర్ పోరాడి రాష్ట్రాన్ని సాధించారని.. తెలంగాణ కోసం మాట్లాడే ఏకైక వ్యక్తి కేసీఆర్ గొంతు నొక్కేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారకరామారావు ఆరోపించారు. కేసీఆర్‌ను ఎలాగైనా ఓడించాలన్న ఉద్దేశంతో ఢిల్లీ, గుజరాత్, కర్ణాటక నేతలు తెలంగాణపై దండయాత్ర చేస్తున్నారని పేర్కొన్నారు. గురువారం సిరిసిల్లలో బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తర్వాత కొడంగల్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. రెండు చోట్లా కేటీఆర్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

''రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని కులమతాలకు అతీతంగా, అవినీతి రహితంగా అందించాం. ఒక్క చాన్స్ ఇవ్వాలని అడుగుతున్న కాంగ్రెస్ పార్టీ గత 55 ఏళ్లలో ఏం చేసింది? కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తొమ్మిదిన్నరేళ్లలో తెలంగాణకు ఏం చేసిందో చెప్పాలి? నిరంతర కరెంట్, సాగునీరు, తాగునీరు, రైతుబీమా, రైతుబంధు, నేతన్నబంధు వంటి పథకాలపై ఆలోచన కూడా చేయని ఆ పార్టీలకు ఎందుకు ఓటెయ్యాలి? అన్ని రంగాల్లో తెలంగాణ ఆదర్శంగా ఉంది. ప్రలోభాలకు లొంగిపోతే మోసపోతాం, గోసపడతాం. కుట్రలకు, కుతంత్రాలకు ప్రజలు లొంగిపోవద్దు. ఢిల్లీకి దాసులైన నేతల మాటలు నమ్మొద్దు.

కేసీఆర్ సీఎం కావడం ఖాయం

సీఎం కేసీఆర్ ప్రజలను కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నారు. ఆయన ముచ్చటగా మూడోసారి సీఎం కావడం ఖాయం. బీఆర్ఎస్ ఏనాడూ కులం పేరుతో కుంపట్లు, మతం పేరుతో మంటలు పెట్టలేదు. మోసం చేసే దొంగలు ఢిల్లీ నుంచి వస్తున్నారు. మూకుమ్మడి దాడులు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేయాలి''అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

రేవంత్‌ను గెలిపిస్తే అమ్మేసుకుంటారు

టీపీసీసీ చీఫ్, కొడంగల్ కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి భూముల వ్యాపారం చేసే బ్రోకర్ అని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్‌కు ఓట్లు వేసి గెలిపిస్తే.. కొడంగల్‌ను ప్లాట్లుగా చేసి అమ్మేసుకుంటారని ఆరోపించారు. అదే బీఆర్ఎస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపిస్తే కేసీఆర్ కాళ్లు పట్టుకొని అయినా ఆయనకు ప్రమోషన్ ఇప్పిస్తానని చెప్పారు. ''ఓటుకు నోటు దొంగ జైలుకు పోవడం ఖాయం. కొడంగల్‌ను ఏనాడూ పట్టించుకోని రేవంత్‌రెడ్డి కావాలా?.. ఎల్లప్పుడూ జనం మధ్య ఉండే నరేందర్‌రెడ్డి కావాలా మీరే నిర్ణయించుకోండి. కాంగ్రెస్ వాళ్లు ఇచ్చే డబ్బులు తీసుకుని.. కారు గుర్తుకు ఓటేయండి..''అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

కేటీఆర్ దంపతుల ఆస్తి రూ.51.26 కోట్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: సిరిసిల్ల నియోజకవర్గంలో గురువారం నామినేషన్ వేసిన సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ తన ఆస్తుల వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించారు. దాని ప్రకారం.. కేటీఆర్ మొత్తం ఆస్తులు రూ.17.34 కోట్లు. ఇందులో చరాస్తులు రూ.6.92 కోట్లు, స్థిరాస్తులు రూ.10.41 కోట్లు. అప్పులు రూ.67.20 లక్షల మేర ఉన్నాయి. కేటీఆర్ భార్య శైలిమ పేరిట రూ.26.49 కోట్ల చరాస్తులు, రూ.7.42 కోట్ల స్థిరాస్తులు కలిపి మొత్తంగా రూ.33.92 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. రూ.11.27 కోట్ల మేర అప్పులు ఉన్నాయి. కేటీఆర్ దంపతులు ఇద్దరికీ కలిపి ఉన్న ఆస్తుల విలువ సుమారు రూ.51.26 కోట్లు.

అంతా జనంలోనే!

▶ మొదటి పేజీ తరువాయి

ఇన్‌చార్జులు, ఇతర ముఖ్య నేతలెవరూ తమకు ప్రచార, సమన్వయ బాధ్యతలు అప్పగించిన చోటి నుంచి కదలవద్దని పార్టీ అధినేత ఆదేశించారు. పార్టీ తీవ్ర పోటీ ఎదుర్కొంటున్న సెగ్మెంట్లతో పాటు బీఆర్ఎస్ అభ్యర్థులు బలహీనంగా ఉన్నచోట ఇప్పటికే 60 మందికిపైగా నాయకులకు ఇన్‌చార్జులుగా సమన్వయ బాధ్యతలు అప్పగించారు. కీలక నియోజకవర్గాల్లో స్థానికంగా పార్టీ యంత్రాంగాన్ని కదిలించి ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు మండల స్థాయిలోనూ ఇన్‌చార్జులను నియమిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు జరుగుతుండటంతో సొంత నియోజకవర్గం వదిలి ఇతర నియోజకవర్గాలకు వెళ్లేందుకు పార్టీ ద్వితీయ, తృతీయ శ్రేణి నేతలు ఆసక్తి చూపడం లేదు. ఈ క్రమంలో పార్టీ అభ్యర్థులపై అసంతృప్తి ఉన్న నేతలను గుర్తించి వారికి ఇతర నియోజకవర్గాల్లో మండల స్థాయిలో బాధ్యతలు అప్పగిస్తున్నారు.

దీపావళి తర్వాత మళ్లీ కేసీఆర్ సభలు

అభ్యర్థుల ఎంపిక, బీఫారాల జారీతోపాటు బహిరంగ సభల నిర్వహణలోనూ బీఆర్ఎస్ విపక్షాలతో పోలిస్తే దూకుడుగా వ్యవహరిస్తోంది. గత నెల 15న బీఫారాల జారీని ప్రారంభించడంతో పాటు హుస్నాబాద్‌లో బహిరంగ సభతో ఎన్నికల ప్రచారానికి కేసీఆర్ శ్రీకారం చుట్టారు. గత నెల 15 నుంచి ఈ నెల 9 వరకు 17 రోజుల వ్యవధిలో 43 చోట్ల కేసీఆర్ సభలు నిర్వహించారు. దీపావళి పండుగ నేపథ్యంలో 10 నుంచి 12వ తేదీ వరకు విరామం ప్రకటించారు. తిరిగి ఈ నెల 13 నుంచి 28వ తేదీ వరకు 54 నియోజకవర్గాల్లో జరిగే సభల్లో కేసీఆర్ పాల్గొంటారు. మొత్తంగా ఎన్నికల ప్రచారం ముగిసే నాటికి 97 నియోజకవర్గాలను చుట్టేయనున్నారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పోటీచేస్తున్న జనగామలో ఇప్పటికే ఒక బహిరంగ సభలో పాల్గొన్న కేసీఆర్.. ఆ నియోజకవర్గంలోని చేర్యాలలో ఈ నెల 18న రోడ్‌షో నిర్వహించనున్నారు. కేసీఆర్ ప్రచారంలో ఇదొక్కటి మాత్రమే రోడ్‌షో. మిగతావన్నీ సభలే. ఈ నెల 28న గజ్వేల్‌లో ప్రచారంతో కేసీఆర్ పర్యటనలు ముగుస్తాయి. తొలి విడతలో సీఎం కేసీఆర్ సభలు జరిగిన నియోజకవర్గాల్లో కేటీఆర్, హరీశ్‌రావుల రోడ్‌షోలు, బహిరంగ సభలు ఉండే అవకాశముంది. మరోవైపు 38 మంది స్టార్ క్యాంపెయినర్ల పేర్లతో కూడిన జాబితాను బీఆర్ఎస్ గురువారం కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించినట్లు తెలిసింది.

అఫిడవిట్లను జల్లెడ పడుతున్న లీగల్ సెల్

నామినేషన్ల దాఖలు గడువు శుక్రవారం ముగుస్తుండగా పార్టీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలు, అఫిడవిట్లను బీఆర్ఎస్ లీగల్ సెల్ జల్లెడ పడుతోంది. ఇటీవల పార్టీ ఎమ్మెల్యేల అఫిడవిట్లపై న్యాయపరమైన చిక్కులు తలెత్తిన నేపథ్యంలో.. వీలైనంత మేర నామినేషన్ల పత్రాల్లో లోపాలు దొర్లకుండా లోతుగా పరిశీలించి గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారు.

వార్‌రూమ్‌లతో సమన్వయం

నియోజకవర్గాల స్థాయిలో వార్‌రూమ్‌లను ఏర్పాటు చేసిన బీఆర్ఎస్.. వాటిని హైదరాబాద్‌లోని సెంట్రల్ వార్‌రూమ్‌తో అనుసంధానం చేసింది. పార్టీ అధినేత కేసీఆర్‌తోపాటు కేటీఆర్, హరీశ్‌రావుల దిశానిర్దేశం మేరకు సెంట్రల్ వార్‌రూమ్ ఎప్పటికప్పుడు నియోజకవర్గాల వార్‌రూమ్‌లతో సమన్వయం చేసుకుంటోంది. ఎన్నికల వ్యూహాలు, ఎత్తుగడలు, ప్రచార తీరుతెన్నులు తదితరాలపై ఎప్పటికప్పుడు ఆదేశాలు పంపుతోంది. వాట్సాప్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాలు వేదికగా కూడా పార్టీ ప్రచార సరళిని పర్యవేక్షిస్తున్నారు. వివిధ సంస్థల నుంచి అందుతున్న సర్వే నివేదికలు, ఫీడ్‌బ్యాక్ ఆధారంగా క్షేత్రస్థాయిలో పార్టీ అభ్యర్థులు, ప్రచార తీరుతెన్నులను బీఆర్ఎస్ పెద్దలు మదింపు చేస్తూ.. వ్యూహాలకు పదును పెడుతున్నారు.

వారికి ఓటేస్తే రాష్ట్రం పదేళ్లు వెనక్కి

మంత్రి హరీశ్‌రావు

- సీఎం కేసీఆర్ చేతుల్లో రాష్ట్రం క్షేమంగా ఉంటుంది
- తెలంగాణను ఆయన ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా మార్చారు
- సిద్దిపేటలో నామినేషన్ దాఖలు చేసిన మంత్రి



నామినేషన్ అనంతరం డప్పు కొట్టి ఉత్సాహ పరుస్తున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: 'అప్పుడే పుట్టిన బిడ్డ తల్లి చేతుల్లో ఉంటే ఎలా క్షేమంగా ఉంటదో సీఎం కేసీఆర్ చేతుల్లో రాష్ట్రం కూడా అంతే క్షేమంగా ఉంటుంది. కేసీఆర్‌ను కాదని ఇతర పార్టీలకు ఓట్లు వేయొద్దు. బీజేపీ, కాంగ్రెస్‌లకు ఓటు వేస్తే రాష్ట్రం పదేళ్ల తిరిగి వెనుకకు పోతుంది'అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం ఆయన సిద్దిపేటలో నామినేషన్ వేశారు. అంతకుముందు హరీశ్‌రావు మరో మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలసి జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. నామినేషన్ అనంతరం ఆయన సిద్దిపేటలో మీడియాతో మాట్లాడుతూ, గతంలో తెలంగాణలో కరువు కాటకాలు, ఆకలి చావులు, వలసలు ఉండేవన్నారు. ఇప్పుడు సీఎం కేసీఆర్ తెలంగాణను ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా మార్చారని చెప్పారు. తండ్రి వయసు ఉన్న కేసీఆర్‌పై కొందరు నాయకులు సంచలనాల కోసం నోరుపారేసుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రైవేట్ రంగంలో 24 లక్షల ఉద్యోగాలు, ఐటీలో 6 లక్షల ఉద్యోగాలు, ప్రభుత్వ రంగంలో 1.80 లక్షల ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి చేయలేదన్నారు. తెలంగాణలో బీజేపీ తుడిచి పెట్టుకుపోయిందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీకి రాష్ట్రం మొత్తంలో ఒక్క సీటు కూడా రాదని, డక్ ఔట్ అవుతుందని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో సిద్దిపేట నియోజకవర్గానికి 7వ సారి నామినేషన్ వేశానని చెప్పారు.

గుంట భూమి లేదు..

మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ అభ్యర్థి తన్నీరు హరీశ్‌రావు తన పేరు మీద ఒక్క గుంట వ్యవసాయ భూమి కూడా లేదని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. గురువారం నామినేషన్ వేసిన హరీశ్‌రావు తన ఆస్తులు, అప్పులు, కేసుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపారు.

హరీశ్‌రావు

క్యాష్ ఇన్ హ్యాండ్:	రూ.3,50,618
చరాస్తులు	: రూ. 48,93,771
వ్యవసాయ భూమి:	లేదు
స్థిరాస్తులు	: రూ.35.50 లక్షలు
అప్పులు	: లేవు
వాహనం	: ఇన్నోవా ఉంది
కేసులు	: మూడు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి
ఆయుధాలు	: లైసెన్స్‌డ్ పిస్టోల్ ఉంది

సతీమణి శ్రీనిత

క్యాష్ ఇన్ హ్యాండ్:	రూ. 5,82,239
చరాస్తులు	: రూ.13,42,27,028 (అందులో రూ 2,27,40,260 విలువ గల బంగారు ఆభరణాలు.. 2.034 కిలోలు. రూ.24,38,798 విలువ చేసే 17 కిలోల వెండి వస్తువులు ఉన్నాయి)
స్థిరాస్తులు	: రూ.4,33,65,000
అప్పులు	: రూ.11,30,45,200

ఉమ్మడి ఆస్తులు

క్యాష్ ఇన్ హ్యాండ్ రూ. 27,805 చరాస్తులు: 14,87,400

ఉమ్మడి స్థిరాస్తులు: రూ.5,50,86,540 (అందులో వ్యవసాయ భూమి 21.05 ఎకరాల విలువ: రూ. 2,96,34,847)

అప్పులు రూ.19,55,922

కూతురు వైష్ణవి

చరాస్తులు: రూ. 2,96,997

చురక పెట్టాలె..!



కామారెడ్డిలో గురువారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు భారీగా హాజరైన ప్రజలు

▶ మొదటి పేజీ తరువాయి

ఆంధ్రలో కలిపారు. మనోళ్లు అప్పుడు నెత్తీనోరు కొట్టుకున్నరు. సిటీ కాలేజీ విద్యార్థులు ఇడ్లీ సాంబార్ గోబ్యాక్ అని ఉద్యమం చేస్తే.. ఏడుగురు పిల్లల్ని కాల్చిచంపిన చరిత్ర కాంగ్రెస్‌ది. తెలంగాణ సాధించుకున్న సమయంలో ఇక్కడ పరిస్థితులు ఎట్లా ఉండె.. ఇప్పుడు ఎట్లా ఉన్నయో ఆలోచించాలి. నేను కేంద్ర కార్మిక మంత్రిగా పనిచేసిన. దేశంలో 16 రాష్ట్రాల్లో బీడీ కార్మికులు ఉన్నారు. అందులో బీడీ కార్మికులకు జీవనభృతి ఇస్తున్న రాష్ట్రం ఒక్క తెలంగాణనే. కటాఫ్ డేట్ తొలగించి అందరికీ జీవనభృతి ఇస్తాం.

కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

రాష్ట్రం వచ్చాక ఎన్నో విజయాలు సాధించినం. 24 గంటల కరెంటు ఇచ్చి వ్యవసాయాన్ని నిలబెట్టినం. రైతులకు పెట్టుబడి కోసం రైతుబంధు ఇచ్చి అండగా నిలిచినం. ఇప్పుడు రూ.10 వేలు ఇస్తున్నం. రాబోయే రోజుల్లో రూ.16 వేలకు పెంచుకుంటం. దేశంలో ఎక్కడా 24 గంటల కరెంటు లేదు. ఎక్కడా రైతుబంధు లేదు. ఏదైనా పరిస్థితుల్లో రైతు చనిపోతే రైతుబీమాతో రూ.5లక్షలు అందించి ఆ కుటుంబాన్ని ఆదుకుంటున్నాం. కరెంటు మీద, రైతుబంధు మీద కాంగ్రెస్ లీడర్లు ఏమేమో మాట్లాడుతున్నరు. ఎద్దు ఎవుసం తెలువని రాహుల్‌గాంధీ ధరణిని తీసేస్తనంటడు. ధరణి పోతే మళ్ల వీఆర్వో, గిర్దావర్, నాయబ్ తహసీల్దార్, తహసీల్దార్, ఆర్డీవో.. ఇట్లా అందరి చేతుల్లోకి భూమి పోయి, రికార్డులన్నీ తారుమారై జనం ఆగం కావాలన్నదే వాళ్ల ఉద్దేశం. కాంగ్రెస్ పార్టీ నేతలకు ఓటుతో బుద్ధి చెప్పాలి.

బీజేపీ నేతలను నిలదీయాలి: ప్రధాని మోదీ మోటార్లకు మీటర్లు పెట్టాలని ఒత్తిడి చేస్తే మేం పెట్టబోమని స్పష్టం చేసిన. అందుకు రూ.25వేల కోట్లు లాస్ చేశారు. అయినా వెనక్కి తగ్గలేదు. దేశవ్యాప్తంగా కేంద్రం తరఫున 157 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మంజూరు చేసిన మోదీ తెలంగాణకు మాత్రం ఒక్కటి కూడా ఇవ్వలేదు. అలాంటి బీజేపీకి ఒక్క ఓటూ వెయ్యకుండా చురుకు (వాత) పెట్టాలి. బీజేపీ నేతలను ఎక్కడికక్కడ నిలదీయాలి...'' అని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. ఈ సభలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు కేశవరావు, బీబీపాటిల్, ప్రభుత్వ విప్ గంప గోవర్దన్, ఎమ్మెల్యే సింధే, ఎమ్మెల్సీలు సుభాష్‌రెడ్డి, రఘోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొలుత గజ్వేల్‌లో.. తర్వాత కామారెడ్డిలో..

సీఎం కేసీఆర్ గురువారం ఉదయం ఎర్రవల్లిలోని తన ఫామ్‌హౌస్ నుంచి హెలికాప్టర్‌లో గజ్వేల్‌కు చేరుకున్నారు. అక్కడి ఆర్డీవో కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా రెండు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఆ పత్రాలను పరిశీలించి, స్వీకరించిన అధికారులు కేసీఆర్‌తో ఎన్నికల ప్రతిజ్ఞ చేయించారు. సాదాసీదాగా జరిగిన ఈ కార్యక్రమం అనంతరం కేసీఆర్ హెలికాప్టర్‌లో కామారెడ్డికి చేరుకున్నారు. అక్కడ ఆర్డీవో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను సమర్పించారు. అనంతరం కామారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొని ప్రసంగించారు.

ఒకేసారి అటు వివేక్, ఇటు బాల్క

నామినేషన్‌కు వచ్చిన నాయకులు.. చెన్నూర్ తహసీల్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

చెన్నూర్: మంచిర్యాల జిల్లా చెన్నూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నామినేషన్ల సమయంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు ఒకే సమయంలో నామినేషన్ దాఖలుకు రావడంతో ఇరుపార్టీల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. కాంగ్రెస్ చెన్నూర్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి కోటపల్లి మండలం పారుపల్లి గ్రామంలోని భైరవుని ఆలయంలో పూజల అనంతరం తహసీల్‌లోని ఆర్వో కార్యాలయానికి చేరుకున్నారు. ఆయన వాహనాన్ని కార్యాలయానికి 500 మీటర్ల దూరంలోనే పోలీసులు నిలిపివేశారు. దీంతో వివేక్, మాజీ ఎమ్మెల్యే ఓదెలు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, మరోనేత దుర్గం నరేశ్‌లతో కలసి నామినేషన్ వేసేందుకు నడుచుకుంటూ వెళ్లారు. వివేక్ వెళ్తుండగా బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ వాహనాన్ని పోలీసులు 500 మీటర్ల దూరంలో నిలిపివేయకుండా 100 మీటర్ల దూరం వరకు అనుమతి ఇచ్చారు. దీంతో వివేక్, ఓదెలు జైపూర్ ఏసీపీ మోహన్‌తో వాగ్వాదానికి దిగారు. బీఆర్ఎస్ అభ్యర్థి వాహనాన్ని ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు. అధికార పార్టీకి పోలీసులు వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తానని వివేక్ హెచ్చరించారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను పంపించేశారు.



చెన్నూర్ నామినేషన్ కేంద్రం వద్ద జైపూర్ ఏసీపీని నిలదీస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వివేక్

బట్టలు విప్పి కొడతా: సుమన్

మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో గురువారం నామినేషన్ దాఖలు చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్.. అనంతరం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిపై విరుచుకుపడ్డారు. డబ్బుల కోసం పార్టీ మారిన వారిని ఈ నెల 30న బట్టలు విప్పి కొడతా అని బెదిరింపులకు దిగారు.

‘అడ్వాన్స్‌డ్’ మోతాదూ తగ్గింపు!

- ఎన్‌టీఏపై రాష్ట్రాల ఒత్తిడి.. జేఈఈ మెయిన్స్ సిలబస్ మాదిరి మార్పులకు అవకాశం
- నిపుణులతో ఎన్‌టీఏ సమాలోచనలు.. మేథ్స్‌లో కొన్ని టాపిక్స్ తప్పించే యోచన



సాక్షి, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష సిలబస్ తగ్గింపుపై కసరత్తు జరుగుతోంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) దీనిపై త్వరలో స్పష్టత ఇచ్చే వీలుంది. ఇప్పటికే జేఈఈ మెయిన్స్ సిలబస్‌ను తగ్గించారు. మేథ్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో పది టాపిక్‌ల వరకూ తీసేశారు. ఇదే తరహాలో అడ్వాన్స్‌డ్‌లోనూ నిర్ణయం తీసుకోవాలనే ఒత్తిడి పెరుగుతోంది. అన్ని రాష్ట్రాలూ సిలబస్ తగ్గించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ఎన్‌టీఏ ఉన్నతాధికారులు భేటీ అయ్యారు. నిపుణుల నుంచి సలహాలు తీసుకున్నారు. సిలబస్‌లో ఏ తరహా మార్పులు చేయాలనే అంశంపై పలు దఫాల చర్చలు జరిగినట్లు ఎన్‌టీఏ వర్గాల ద్వారా తెలిసింది. కోవిడ్ వ్యాప్తి దృష్ట్యా 2020 నుంచి 2022 మధ్య బోధన పూర్తిస్థాయిలో సాధ్యపడనందున టెన్త్, ఇంటర్ సబ్జెక్టుల్లో సిలబస్ తగ్గించారు. 2024లో జరిగే జేఈఈ పరీక్షకు ఈ విద్యార్థులే హాజరు కానుండటంతో జేఈఈ మెయిన్స్ సబ్జెక్టుల్లో సిలబస్ తగ్గిస్తున్నట్లు ఎన్‌టీఏ ఇప్పటికే స్పష్టత ఇచ్చింది.

విద్యార్థుల్లో ‘అడ్వాన్స్‌డ్’ఆందోళన...

గత కొన్నేళ్లుగా జేఈఈ అడ్వాన్స్‌డ్‌పై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. జేఈఈ మెయిన్స్ అర్హుల్లో టాప్‌లో నిలిచిన 2.5 లక్షల మందికే అడ్వాన్స్‌డ్ రాసే అవకాశం కల్పిస్తున్నారు. కానీ ఐదేళ్లుగా అడ్వాన్స్‌డ్ రాస్తున్న వారి సంఖ్య 1.60 లక్షలు దాటడం లేదు. దరఖాస్తు చేసిన వారిలో 15 శాతం మంది పరీక్షకే హాజరు కావట్లేదని ఎన్‌టీఏ గుర్తించింది. అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు ఐఐటీల్లో సీట్లు లభిస్తున్నా అన్ని ఐఐటీలలో కలిపి సీట్లు 16 వేలకు మించి లేవు. ఇందులోనూ టాప్–100 ర్యాంకుల్లో నిలిచిన వరకే అగ్రశ్రేణి ఐఐటీల్లో సీట్లు వస్తున్నాయి. అడ్వాన్స్‌డ్ పేపర్ కొన్నేళ్లుగా కష్టంగా ఉండటంతో విద్యార్థులు పోటీ పడేందుకు భయపడుతున్నారు. జేఈఈ ర్యాంకుతో ఎన్ఐటీల్లో సీటు తెచ్చుకుంటున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని సిలబస్‌లో మార్పులు తేవాలని వివిధ రాష్ట్రాలు అడ్వాన్స్‌డ్ నిర్వాహక ఐఐటీలను డిమాండ్ చేస్తున్నాయి. కాగా, ఈ ఏడాది జేఈఈ మెయిన్స్‌లో తొలగించిన టాపిక్స్ అడ్వాన్స్‌డ్‌లో కొనసాగించే అవకాశం లేదని నిపుణులు అంటున్నారు.


మేథ్స్‌లో ఆ టాపిక్స్ ఉండకపోవచ్చు

నిపుణుల కమిటీ ఇటీవల ఎన్‌టీఏకు అందించిన నివేదిక ప్రకారం గణితంలో కొన్ని టాపిక్స్‌ను తొలగించే వీలుందని తెలుస్తోంది. ప్రిన్సిపల్స్ ఆఫ్ మేథమెటికల్ ఇండక్షన్, టాన్జంట్స్ అండ్ నార్మల్స్, ప్లాన్ ఇన్ డిఫరెంట్ ఫామ్స్, మేథమెటికల్ రీజనింగ్, హైట్స్ అండ్ డిస్టెన్సెస్ వంటి టాపిక్స్ ఉండకపోవచ్చని సమాచారం.

14 నుంచి లాసెట్ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: లా కాలేజీ ప్రవేశానికి ఈ నెల 14 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. మూడేళ్ల కాలపరిమితి గల లా కళాశాలలు రాష్ట్రంలో 22, అయిదేళ్ల లా కాలేజీలు 19, పీజీ లా కళాశాలలు 17 ఉన్నాయి. వీటిల్లో మూడేళ్ల లా కోర్సులో సీట్లు 4,790, ఐదేళ్ల లా కోర్సులో సీట్లు 2280, పీజీ లా కళాశాలల్లో 930 సీట్లున్నాయి. ఈ ఏడాది మూడేళ్ల లాసెట్‌కు 20,234 మంది, ఐదేళ్ల లాసెట్‌కు 6039 మంది, పీజీ లాసెట్‌లో 2,776 మంది అర్హత సాధించారు. కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇదీ..

నవంబర్ 14 నుంచి 21 వరకు	ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్ దరఖాస్తు
నవంబర్ 16 నుంచి 19 వరకు	ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన
22.11.23	దరఖాస్తుల్లో తప్పుల సవరణ
23 నుంచి 24 వరకు	వెబ్ ఆప్షన్లు
28.11.23	సీట్ల కేటాయింపు
29.11.23 నుంచి 2.12.23 వరకూ	సీట్లు వచ్చిన వారు రిపోర్టింగ్ చేయాలి
4.12.23	తరగతులు ప్రారంభం





ఎవరు ఆయన ప్రసన్నతను కోరుతూ, ఉదయం, సాయంత్రం తమ ప్రభువును ప్రార్థిస్తున్నారో, వారి సహచర్యంలోనే, సహనం వహించి ఉండు. ఇహలోక ఆడంబరాలను అపేక్షించి నీ దృష్టిని వారి నుండి దాటనివ్వకు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 10 నవంబర్ 2023

ఇది లోతైన సమస్య!

మేధ అవసరం. సవ్యంగా వాడితే ఆధునిక సాంకేతికత అందించిన కృత్రిమ మేధ (ఏఐ) కూడా అవసరాలు తీర్చవచ్చు. కానీ, దాన్ని అపసవ్యంగా వాడి, అసత్య ప్రచారానికీ, అసభ్య వీడియోలకూ వినియోగిస్తే ఏమవుతుందో నాలుగైదు రోజులుగా తాజా ఉదాహరణలతో చూస్తున్నాం. లిఫ్టులో అడుగిడుతున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సరైన ఓ బ్రిటిష్ ఇండియన్ మహిళ వీడియోను తీసుకొని, ఆమె ముఖం బదులు ప్రముఖ సినీ నటి రష్మికా మందన్న ముఖాన్ని తగిలించిన డీప్ ఫేక్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారి, వివాదం రేపింది. నటి కత్రినా కైఫ్ పైనా ఇలాగే మరో నకిలీ వీడియో బయటకొచ్చింది. పెరిగిన ఏఐ సాంకేతిక వినియోగంతో ఈజీగా మారి, ఇంటర్నెట్‌ను ముంచెత్తుతున్న ఈ డీప్ ఫేక్‌లపై మళ్ళీ చర్చ రేగింది. వ్యక్తిగత స్వేచ్ఛ, గోప్యత, గౌరవం మొదలు జాతీయ భద్రత దాకా అన్నిటికీ ముప్పుగా మారుతున్న ఈ సాంకేతికతకు ప్రభుత్వం ముకుతాడు వేయాల్సిన అవసరాన్ని తెరపైకి తెచ్చింది.

రకరకాల సాంకేతిక విధానాల ద్వారా బొమ్మలు, వీడియోలు, ఆడియోల్లో ఒక మనిషి స్థానంలో మరో మనిషి రూపాన్నీ, గొంతునూ అచ్చు గుద్దినట్టు ప్రతిసృష్టించి, డిజిటల్‌గా తిమ్మినిబమ్మిని చేయడమనే 'డీప్ ఫేక్' ఇప్పుడు ప్రపంచమంతటినీ పట్టిపీడిస్తున్న చీడ. నిజానికి, ఫోటో–షాపింగ్ ద్వారా బొమ్మలు మార్చే పద్ధతి చాలా కాలంగా ఉన్నదే. కానీ, శక్తిమంతమైన మెషిన్ లెర్నింగ్, కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఇట్టే బురిడీ కొట్టించేలా వీడియోలు, ఆడియోలు చేయడం డీప్ ఫేక్‌ను పదునైన అస్త్రంగా మార్చేశాయి. అసలు ఏదో, నకిలీ ఏదో కనిపెట్టేందుకు పలు పద్ధతులు లేకపోలేదు. అయితే, అసలు సంగతి వివరించేలోగా సోషల్ మీడియా పుణ్యమా అని నకిలీ సమాచారం క్షణాల్లో లోకాన్ని చుట్టేస్తోంది. చివరకు నాసిరకం డీప్‌ఫేక్‌లు సైతం జనం మనసులో అనుమానాలు రేపి, అసలు సిసలు సమాచారాన్ని వెనక్కి నెట్టేస్తున్నాయి. వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. పోనుపోనూ సాంకేతికత పదును తేరి, అందరికీ అందుబాటులోకి వస్తే, డీప్‌ఫేక్‌లు నైసు తేలతాయి. అప్పుడిక అసలు, నకిలీలలో తేడాలు పసిగట్టడం ఇంకా కష్టం.

ఇవాళ కంపెనీలు, రాజకీయ పార్టీలు, నేతలు తమకంటూ సొంత ఇమేజ్ సృష్టించుకోవడానికీ, పెంచుకోవడానికీ, చివరకు ప్రత్యర్థులపై బురదచల్లడానికి ఫేక్ న్యూస్‌ను ఆసరాగా చేసుకుంటున్న తీరు చూస్తున్నాం. ఫలితంగా, అవి జనం మానసిక స్థితిపై ముద్ర వేసి, వారు తీసుకొనే నిర్ణయాలను ప్రభావితం చేయడమూ జరుగుతోంది. సమాచారం కోసం ఆన్‌లైన్‌పై అధికంగా ఆధారపడడం, సామాన్యుల్లో సైతం ఇంటర్నెట్ వినియోగం పెరిగాక వచ్చిన కొత్త తలనొప్పులివి. బాట్లు, ట్రోల్స్, ప్రభావం చూపే ప్రచారాలు... ఇలా పేర్లు ఏమైనా, అన్నిటి పనీ ఒకటే! ఆన్‌లైన్‌లో తమకు కావాల్సినట్టు కథనాలు వండివార్చడమే! మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్స్ వగైరా ఆధునిక సాంకేతికతల పుణ్యమా అని త్వరలోనే పూర్తిగా ఏఐ సృష్టించిన వార్తా కథనాలు, పాడ్ కాస్ట్‌లు, డీప్ ఫేక్ చిత్రాలు, వీడియోలతో కూడిన డిజిటల్ ప్రపంచాన్ని మనం పంచుకోవాల్సిన పరిస్థితి. మనం ఊహించలేనంత స్థాయిలో, వేగంతో ఇవన్నీ డిజిటల్ ప్రపంచాన్ని ముంచెత్తనున్నాయి. ఓ అధ్యయనం ప్రకారం 2018 నాటికి కనిపెట్టిన డీప్‌ఫేక్‌లు 10 వేల లోపే! ఇవాళ ఆన్‌లైన్‌లో వాటి సంఖ్య లక్షల్లోకి చేరింది.

కొత్త కృత్రిమ మీడియా సమాచారం ఆందోళనకరం. నిరుడు ఉక్రెయిన్‌పై దాడిని సమర్థించుకొనేందుకు రష్యా డీప్ ఫేక్‌లను వాడే ప్రమాదం ఉందని పాశ్చాత్య దేశాలు అనుమానించాయి. ఈ ఏడాది మే నెలలో వైట్‌హౌస్ సమీపంలో పొగ వస్తున్న డీప్‌ఫేక్ చిత్రం దెబ్బకు స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. డీప్‌ఫేక్ కాకున్నా, రచయితల సమ్మె వేళ స్వర్గీయ తారల్ని తెరపై పునఃసృష్టించే పనికి హాలీవుడ్ స్టూడియోలు దిగడమూ నైతికతపై చర్చ రేపింది. సైబర్ ఆర్థిక నేరాలు, అసలును పోలిన నకిలీ సృష్టితో శీలహననం నుంచి దేశ భద్రత దాకా సాంకేతికత నీలినీడ పరుస్తోంది. సినీ తారలు ఇవాళ ఎదుర్కొన్న ఇబ్బంది సామాన్యులకు ఎదురవడానికి ఎంతో కాలం పట్టదు. ఈ ఏడాది ప్రపంచంలో 5 లక్షల డీప్‌ఫేక్ ఆడియో, వీడియోలు సోషల్ మీడియాలో షేరవుతాయని అంచనా. పైగా, డీప్‌ఫేక్ వీడియోల్లో 98 శాతం ఆడవారిపై చేసినవే. బాధిత ప్రపంచ దేశాల్లో 6వ స్థానం మనదే! ఆ మాటకొస్తే, 2020లోనే అజ్ఞాత సేవగా సాగిన 'డీప్ న్యూడ్' గురించి పరిశోధకులు బయటపెట్టారు. ఒక వ్యక్తి ఫోటోలను వారి అంగీకారంతో సంబంధం లేకుండా, క్రమం తప్పక అందించడం ద్వారా నకిలీ నగ్నచిత్రాలను సృష్టించే ఆ సర్వీస్‌పై రచ్చ రేగింది. పలు పాశ్చాత్య దేశాల్లో అరెస్టులు, దర్యాప్తులు, చట్టాల్లో మార్పులు జరిగాయి.

కాలంతో పాటు సాంకేతికత మారి, జనజీవితంపై దాడి చేస్తున్న సమయంలో మన ప్రభుత్వాలు అవసరమైన కట్టుదిట్టాలు, చట్టాలు చేయకపోవడం సమస్య. ఫిర్యాదు చేసిన 24 గంటల్లో సోషల్ మీడియా సంస్థలు సదరు మార్ఫింగ్ కంటెంట్‌ను తొలగించాలన్న రూలు ఇప్పటికే ఉంది. కానీ, డీప్ ఫేక్‌లను ముందే అరికట్టే చర్యలు అవసరం. అమెరికా లాంటి చోట్ల అరకొర చట్టాలతోనైనా ఆపే ప్రయత్నం జరుగుతోంది. బ్రిటన్‌లో డీప్‌ఫేక్ అశ్లీల వీడియోల తయారీ చట్టరీత్యా నేరం. చైనాలో ఏకంగా నిషేధమే ఉంది. వీడియోను మార్చినా, మార్పు చేసిన వీడియో అని రాయాల్సిందే. యూరోపియన్ యూనియన్ లాంటివీ కఠిన నియమాల రూపకల్పనకు కిందా మీదా పడుతున్నాయి. మన దేశంలోనూ అలాంటి ప్రయత్నం తక్షణమే జరగాలి. బాహ్య ప్రపంచంలో లానే వర్చ్యువల్ లోకంలోనూ వనితలను లక్ష్యంగా చేసుకొని, వారిపై సాగుతున్న ఈ హేయమైన దాడిని అడ్డకుంటే అది సభ్య సమాజానికే అవమానం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.ద్వాదశి ఉ.11.22 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** హస్త రా.11.55 వరకు, తదుపరి చిత్ర, **వర్జ్యం:** ఉ.6.54 నుండి 8.41 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.22 నుండి 9.05 వరకు, తదుపరి ప.12.06 నుండి 12.53 వరకు, **అమృతఘడియలు:** సా.5.24 నుండి 7.09 వరకు.

సూర్యోదయం: 6.05
సూర్యాస్తమయం: 5.23
రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు

చంద్రబాబు అవినీతి ప్రస్థానం

అభిప్రాయం



డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి

"ఎక్కడి నీచు లెక్కడి హీనులెంతటి తులువలు / ఎంతటి భ్రష్టు లెచ్చటి దుష్టు లెక్కడి నష్టజాతకులీ నాయకులు / నా తెలుగు జాతికి శాపంగా దాపురించారో" అంటారు మహారథి. ఈ మాట అక్షరాలా మన నారా చంద్రబాబు నాయుడికి వర్తిస్తుంది. మధిర సుబ్బన్న దీక్షితులు రాసిన కాశీమజిలీ కథల్లో పాఠకులను భయపెట్టే ఒక మహావట వృక్షం ఉంటుంది. అంతకంటే భయంకరమైన అవినీతి వృక్షం తెలుగు జాతికి సంక్రమించింది. ఒకే పెరడులో పెరిగి శాఖోపశాఖలుగా విస్తరించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిని ఎదగనీయకుండా వ్యవస్థల్ని కూడా భయపెడుతున్న ఈ 'నారా' అవినీతి వృక్షం మూలాల్లోకి వెళ్లి ఒక్కసారి పరిశీలిద్దాం.



చంద్రబాబుకు నారావారి పల్లెలో ఒక చిన్న పూరిల్లు, రెండెకరాల పొలం మాత్రమే ఉంది. అనుకోకుండా 1978లో కాంగ్రెస్ పార్టీ చీలిపోయి 'ఇందిరా కాంగ్రెస్' ఏర్పడింది. అప్పుడున్న పరిస్థితుల్లో ఇందిరాగాంధీ ఎవ్వరడిగినా టిక్కెట్ ఇచ్చింది. ఆ విధంగా 'నారా'వారు టిక్కెట్ సంపాదించి ఆమె ప్రభంజనంలో ఎమ్మెల్యేగా గెలిచాడు. అప్పుడతని నెల జీతం 350 రూపాయలు. పాకాల నారాయణస్వామి, గల్లా రాజగోపాల్ నాయుడు ఆర్థిక సాయం అందించడంతో ఎమ్మెల్యేగా గెలుపొందాడు. అయితే రాజకీయాల్లో సీనియారిటీ, సిన్సియారిటీ పనికి రాదనుకున్నాడు. మంత్రి కావాలనే ఆశతో అన్ని అడ్డదారులు తొక్కటం ప్రారంభించాడు. అమాయకుడైన అంజయ్యగారి అల్లుణ్ణి, పట్టుకొని, అతనిని ప్రలోభపెట్టి చేసి 1980లో మంత్రి పదవి కొట్టేశాడని ఆ రోజుల్లోనే ఒక కాంగ్రెస్ నాయకుడు ఆక్షేపించాడు. మంత్రిగా అతని జీతం 2,500 రూపాయలు. అదే విధానంలో సంజయ్ గాంధీతో పరిచయం పెంచుకున్నాడు.

ఇక మంత్రి పదవి చేపట్టిన దగ్గర్నుండి అతని అవినీతి యాత్ర ప్రారంభమైంది. తిరుపతిలో 1970–80లలోనే విష్ణుప్రియ హోటల్ కొన్నాడు. ఆ తరువాత భువనేశ్వరి కార్బైడ్ ఫ్యాక్టరీని ప్రారంభించాడు. సినిమాటోగ్రఫీ మినిస్టర్ అవ్వడంతో ఆ రోజుల్లో సినిమావాళ్ళ దగ్గర కూడా డబ్బులు కాజేసేవాడని స్వయంగా దాసరి నారాయణ రావుగారు నాతో చెప్పారు. ఆ పరిచయాలతోనే 1981లో ఎన్టీఆర్ కుమార్తె భువనేశ్వరితో అతని వివాహం జరిగింది.

'ఇంత డబ్బు నీకెక్కడిది?'

1982 ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించినపుడు ఇతడు కాంగ్రెస్‌లోనే ఉండి ఎన్టీఆర్‌ను ఓడిస్తానని ప్రగల్భాలు పలికాడు. తెలుగుదేశం పార్టీ 200 సీట్లతో గెలవటంతో అప్పటికప్పుడు పార్టీలో చేరతానని వచ్చేశాడు. అప్పటికే అతని మీద అనేక కథలు ప్రచారంలో ఉన్నందువల్ల ఎన్టీఆర్ తిరస్కరించారు. అప్పుడు గర్భిణిగా ఉన్న భువనేశ్వరిని ముందుపెట్టి ఎన్టీఆర్ మీద ఒత్తిడి తెచ్చి పార్టీలో చొరబడ్డాడు.

కార్యకర్తగా చేరిన చంద్రబాబు నంబర్ 2 పొజిషన్ కోసం అప్పటి వరకు ఆ స్థానంలో ఉన్న నాయకులందరినీ ఏదో ఒక వంకతో బయటకు పంపేశాడు. నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, జానారెడ్డి, ఉపేంద్ర, కె.ఇ. కృష్ణ మూర్తి, వసంత నాగేశ్వరరావు... వీరంతా ఎన్టీఆర్‌కు అత్యంత విశ్వాసపాత్రులుగా మెలిగినవారు. బయటకు వెళ్లాక చంద్రబాబు నీచ రాజకీయాన్ని గురించి తీవ్రంగా విమర్శ చేయటం గమనించదగిన అంశం. అప్పటినుండి పార్టీలో 'ఏకులా వచ్చి మేకులా' తయార య్యాడు. ఎన్టీఆర్‌కు రాజకీయ అవగాహన లేకపోవటంతో పార్టీ బాధ్యతనంతా అతనికి అప్పజెప్పటంతో పార్టీ వ్యవహారాలే కాక ప్రభుత్వంలో కూడా రాజ్యాంగేతర శక్తిగా తయారయ్యాడు. దానికి తోడు ఎన్టీఆర్ అతనిమీద ఉంచిన అపారమైన విశ్వాసంతో ఎవరు తనను కలిసినా 'బాబును కలవండి' అని చెప్పటంతో పార్టీలో, ప్రభుత్వంలో అతనికి హద్దు లేకుండా పోయింది. జూబ్లీహిల్స్‌లో 1,200 గజాలు కొని మంచి భవనం కట్టించాడు. ఆ గృహ ప్రవేశానికి ఎన్టీఆర్ గారిని కూడా ఆహ్వానించాడు. ఆ భవనం చూసి ఆశ్చర్యపోయిన ఎన్టీఆర్ 'ఇంత డబ్బు నీకెక్కడిది? ఎలా కట్టించావు?' అని అడిగితే దానికి సమాధానం చెప్పకుండా తప్పించుకున్నాడు.

ఇంటా బయటా చర్చ

చంద్రబాబు అవినీతి మీద 'ఈనాడు' పేపరు ప్రభుత్వాన్ని అనేకసార్లు హెచ్చరించింది. బ్లాటింగ్ పురుషోత్తం (మద్రాసు) వద్ద రెండున్నర కోట్లు ముడుపులు తీసుకున్న విషయం పార్టీలో, బయటా పెద్ద చర్చనీయాంశమైంది. అప్పటికి నష్టాల్లో నడుస్తున్న 'విష్ణుప్రియ' హోటల్‌ను సి.ఎం. బలరామిరెడ్డికి బలవంతంగా అంటకట్టి, కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం అతనిని కడప జడ్పీ ఛైర్మన్‌గా చేశాడు. అదే విధంగా మూతపడివున్న భువనేశ్వరి కార్బైడ్ ఫ్యాక్టరీని రేణుకా చౌదరికి అంటగట్టి ఎన్టీఆర్‌ను బలవంతంగా ఒప్పించి రెండవసారి రాజ్యసభకు పంపించాడు.

1988లో హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్ ప్రకారం సాలీనా వ్యవసాయంపై వచ్చే ఆదాయం 36,000 రూపాయలుగా చూపించాడు. వ్యవసాయ భూమి తప్ప తనకు వేరే ఆస్తిపాస్తులుగానీ, ఆదాయ మార్గాలుగానీ లేవని వెల్లడించాడు. అప్పుడు భార్య భువనేశ్వరి ఆస్తి సుమారు 400 గ్రాముల బంగారం, 50,000 రూపాయల నగదు. తరువాత ఏ పదవిలో లేడు గనుక సంపాదించే అవకాశమే లేదు.

1

1989 ఎన్నికల్లో తన ఆదాయం 2,16,000, అగ్రికల్చర్ ఆదాయం 36,000గా చూపించాడు. 1992లో 14 కోట్ల 75 లక్షల పెట్టుబడి అంచనాలతో 'హెరిటేజ్ గ్రూప్' సంస్థను స్థాపించటం జరిగింది. దాని పెట్టుబడులకు కూడా పార్టీలో అసెంబ్లీ టిక్కెట్లు ఇప్పిస్తానని పార్టీ మనుషుల చేత లక్షల రూపాయల షేర్లు కొనిపించాడు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు లక్షల రూపాయల ముడుపులు తీసుకొని కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు అప్పజెప్పాడని నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి బహిరంగంగానే విమర్శించాడు.

నెల్లూరు జిల్లా బాలాయపల్లెలో 600 ఎకరాల్లో టేకు మొక్కలు నాటి వాటిని సొంతం చేసుకోవటమే కాకుండా, యానాం చుట్టుపక్కల బినామీ పేర్లతో కొన్ని వందల ఎకరాలు కొన్నాడని పార్టీ వాళ్ళే ఒకరికొకరు చెప్పుకున్న విషయం.

ఇక హెరిటేజ్ పబ్లిక్ ఇష్యూలలో ఆరున్నర కోట్ల రూపాయలు సమీకరించాడు. ఈ పరిశ్రమలో తనకు 76 లక్షల 15 వేల రూపాయల విలువ గల వాటాలున్నట్టు, భార్య భువనేశ్వరికి ఒక కోటి 21 లక్షల 31 వేల రూపాయల విలువైన వాటాలున్నట్టు, లోకేష్ పేర 3 లక్షల 15 వేల రూపాయల వాటాలు న్నట్టు 1994లో ప్రకటించాడు. అప్పటికే జూబ్లీహిల్స్‌లో ఒక భవనం, పంజాగుట్టలో ఒక భవనం ఉన్న విషయం గమనించాలి. ఏ పదవీ లేకుండా 1992 నాటికే అతని కుటుంబ ఆస్తులు పెరిగాయన్నది స్పష్టంగా తెలుస్తున్నది.

వెన్నుపోటు తర్వాత లేని హద్దు

1995 ఆగస్టు నెలలో ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి పదవి నుండి దించేసి సెప్టెంబర్ 1వ తేదీన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుండి అతని ఆస్తులు ఆకాశమే హద్దుగా పెరిగిపోవటం, దేశంలోనే నంబర్‌వన్ స్థాయి అవినీతి పరునిగా విమర్శలు రావడం జరిగింది. తెహల్కా డాట్‌కామ్ మొదలు అనేకమంది రాజకీయ నాయకులు, మీడియా అతని అవినీతిని ప్రశ్నించటం జరిగింది.

1995లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యిన దగ్గర్నుండి పారదర్శకత, నిజాయితీ గురించి ఎక్కువగా ఉపన్యాసాలివ్వడం ప్రారంభించాడు. శాసనసభలో ఎథిక్స్ కమిటీ ఏర్పాటుకు దోహదకారులైన తోటి శాసన సభ్యుల వలే తను కూడా తన ఆస్తిపాస్తుల వివరాలు, కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలు ప్రతి సంవత్సరం ప్రకటించడం మొదలు పెట్టాడు. అతని ప్రకటన ప్రకారం చంద్రబాబు కుటుంబ ఆస్తుల విలువ 30 కోట్ల వరకు చేరింది.

ఆ ప్రకటనలో నెల్లూరు జిల్లా బాలాయపల్లి మండలం 'నిందలి గ్రామం'లో తన పేర 26.43 ఎకరాలు, భార్యకు 10.23 ఎకరాలు, కుమారునికి 9.32 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్టు ప్రకటించాడు. వివిధ కంపెనీలలో కుమారుడికి ఒక కోటి 67 లక్షల 15 వేల రూపాయల విలువగల వాటాలు, భార్య భువనేశ్వరి పేరున మొత్తం 3 కోట్ల 4 లక్షల 1 వేయి రూపాయల విలువ గలిగిన వాటాలు, తనకు ఒక కోటి 40 లక్షల 15 వేల 65 రూపాయల విలువ కలిగిన వాటాలు ఉన్నట్లు చెప్పాడు. భవనాలు, వాహనాలు, బ్యాంక్ బ్యాలెన్స్‌లు మొదలైన వివరాలు కూడా వెల్లడి చేశాడు. వాటి విలువను తక్కువగా చూపించడం గమనార్హం. 1994లో ప్రకటించిన హెరిటేజ్ డైరీ ప్రాస్పెక్టస్‌లో కూడా తనకు వేరే కంపెనీలతో లావాదేవీలు గానీ ఇతరత్రా ఆదాయ వనరులు గానీ లేనట్లు ప్రకటించి, కంపెనీల రిజిస్ట్రార్ సమక్షంలో అంతకుముందు తాను ఆర్థికపర, క్రిమినల్ నేరారోపణలను ఎదుర్కొనలేదని పేర్కొన్నాడు. మరి 1988లో సాలీనా తన గరిష్ఠ ఆదాయం లక్షన్నర రూపాయలే అని చెప్పిన పెద్ద మనిషికి ఒక్కసారిగా ఇన్ని ఆస్తులు అకస్మాత్తుగా ఎలా పెరిగాయి? ఆనాటి ప్రశ్నకు ఈరోజు సీఐడీ కేసుల ద్వారా సమాధానం లభించింది.

ఆస్తులు ఎలా పెరిగాయో సంజాయిషీ ఇవ్వాలి!

చంద్రబాబు పేర్కొన్న ఆస్తిపాస్తులు ఎలా వచ్చాయో ప్రజలకు సంజాయిషీ ఇవ్వాల్సిందిగా అప్పటి పీసీసీ అధ్యక్షులు డాక్టర్ రాజశేఖర రెడ్డిగారు డిమాండ్ చేయటం జరిగింది. అతడిని ప్రాసిక్యూట్ చేసేందుకు అనుమతించాల్సిందిగా 1999 జూన్ 5న రాజశేఖర రెడ్డి నాయకత్వంలో పలువురు కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర గవర్నర్‌కు ఒక విజ్ఞాపన పత్రం సమర్పించారు. నిజానికి 90 మంది శాసన సభ్యులకు నాయకుడైన రాజశేఖర రెడ్డి గారి విజ్ఞాపనకు గవర్నరు ప్రతిస్పందించటం కనీస ధర్మం. అప్పటికే ప్రతి వ్యవస్థను తనకు అనుకూలంగా మార్చుకోవటంలో చంద్రబాబు సిద్ధహస్తుడయ్యాడు. గవర్నర్ మారు మాట్లాడలేదు.

గత్యంతరం లేని పరిస్థితిలో 1999 జూలై 12వ తేదీన హైకోర్టును ఆశ్రయించి ముఖ్యమంత్రిని ప్రాసిక్యూట్ చేసేందుకు చట్టప్రకారం అవసరమైన అనుమతి ఇవ్వాల్సిందిగా గవర్నర్‌ను ఆదేశించాలని కోరారు. అందుకు హైకోర్టు 1999 నవంబర్ 2వ తేదీన ఒక సుదీర్ఘ తీర్పులో తన నిస్సహాయతను వ్యక్తం చేస్తూ దరఖాస్తును కొట్టేసింది. గవర్నర్ గారి పదవీ బాధ్యతల నిర్వహణ మీద సమీక్ష జరిపే అధికారం రాజ్యాంగం ప్రకారం కోర్టులకు ఉండదని ఆ జడ్జిమెంట్ సారాంశం.

హైకోర్టు తీర్పు మీద (నేడు టీడీపీ పార్టీలో ఉన్న) కన్నా లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ సీనియర్ లీడర్ 'ఆమోస్' గార్లు సుప్రీం కోర్టుకు అప్పీల్ చేశారు. అయినప్పటికీ సుప్రీంకోర్టు హైకోర్టులోనే తేల్చుకోమని ఆ కేసు కొట్టేసింది. దాని మీద వారు హైకోర్టులో ఏ కేసు వేసినప్పటికీ తమకు న్యాయం జరగట్లేదనీ, చంద్రబాబుకు అనుకూలంగా తీర్పులొస్తున్నాయనీ నివేదించినప్పటికీ అత్యున్నత న్యాయస్థానం వినిపించుకోలేదు. అడ్వకేట్ జనరల్ రామచంద్ర రావు ఈ కేసును వాదిస్తూ, రాష్ట్ర హైకోర్టు మీద చంద్రబాబు నాయుడి ప్రభావం పనిచేస్తున్నదంటూ బ్రిటన్‌లోని 'ససెక్స్' విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ జేమ్స్ మైనర్ ఇచ్చిన రిపోర్టును ప్రస్తావించినా బెంచ్ తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ ఛైర్‌పర్సన్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

శిశువుల చిత్రనిద్రలో బాంబుల చప్పుడు

తూర్పు తీరం



కె.ఎన్. మల్లీశ్వరి

ఒళ్ళంతా బూడిద వర్ణం నిండిపోయిన ఆ బాలుడు గూడు చెదిరిన పిట్టలా రోడ్డుమీద అయోమయంగా గిరికీలు కొడుతున్నాడు. భయమో, ఏడుపో, ఆందోళనో, వెతుకులాటో తెలీని ఆ పదేళ్లవాడిని ఎవరో ఆపి, ఏదో అడుగుతున్నారు. తన ఖాళీచేతుల వంక చూసుకుంటూ, "ఇపుడే బాల్ ఇద్దామని వచ్చాను, వాడు కారుకింద దాక్కున్నాడు. ఇంతలో మాకు దగ్గరలో బాంబు వేశారు వాళ్ళు. మా మేనల్లుడి వీపుకి గాయం అయింది. వాడిని మోసుకుని ఇంటికి వెళ్ళాను. మా పొరుగువాళ్ళు అక్కడికి వచ్చారు. వాళ్ళకి బుజ్జిబాబు ఉన్నాడు. వాడి తలంతా పగిలిపోయి మెదడు బైటకి వచ్చింది. మేము ఎలా బతకాలి, ఇది జీవితం కాదు" మాటల శిథిలాలను వదిలి మళ్ళీ పరుగందుకున్నాడు.

శోక సముద్రపు అలలా, తీరంలాంటి తండ్రి గుండెకి తలని మోదుతూ ఎగిరెగిరి పడుతున్నది ఎనిమిదేళ్ళ పిల్ల. "మా తాతయ్యని, నాన్నమ్మని, చిన్నాన్నని, వాళ్ళ పిల్లల్ని కూడా చంపేశారు. వాళ్ళు అమరులయ్యారట, కానీ మా అమ్మని తమ్ముడిని ఎలా చంపుతారు, అమ్మ లేకుండా నేనుండలేను" ఆ చిన్న గొంతులో ఎవరం వినగూడని ఉద్వేగం.

లోకపు భయం అంతా ఒకముద్దలా మార్చి రెండు కళ్ళలో కూరినట్లు, ఆసుపత్రి బల్లమీద కూర్చున్న రెండు మూడేళ్ల చిన్నవాడు లోకపు నాగరికతని ముక్కలు ముక్కలు చేసేశాడు. వాడి పసినిద్రని చెల్లాచెదరు చేసిన బాంబుదాడి బీభత్సం అంతా ఆ విప్పార్చిన కళ్లలో కనిపించింది. అది చూసి తట్టుకోలేని డాక్టర్ వాడిని దగ్గరికి తీసుకుని "నాన్న దగ్గరికి తీసుకువెళ్లనా?" అనడగగానే భయం బద్దలయి, కుళ్ళి కుళ్ళి ఏడ్చాడు.

పాలస్తీనా మీద ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధంలో ఇప్పటి లెక్కల ప్రకారం దాదాపు అయిదు వేలమంది పాలస్తీనా చిన్నారులు చనిపోయారు. ప్రతి పది నిమిషాలకూ ఒక చిన్నారిని మరణంలోకి నెట్టి వేస్తున్నది మాయదారి యుద్ధం. గాయపడినవారి లెక్కకి అంతే లేదు. శిథిలాల కిందన, రోడ్ల మీదా, ఆసుపత్రులలో, శిబిరాలలో నెత్తురోడుతున్న పిల్లలు... పిల్లలు... పసికూనలు! ఏడుస్తూ అరుస్తూ, కాళ్లతో చేతులతో అందరినీ విసిరికొడుతూ, భయంతో నక్కి నక్కి దాగుతూ, ప్రతినలు పూనుతూ, అయినవారి శవయాత్రల్లో కక్కటిల్లిపోతూ, ఆసుపత్రుల్లో కింక పెడుతూ, శూన్యంలోకి చూస్తూ, నిశ్చేష్టులవుతూ, లోకపు నిర్దయని ఛీత్కరిస్తూ – పాలస్తీనా బాల్యం, హృదయమున్నవారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. బిడ్డ గుక్కపట్టి ఏడిస్తేనే కిందుమీదులయ్యే సున్నితమైన పెంపకాల మధ్య ఈ సామూహిక రోదనలు వినడం అత్యంత విషాద సందర్భం. ఇజ్రాయెల్‌కూ, తమ మత ప్రయోజనాలకూ కొమ్ము కాసే ఒక తరహా మీడియా, పసిపిల్లల బాధాకర వీడియోలను నటనలుగా వక్రీకరిస్తున్నది. వేలాది పిల్లల ఆర్తనాదాలలోని సహజత్వాన్ని పరీక్షకు పెట్టేంత బండబారిపోయామా!

లోకంలో ఎక్కడైనా పిల్లల భద్రతకి అన్నిటికన్నా ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. ఎందుకంటే భావి పౌరుల ఎదుగుదలని బట్టే సమాజపు ఎదుగుదల ఉంటుంది కనుక. పిల్లల మనసు తెల్ల కాయితం లాంటిది. దాని మీద వారు తొలిగా అమ్మ, నాన్న, తోబుట్టువుల బొమ్మలు గీసుకుంటారు. ఆ మూలన సూర్యుడు, దానిమీద అడ్డంగా ఎగురుతున్న రెండు పక్షులు, ఒక స్కూలు, నలుగురు స్నేహితులు, కాసిన్ని ఆటపాటలు. ఇంతకి మించిన భారాన్ని వారి చిట్టి మనసులు మోయలేవు. ప్రపంచవ్యాప్తంగా జాతి, వర్ణ, కుల, సామాజిక, ఆర్థిక, ఇతరేతర వివక్షలకి తగిలిన గాయాలను పిల్లలు శతాబ్దాలుగా మోసుకు తిరుగుతున్నారు. వీటికి అదనం యుద్ధాల వంతు. ఇపుడు లక్షలాది పాలస్తీనా చిన్నారుల తెల్లకాయితాల మీద యుద్ధం – ఎరుపు, బూడిద రంగుల హర్రర్ వార్నీయ్‌ను చిత్రిస్తుంది.



వేలాది చిన్నారుల్లో, వారి మొహాల్లో, హావభావ కవళికల్లో కొట్టొచ్చినట్లు కనపడుతున్నవి, షాక్, ట్రామా. ఇవి సబ్ కాన్షియస్ మీద వేసే ముద్రలు సామాన్యమైనవి కావు. కూడూ, గూడూ, దుస్తులూ హాయిగా అమిరాక కూడా మన అభిప్రాయాలు, విశ్వాసాలే గొప్పవని నమ్మి, వాటిని గెలిపించడం కోసం ఎంతకైనా తెగించే నాగరీక లోకమిది. ఇక బతుకే ఊగిసలాటలో పడిన పసిపిల్లలు, భవిష్యత్తులో శాంతి కాముకులవుతారని నమ్మగలమా! రక్తపాతం సృష్టించిన వారు పశ్చాత్తాపంతోనో, తమ ప్రాణాల మీది తీపితోనో శాంతి మంత్రం జపించవచ్చు గాక. కానీ బాధితులను శాంతిగా ఉండమని చెప్పడమంత లౌక్యం, అమానుషం మరొకటి ఉండదు.

పిల్లల విషయంగా పాలస్తీనా భవిష్యత్తులో ఎదుర్కోబోతున్న సమస్యలు రెండు. మానసిక కల్లోలాలను అదుపు చేసుకోలేక పిల్లలు స్వీయహింసకి పాల్పడడం, లేదా ఇతరుల పట్ల, ముఖ్యంగా తమని వేధించినవారి పట్ల హింసాత్మకంగా ప్రవర్తించడం. కుక్కలు, తూనీగలు, పురుగులు, పిట్టల వంటివాటిని– పిల్లలు తెలిసీ తెలియక హింసిస్తుంటారు. ప్రాణుల పట్ల దయగా ఉండా లని రేపుమాపు ఎవరైనా బోధించబోతే వారు తప్పక ఒక ప్రశ్న అడుగుతారు, 'పాలస్తీనా ప్రజలు ప్రాణులు కారా?' అని. ఇంత నలుగుడు పడి మనమేమి చేయగలం? నాలుగు కొవ్వొత్తులు, ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలపడం, నాలుగు అక్షరాలు రాయడం, మీతో మేమున్నామని పాలస్తీనీయులకు తెలపడం, నలుగురు కూచుని నవ్వేవేళ –యుద్ధంతో ఛిద్రమవుతున్న బాలలు తలపున పడి చాటుగా కళ్ళు తుడుచుకోవడం తప్ప, మనమేమి చేయగలం!

వ్యాసకర్త జాతీయ కార్యదర్శి, ప్రరవే
malleswari.kn2008@gmail.com

యుగ యుగాల ప్రాధాన్యం

దీపం పరబ్రహ్మ స్వరూపం. జ్ఞానానికి చిహ్నం. నిర్లక్ష్యం అనే చీకటిని పారదోలే దివ్య జ్యోతి. దీపావళి అంటే దీపాల వరుస. దీపకాంతి చీకటిని పారదోలినట్టే, జ్ఞానం నిర్లక్ష్య ధోరణిని నిర్మూలిస్తుంది. అందుకే అన్నింటా విలువైన జ్ఞాన సముపార్జన కోసం, అన్ని పవిత్ర సందర్భాల్లోనూ మన ఆలోచనలకు, పనులకు సాక్ష్యంగా జ్యోతి వెలిగిస్తాం. ఏ శుభకార్యం మొదలుపెట్టినా ముందుగా జ్యోతి వెలిగించి ప్రారంభించే సంప్రదాయం మనది. దీపపు కుందిలో పోసే నెయ్యి లేదా నూనె, వత్తి మనలోని కోరికలు, అహంభావ ధోరణులకు సంకేతం. భగవంతుని ముందు దీపం వెలిగించగానే మనలోని కోరికలు నెమ్మదిగా ఆవిరవుతూ, అహం కాలిపోతూ ఉంటుందని అర్థం చేసుకోవాలి.

భారతీయ సంప్రదాయంలో దీపానికి విశేష ప్రాధాన్యం ఉంది. నిజానికి దీపావళి మూడు రోజుల పండుగ. కొన్నిచోట్ల ఈ పండుగను ఐదు రోజులు కూడా జరుపుకుంటారు. ఆశ్వయుజ మాసం కృష్ణపక్షంలో వచ్చే ఈ పండుగ మొదటిరోజు నరక చతుర్దశి, రెండో రోజు దీపావళి, మూడో రోజు బలిపాడ్యమిగా జరుపుకుంటారు. ఐదు రోజులు పండుగ చేసుకునే వారు ధనత్రయోదశి, నరక చతుర్దశి, దీపావళి, బలిపాడ్యమి, యమ ద్వితీయ.. ఇలా జరుపుకుంటారు. జ్ఞానానికి, ఐశ్వర్యానికి, ఆనందానికి ప్రతీకగా నిలిచే జ్యోతి మహాలక్ష్మి స్వరూపం. అలాంటి దీపావళి నాడు జ్యోతిని లక్ష్మీదేవిలా భావించి గృహిణులు లక్ష్మిపూజ నిర్వహిస్తారు.

ఆశ్వయుజ శుక్ల చతుర్దశిని నరక చతుర్దశిగా జరుపుకొంటారు. నరకాసుర సంహారానికి గుర్తుగా ఆశ్వయుజ బహుళ అమావాస్యను ఆనందోత్సాహాల మధ్య దివ్వెల వెలుగుల దీపావళి పండుగ జరుపుకుంటున్నారు. టపాకాయలు కాలుస్తూ, మిఠాయిలు తిని బంధుమిత్రులతో సరదాగా, ఆనందంగా గడుపుతారు.

దీపావళి నాడు మహాలక్ష్మీదేవిని పూజించి అర్చిస్తారు. దీపావళి పర్వదినాన ప్రత్యేకించి లక్ష్మీదేవిని పూజించడానికి కారణాలు వివరించే పలు పురాణ గాథలు ఉన్నాయి. ఏ ఇంట్లో దీపావళి నాడు దీపం వెలిగించి లక్ష్మీదేవిని పూజిస్తారో ఆ ఇంట దేవి స్థిరంగా ఉంటుందనేది నమ్మకం.

శ్రీమహా విష్ణువు వామనావతారుడై కృతయుగంలో రాక్షసరాజు బలి చక్రవర్తిని పాతాళానికి అణచివేశాడు. అది బలి పాలన అంతమైన రోజు. త్రేతాయుగంలో శ్రీరామ చంద్రుడు రావణాసురుణ్ణి వధించి తిరిగి ఆ రోజు అయోధ్యలో ప్రవేశించిన సుదినం. ద్వాపర యుగంలో నరకాసురుణ్ణి వధించిన రోజు. కలియుగంలో విక్రమశక స్థాపకుడైన విక్రమార్కుడు పట్టాభిషిక్తుడైన రోజు. ఈ నాలుగు యుగాలలో సంభవించిన విజయాలకు సూచికగా దీపావళి పర్వదినం జరుపుకుంటున్నాం.

– నందిరాజు రాధాకృష్ణ, సీనియర్ జర్నలిస్ట్ । 98481 28215

క్లుప్తంగా...

హైకోర్టుకు దీపావళి సెలవు 13న

సాక్షి, హైదరాబాద్: హిందువులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొనే దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 13న హైకోర్టు సెలవు ప్రకటించింది. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని జిల్లా కోర్టులు, ట్రిబ్యునళ్లు, కార్మిక కోర్టులకు ఈ సెలవు వర్తిస్తుందని పేర్కొన్నారు.

33 మంది జిల్లా జడ్జీల బదిలీ

- పలువురికి పదోన్నతులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 33 మంది జిల్లా న్యాయమూర్తులను బదిలీ చేస్తూ హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీచేసింది. వీరిలో కొందరిని సాధారణ బదిలీ చేయగా, మరికొందరికి పదోన్నతి కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో నంబర్ 65, 66లను జారీ చేసినట్లు రిజిస్ట్రార్ జనరల్(విజిలెన్స్) పేర్కొన్నారు. న్యాయమూర్తులంతా బదిలీ అయిన స్థానాల్లో ఈ నెల 17లోగా రిపోర్టు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న న్యాయస్థానాల్లో తీర్పులను రిజర్వు చేసి ఉంటే, రిలీవ్ అయ్యేలోగా వెల్లడించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం వారు పనిచేస్తున్న ప్రాంతం, బదిలీ అయిన ప్రాంతం, ఎవరికి రిపోర్టు చేయాలన్న వివరాలను హైకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ఉత్తర్వుల్లో వెల్లడించారు.

చదువుతోనే చైతన్యం

- మానవహక్కుల కమిషన్ మాజీ కమిషనర్, రిటైర్డ్ జస్టిస్ చంద్రయ్య



కరీంనగర్ కల్చరల్: ప్రభుత్వాలు చదువుకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు మెరుగుపరచాలని, చదువుతోనే చైతన్యం ఏర్పడుతుందని మానవహక్కుల కమిషన్ మాజీ కమిషనర్, రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రయ్య పేర్కొన్నారు. కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ 'విద్యా, వైద్యం వ్యాపారంగా మారిపోయాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం కోసం రూ.లక్షల్లో ఖర్చు అవుతోంది. ప్రజలకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందేలా ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు. తనది మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామమని, తాను చిన్నప్పుడు పశువుల పాకలో చదువుకున్నానని అలాంటి స్థితినుంచి ఉన్నత చదువులు చదివి, తెలుగు విశ్వవిద్యాలయం నుంచి లా లో డాక్టరేట్ పొందానని అన్నారు. రిటైర్డ్ అయిన తర్వాత స్కూల్, సోషల్ ఆర్గనైజేషన్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

న్యాయసేవా సదన్ ప్రారంభం



రాష్ట్ర హైకోర్టులో న్యాయసేవాసదన్‌ను ప్రారంభిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే. చిత్రంలో జస్టిస్ శ్యామ్ కోషి, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ గిరిజా ప్రియదర్శిని, జస్టిస్ సూరేపల్లి నందా, అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి తదితరులు

నామినేషన్ల ర్యాలీల్లో ఘర్షణ

ఇబ్రహీంపట్నం రూరల్: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో గురువారం నామినేషన్ల సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాలు ఘర్షణకు దిగడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పరస్పరం రాళ్లు రువ్వుకోవడంతో ఇరు పార్టీల కార్యకర్తలతో పాటు పలువురు పోలీసులు గాయపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల అభ్యర్థులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి నామినేషన్లు వేసేందుకు ర్యాలీగా బయల్దేరారు. ఆర్డీవో కార్యాలయానికి సమీపంలో ఇవతలివైపు బీఆర్ఎస్, అవతలి వైపు కాంగ్రెస్ శ్రేణులు ఉండగా.. గొడవ మొదలైంది. ఇరు పార్టీల కార్యకర్తలు డివైడర్‌కు రెండువైపులా మోహరించి ఒకరిపై ఒకరు రాళ్లు, చెప్పులు విసురుకున్నారు. దీంతో ప్రత్యేక బలగాలు పలుమార్లు లాఠీచార్జి చేసి ఆందోళనకారులను చెదరగొట్టాయి. ఈ ఘటనలో సుమారు యాభై మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఎల్బీనగర్ డీసీపీ సాయికల్పనతో పాటు పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. వారిని రాచకొండ సీపీ దేవేంద్రసింగ్ చౌహాన్ పరామర్శించారు.



కార్యకర్తలను చెదరగొడుతున్న పోలీసులు

ఆల్మట్టి.. శ్రీశైలం నోట్లో మట్టి!

ఆల్మట్టి నుంచి తెలుగు రాష్ట్రాలకు రావాల్సిన నికర జలాల్లో 15.89 టీఎంసీలు కర్ణాటకకు మళ్లింపు

- గోదావరి–కావేరి అనుసంధానంలో భాగంగా కేంద్రం ప్రతిపాదనలు
- గతంలోనే కర్ణాటక, మహారాష్ట్రకు 35 టీఎంసీల కేటాయింపులు
- కృష్ణా ట్రిబ్యునల్–1, 2 నిర్ణయాలు విరుద్ధమని తెలంగాణ అభ్యంతరాలు
- నేడు జలసౌధలో జరిగే సమావేశంలో వ్యతిరేకించాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయం నుంచి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు రావాల్సిన కృష్ణా జలాల నికర వాటా నుంచి కర్ణాటకకు 15.89 టీఎంసీలు కేటాయించాలని తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. గోదావరి–కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టుపై శుక్రవారం నగరంలోని జలసౌధలో నిర్వహించనున్న సమావేశానికి సంబంధించిన ఎజెండాలో ఈ విషయాన్ని.. కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఎన్‌డబ్ల్యూడీఏ) పొందుపరిచింది. ప్రాజెక్టులో భాగంగా 148 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా బేసిన్ మీద నుంచి కావేరి బేసిన్‌కు తరలించనుండగా, అందులో తెలంగాణకు 45.06 టీఎంసీలు, ఏపీకి 43.86 టీఎంసీలు, తమిళనాడుకు 40.92 టీఎంసీలు, కర్ణాటకకు 15.89 టీఎంసీలు, పుదుచ్చేరికి 2.18 టీఎంసీల వాటాలను కేటాయించనున్నట్టు తెలిపింది. కర్ణాటక రాష్ట్రానికి గోదావరి–కావేరి అనుసంధానం ప్రాజెక్టు ద్వారా నేరుగా కాకుండా, ప్రత్యామ్నాయ పద్ధతి(సబ్‌స్టిట్యూట్)లో కృష్ణా బేసిన్‌లోని ఆల్మట్టి జలాశయం నుంచి కేటాయించనున్నట్టు ఎజెండాలో ప్రతిపాదించింది. ప్రత్యామ్నాయ పద్ధతిలో ఆల్మట్టి జలాశయం నుంచి 15.89 టీఎంసీలను కర్ణాటక రాష్ట్రంలోని మలప్రభ(కే–4) సబ్ బేసిన్ పరిధిలో సాగు, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు కేటాయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు పేర్కొంది. ఈ ప్రతిపాదనలు అమలైతే ఆల్మట్టి జలాశయం నుంచి శ్రీశైలం జలాశయానికి రావాల్సిన నికర జలాల్లో 15.89 టీఎంసీలకు గండిపడే ప్రమాదం ఏర్పడుతుంది. శుక్రవారం జరగనున్న ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశంలో ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

442 టీఎంసీల్లో 15.89 టీఎంసీలకు కోత

ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు కృష్ణా జలాల్లో 811 టీఎంసీల వాటాలున్నాయి. అందులో 369 టీఎంసీలకు రెండు రాష్ట్రాల పరిధిలోని కృష్ణా పరీవాహక ప్రాంతంలో కురిసే వర్షాలే ఆధారం కాగా, మిగిలిన 442 టీఎంసీలు ఆల్మట్టి జలాశయం(ఎగువ రాష్ట్రాల) నుంచి రావాల్సిందే. తాజా ప్రతిపాదనలతో ఎగువ నుంచి శ్రీశైలం జలాశయానికి రావాల్సిన 442 టీఎంసీల్లో 15.89 టీఎంసీలు తగ్గనున్నాయి.

ఇప్పటికే 35 టీఎంసీలు మళ్లింపు...

పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించడానికి బదులుగా, 21 టీఎంసీలను కర్ణాటకకు, 14 టీఎంసీలను మహారాష్ట్రకు గతంలో కేటాయించడంతో 35 టీఎంసీల కృష్ణా జలాలకు గండి ఏర్పడింది. ఇప్పుడు మరో 15.89 టీఎంసీలను కర్ణాటకకు కేటాయిస్తే.. మొత్తం 50.89 టీఎంసీల కృష్ణా జలాలు తెలుగు రాష్ట్రాలు నష్టపోనున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. కృష్ణా నదిపై కర్ణాటకలో నిర్మించిన అక్రమ ప్రాజెక్టులతో ఇప్పటికే దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి వచ్చే వరద ప్రవాహానికి భారీగా గండిపడగా, తాజా ప్రతిపాదనలు.. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రయోజనాలను మరింత దెబ్బతీస్తాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

కృష్ణా ట్రిబ్యునల్స్–1,2 కి విరుద్ధం..

గోదావరి ఉపనది మంజీర సబ్ బేసిన్‌కి సంబంధించిన కొంత భాగం మాత్రమే కర్ణాటక పరిధిలోకి వస్తుందని, దిగువన ఉన్న ఇంద్రావతి, ఇతర ఉప నదుల బేసిన్ల పరిధిలో కర్ణాటక రాష్ట్రం రాదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. అయినా 15.89 టీఎంసీలను కర్ణాటకకు కేటాయించడం సమంజసం కాదని అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. కృష్ణా ట్రిబ్యునల్–1 అవార్డు, కృష్ణా ట్రిబ్యునల్–2 నివేదికల కు ఇవి పూర్తి విరుద్ధమైన ప్రతిపాదనలని అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని ఎన్‌డబ్ల్యూడీఏ భేటీలో స్పష్టం చేయనుంది. ఏపీ, తెలంగాణల మధ్య కృష్ణా జలాల పంపిణీపై కృష్ణా ట్రిబ్యునల్–2 నిర్ణయం తీసుకునే వరకు నదుల అనుసంధానం ప్రాజెక్టును చేపట్టరాదని కోరనుంది.

ఛత్తీస్‌గఢ్ సమ్మతి లేకుండా ముందడుగు వద్దు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం వాడుకోని 148 టీఎంసీల గోదావరి జలాలను తరలించాలని నిర్ణయించిన నేపథ్యంలో ఆ రాష్ట్రం నుంచి సమ్మతి పొందిన తర్వాతే ముందుకు వెళ్లాలని మరోసారి తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేయనుంది. ప్రాజెక్టులో భాగంగా గోదావరిపై ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ నిర్మిస్తామని ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించగా, దిగువన ఉన్న సమ్మక్క బ్యారేజీ నిర్వహణలో ఇబ్బందులు వస్తామని తెలంగాణ అభ్యంతరం తెలియజేయనుంది. 148 టీఎంసీల్లో 50 శాతం జలాలను తెలంగాణకు కేటాయించాలని మరోసారి కోరనుంది. బచావత్ ట్రిబ్యునల్ అవార్డులోని 13(బీ) నిబంధనల మేరకు బెడ్తి–వార్దా నదుల అనుసంధానం ద్వారా తరలించనున్న 18 టీఎంసీల కృష్ణా జలాల్లో 50 శాతం.. అంటే 9 టీఎంసీలను తెలంగాణకు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేయనుంది.

'హెచ్‌సీఏ వివాదాన్ని పరిష్కరించండి'

సాక్షి, హైదరాబాద్: ఉప్పల్ స్టేడియం అభివృద్ధికి సంబంధించి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)కు, విశాఖ ఇండస్ట్రీస్‌కు మధ్య నెలకొన్న వివాదాన్ని నాలుగు వారాల్లో పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా వాణిజ్యకోర్టును హైకోర్టు ఆదేశించింది. అక్కడే సమస్యపై తుది పరిష్కారానికి రావాలని ఇరు పార్టీలకు సూచించింది. ఉప్పల్ స్టేడియం, హెచ్‌సీఏ బ్యాంక్ అకౌంట్లుసహా ఆస్తులన్నింటినీ రంగారెడ్డి జిల్లా కోర్టు అటాచ్ చేయడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టు నియమించిన హెచ్‌సీఏ అడ్మినిస్ట్రేటర్ జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది.

ప్రజాప్రతినిధులపై క్రిమినల్ కేసుల్లో

విచారణకు ప్రత్యేక బెంచ్‌లు

- హైకోర్టులకు సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశం
- ఇలాంటి కేసుల విచారణలో జాప్యం వద్దని వెల్లడి



న్యూఢిల్లీ: ప్రజాప్రతినిధులపై నమోదైన క్రిమినల్ కేసుల్లో విచారణకు సంబంధించి సుప్రీంకోర్టు కీలకమైన ఆదేశాలు జారీ చేసింది. ఎంపీలు, ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసుల్లో విచారణను వేగవంతం చేయడానికి ప్రత్యేక ధర్మాసనాలు(బెంచ్‌లు) ఏర్పాటు చేయాలని హైకోర్టులను ఆదేశించింది. దేశవ్యాప్తంగా ప్రజాప్రతినిధులపై 5 వేలకుపైగా క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వీటిపై విచారణ మందకొడిగా సాగుతోంది. తీవ్రమైన నేరాలకు పాల్పడేవారిని జీవిత కాలం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని సీనియర్ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ప్రజాప్రతినిధులపై క్రిమినల్ కేసుల్లో విచారణను వేగంగా పూర్తిచేయడానికి కచ్చితమైన మార్గదర్శకాలు జారీ చేయడం క్లిష్టమైన ప్రక్రియ అని అభిప్రాయపడింది. ప్రజాప్రతినిధులపై క్రిమినల్ కేసులను వేగంగా పరిష్కరించే బాధ్యతను హైకోర్టులకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎంపీలు, ఎమ్మెల్యేలపై క్రిమనల్ కేసుల విచారణకు కొన్ని మార్గదర్శకాలను సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. ఇలాంటి కేసుల వివరాలను జిల్లా కోర్టులు, ప్రత్యేక కోర్టుల నుంచి సేకరించి, హైకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని తెలియజేసింది. తీవ్రమైన నేరాల విషయంలో విచారణను వాయిదా వేయకూడదని ట్రయల్ కోర్టులకు తేల్చిచెప్పింది. క్రిమినల్ కేసుల సత్వర పరిష్కారానికి వెబ్‌సైట్‌ను, సాంకేతిక పరిజ్ఞానాన్ని సిద్ధం చేసుకోవాలని పేర్కొంది. ప్రజాప్రతినిధులు తీవ్ర నేరాలను పాల్పడినట్లు అభియోగాలు నిరూపితమైతే ఎంపీ లేదా ఎమ్మెల్యే ఎన్నికల్లో వారు పోటీ చేయకుండా జీవితకాలం నిషేధం విధించడంపై విచారణ జరుపుతున్నామని స్పష్టం చేసింది. ఈ అంశంపై తాము ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలియజేసింది.

ఎంపీ మహువా మొయిత్రాను బహిష్కరించాలి

- డబ్బులు తీసుకుని ప్రశ్నలు అడిగారన్న ఆరోపణలపై ఎథిక్స్ కమిటీ సిఫారసు



న్యూఢిల్లీ: టీఎంపీ ఎంపీ మహువా మొయిత్రాపై అనర్హత వేటువేయాలని లోక్‌సభ ఎథిక్స్ కమిటీ సిఫారసు చేసింది. అదానీ గ్రూప్‌నకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో ప్రశ్నలడిగేందుకు వ్యాపారవేత్త హీరా నందానీ నుంచి డబ్బులు తీసుకున్నారంటూ ఆమెపై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ అంశాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఎథిక్స్ కమిటీకి పంపారు. బీజేపీ ఎంపీ వినోద్‌కుమార్ సోంకార్ సారథ్యంలో గురువారం సమావేశమైన 10 మంది సభ్యుల ఎథిక్స్ కమిటీ 479 పేజీల నివేదిను ఆమోదించింది. పదిహేను రోజుల వ్యవధిలో ముగ్గురిని ప్రశ్నించి దీనిని తయారు చేశామని సోంకార్ చెప్పారు. ఎంపీ మొయిత్రాను సస్పెండ్ చేయాలన్న సిఫారసును కమిటీలోని నలుగురు వ్యతిరేకించగా ఆరుగురు బలపరిచారని తెలిపారు. కాగా, ఒక ఎంపీపై అనర్హత వేటు వేయాలంటూ ఎథిక్స్ కమిటీ సిఫారసు చేయడం ఇదే మొదటిసారని చెబుతున్నారు. దీనిపై ఎంపీ మొయిత్రా స్పందిస్తూ.. ఇదంతా ముందుగానే ఖరారు చేసిన 'మ్యాచ్ ఫిక్సింగ్' అంటూ వ్యాఖ్యానించారు. ఇప్పటికి తనను బహిష్కరించినా, వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో మళ్లీ సభలోకి అడుగుపెడతానన్నారు. ఈ నివేదికను ఎథిక్స్ కమిటీ పార్లమెంట్ ముందుంచుతుంది. అనంతరం చర్చ, ఆపైన చర్యలపై ఓటింగ్‌కు పెడతారు. ఎంపీ మహువా మొయిత్రా లంచం తీసుకున్నారంటూ అక్టోబర్ 14న బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే, లాయర్ జై అనంత్ దేహద్రాయ్‌తో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు చేయడంతో వివాదం మొదలైంది. ఇలా ఉండగా, తమ ఎంపీ మొయిత్రాను టీఎంసీ గట్టిగా సమర్థించింది. బీజేపీ సారథ్యంలోని కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రశ్నించిన వారిని వేధిస్తోందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ విమర్శించారు. ఆరోపణలు రుజువు కాకుండానే పార్లమెంటరీ కమిటీ ఆమెపై చర్యలకు ఎలా సిఫారసు చేస్తుందని ప్రశ్నించారు.

క్లుప్తంగా...

డిసెంబర్ 4 నుంచి శీతాకాల సమావేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాల తేదీలు ఖరారయ్యాయి. డిసెంబర్ 4న మొదలై డిసెంబర్ 22వ తేదీ వరకు ఈ సమావేశాలు జరుగుతాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి గురువారం తెలిపారు. మొత్తం 19 రోజుల వ్యవధిలో 15 సిట్టింగ్‌లుంటాయని 'ఎక్స్'లో చెప్పారు. డబ్బులు తీసుకుని పార్లమెంట్‌లో ప్రశ్నలడిగినట్లు ఆరోపణలెదుర్కొంటున్న టీఎంసీకి చెందిన ఎంపీ మహువా మొయిత్రాపై ఎథిక్స్ కమిటీ విచారించి అందజేసిన నివేదికపై ఈ సమావేశాల్లో చర్చించి, ఆమెను బహిష్కరించే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

బిహార్‌లో 65 శాతానికి రిజర్వేషన్లు

ఆమోదించిన అసెంబ్లీ

పట్నా: బిహార్‌లో ప్రభుత్వ విద్యాసంస్థలు, ఉద్యోగాల్లో కుల రిజర్వేషన్లను 50 నుంచి 65 శాతానికి పెంచేందుకు ఉద్దేశించిన బిల్లుకు రాష్ట్ర అసెంబ్లీ ఆమోద ముద్ర వేసింది. దీంతో, రాష్ట్రంలో అన్ని రిజర్వేషన్లు కలిపి 75శాతానికి చేరినట్లయింది. గురువారం అసెంబ్లీలో బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం నితీశ్ కుమార్ మాట్లాడుతూ.. ఆర్థికంగా బలహీన వర్గాలకు కేటాయించిన 10శాతం రిజర్వేషన్‌తో కలిపి ఇప్పుడు రిజర్వేషన్లు మొత్తమ్మీద 75 శాతానికి చేరుకున్నాయి'అని అన్నారు. అంతకుముందు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, అత్యంత వెనుకబడిన కులాలు(ఈబీసీలు), ఇతర వెనుకబడిన కులాల(ఓబీసీల)కు ప్రస్తుతమున్న 50% రిజర్వేషన్లను 65%కి పెంచుతూ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానించింది. సమగ్ర కులగణన ఆధారంగా విద్యా సంస్థలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల పెంపుపై ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులకు సభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది.

బరితెగించిన పాక్ రేంజర్స్

సరిహద్దు వెంట కాల్పుల్లో కానిస్టేబుల్ వీరమరణం



జమ్మూ/అర్నియా: కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడుస్తూ పాకిస్తాన్ రేంజర్స్ జరిపిన కాల్పుల్లో సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) హెడ్ కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయారు. జమ్మూకశ్మీర్‌లోని సాంబా జిల్లాలోని రామ్‌గఢ్ సెక్టార్‌లో భారత్–పాక్ సరిహద్దు వెంట గురువారం ఈ ఘటన జరిగింది. సరిహద్దు ఔట్‌పోస్ట్ వద్ద ఉన్న 50ఏళ్ల లాల్‌ఫామ్ కీమాపై కాల్పులు జరపడంతో రక్తమోడుతున్న ఆయనను వెంటనే స్థానిక ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం జమ్మూలోని జీఎంసీ ఆస్పత్రికి తరలించినా ప్రాణాలు దక్కలేదని ఆర్మీ అధికారులు వెల్లడించారు. ' పాక్ రేంజర్ల కాల్పులకు దీటుగా బీఎస్ఎఫ్ బలగాలు కాల్పుల మోత మోగించాయి. సమీపంలోని జెర్దా గ్రామంపైనా పాక్ రేంజర్లు కాల్పులు జరిపారు' అని ఆర్మీ ఒక ప్రకటనలో పేర్కొంది.

ఎన్నికల్లో ఓడిపోతే మళ్లీ ఉద్యోగం

రాజస్తాన్ ప్రభుత్వ వైద్యుడికి హైకోర్టు వెసులుబాటు

జైపూర్: రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రభుత్వ డాక్టర్ దీపక్ ఘోగ్రా(43)కు రాష్ట్ర హైకోర్టు అనుమతి మంజూరు చేసింది. ఒకవేళ ఎన్నికల్లో ఓడిపోతే ఆయన మళ్లీ ఉద్యోగంలో చేరడానినికి అంగీకరించింది. దీపక్ భారతీయ ట్రైబల్ పార్టీ టికెట్‌పై దుంగార్పూర్ స్థానం నుంచి పోటీకి దిగుతున్నారు. పరాజయం పాలైతే ఉద్యోగంలో చేర్చుకోవాలంటూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు సానుకూలంగా స్పందించింది. ఎన్నికల్లో దీపక్ ఓడిపోతే మళ్లీ ఉద్యోగంలో చేర్చుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది.

అయోధ్యలో 'ఆదిత్య' మంత్రివర్గ సమావేశం

అయోధ్య: రాష్ట్ర రాజధాని లక్నోలో కాకుండా అయోధ్యలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఏర్పాటుచేశారు. అయోధ్యలో కేబినెట్ భేటీ జరగడం ఇదే తొలిసారి. అత్యంత అరుదైన సందర్భాల్లోనే ఇలా రాష్ట్ర రాజధానికి బదులు వేరే చోట కేబినెట్ సమావేశమవుతుంది. అయోధ్యలో భవ్య రామమందిరం ప్రారంభోత్సవానికి అంగరంగ వైభవంగా సంసిద్ధమవుతున్న వేళ అదే పట్టణంలో సీఎం మంత్రివర్గాన్ని సమావేశపరచడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

గాజా సిటీపై దండయాత్ర

నగరం చుట్టూ మోహరించిన ఇజ్రాయెల్ సైన్యం

- అల్–షిఫా, అల్–ఖుద్స్ ఆసుపత్రులపై దాడులకు సన్నాహాలు
- గాజాలో మిలిటెంట్ స్థావరాలపై క్షిపణి దాడులు

ఖాన్ యూనిస్: హమాస్ మిలిటెంట్లపై ఇజ్రాయెల్ యుద్ధం మరో మలుపు తిరిగింది. గాజాస్ట్రిప్‌లో అతిపెద్ద నగరమైన గాజా సిటీని ఇజ్రాయెల్ సైన్యం చుట్టుముట్టింది. హమాస్ స్థావరాలే లక్ష్యంగా వైమానిక దాడులు తీవ్రతరం చేసింది. బుధవారం అర్ధరాత్రి నుంచి పెద్ద సంఖ్యలో క్షిపణులు ప్రయోగించింది. 100కుపైగా హమాస్ సొరంగాలను పేల్చేశామని, పదుల సంఖ్యలో మిలిటెంట్లు హతమయ్యారని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇజ్రాయెల్ పదాతి దళాలు ఉత్తర గాజాలోని గాజా సిటీలోకి అడుగుపెట్టాయి. వీధుల్లో కవాతు చేస్తూ మిలిటెంట్ల కోసం గాలిస్తున్నాయి. గాజా సిటీలో రోగులు, క్షతగాత్రులతోపాటు వేలాదిగా పాలస్తీనియన్లు ఆశ్రయం పొందుతున్న అల్–షిఫా హాస్పిటల్ యుద్ధక్షేత్రంగా మారింది. ఆసుపత్రి చుట్టూ ఇజ్రాయెల్ సేనలు మోహరించాయి. అల్–షిఫా హాస్పిటల్‌లోనే హమాస్ ప్రధాన కమాండ్ సెంటర్ ఉందని, సీనియర్ మిలిటెంట్లు ఇక్కడి నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నారని, దాన్ని ధ్వంసం చేసి తీరుతామని సైన్యం తేల్చిచెప్పింది. ప్రస్తుతం ఇజ్రాయెల్ జవాన్లు ఆసుపత్రి చుట్టూ 3 కిలోమీటర్ల దూరంలోనే మోహరించారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే ఆసుపత్రిలోకి చొచ్చుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. గాజాలోని అల్–ఖుద్స్ హాస్పిటల్‌పైనా సైన్యం దృష్టి పెట్టింది. ఇక్కడ వంద మందికిపైగా క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు. హమాస్ మిలిటెంట్లు అల్–ఖుద్స్ ఆసుపత్రి ప్రాంగణంలో మకాం వేశారని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. క్షతగాత్రుల ముసుగులో తప్పించుకుంటున్నారని చెబుతోంది. ఆసుపత్రుల్లో మిలిటెంట్లు ఉన్నారన్న ఇజ్రాయెల్ వాదనను హమాస్ ఖండించింది.

వెస్ట్‌బ్యాంక్‌పై దాడి.. 11 మంది మృతి

గాజాలో ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో మృతి చెందిన పాలస్తీనియన్ల సంఖ్య గురువారం 10,812కు చేరుకుంది. మరో 2,300 మంది శిథిలాల కిందే ఉండిపోయారు. వారు మరణించి ఉంటారని స్థానిక అధికారులు అంచనా వేస్తున్నారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోనూ హింసాకాండ కొనసాగుతోంది. గురువారం వెస్ట్‌బ్యాంక్‌లోని జెనిన్ శరణార్థి శిబిరంపై జరిగిన ఇజ్రాయెల్ దాడుల్లో కనీసం 11 మంది పాలస్తీనియన్లు మృత్యువాత పడ్డారు. మరో 20 మంది గాయపడ్డారు. పలు భవనాలు ధ్వంసమైనట్లు తెలుస్తోంది.

ఆ ఫొటో జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలి

అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిని చిత్రీకరించిన ఫొటో జర్నలిస్టుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఇజ్రాయెల్ గురువారం డిమాండ్ చేసింది. గాజాకు చెందిన ఈ జర్నలిస్టులు అంతర్జాతీయ మీడియా సంస్థల తరఫున పనిచేస్తున్నారు. హమాస్ దాడిని కెమెరాలతో చిత్రీకరించారు. ఫొటోలు తీశారు. మీడియాకు విడుదల చేశారు. హమాస్ దాడి గురించి వారికి ముందే సమాచారం ఉందని, అందుకే కెమెరాలతో సర్వసన్నద్ధమై ఉన్నారని ఇజ్రాయెల్ ఆరోపించింది. మానవత్వంపై జరిగిన నేరంలో వారి పాత్ర ఉందని మండిపడింది. వారి వ్యవహార శైలి పాత్రికేయ ప్రమాణాలకు విరుద్ధమని ఆక్షేపించింది. సదరు ఫొటోజర్నలిస్టులు పనిచేస్తున్న మీడియా సంస్థకు ఇజ్రాయెల్ లేఖలు రాసింది.



గాజా స్ట్రిప్‌లో హమాస్ ఆయుధ కర్మాగారంగా భావిస్తున్న ఓ అపార్ట్‌మెంట్‌ను పరిశీలిస్తున్న ఇజ్రాయెల్ సైనికుడు



గాజా స్ట్రిప్‌లోని బురెయిజ్ శరణార్థి శిబిరం నుంచి దక్షిణ గాజాకు కాలినడకన వలసవెళ్తున్న పాలస్తీనియన్లు

ఉత్తర గాజా నుంచి దక్షిణ గాజాకు..

ఉత్తర గాజా–దక్షిణ గాజాను కలిపే ప్రధాన రహదారిని ఇజ్రాయెల్ సైన్యం వరుసగా ఐదో రోజు తెరిచి ఉంచింది. నిత్యం వేలాది మంది జనం ఉత్తర గాజా నుంచి వేలాది మంది దక్షిణ గాజాకు పయనమవుతున్నారు. పిల్లా పాపలతో కాలినడకనే తరలి వెళ్తున్నారు. కొందరు కట్టుబట్టలతో వెళ్లిపోతున్నారు. ఉత్తర గాజాలో హమాస్ స్థావరాలపై దాడులు ఉధృతం చేస్తామని, సాధారణ ప్రజలంతా దక్షిణ గాజాకు వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ సైన్యం సూచించింది. గాజాలో జనం సురక్షిత ప్రాంతాలకు చేరుకోవడానికి, మానవతా సాయం అందించడానికి వీలుగా ప్రతిరోజూ 4 గంటలపాటు దాడులకు విరామం ఇచ్చేందుకు ఇజ్రాయెల్ అంగీకరించిందని అమెరికా జాతీయ భద్రతా మండలి అధికార ప్రతినిధి జాన్ కిర్బీ తెలియజేశారు.

ఆ 8 మందికి మరణశిక్షపై

భారత్ అప్పీల్

ఖతర్ ఘటనపై భారత విదేశాంగ శాఖ స్పందన

న్యూఢిల్లీ: తమ దేశంలో గూఢచర్యానికి పాల్పడ్డారనే ఆరోపణలపై ఎనిమిది మంది మాజీ భారతీయ నావికాదళ అధికారులపై ఖతర్ దేశ న్యాయస్థానం విధించిన మరణశిక్షపై అప్పీల్ చేశామని భారత్ గురువారం వెల్లడించింది. సంబంధిత అంశాలను ఢిల్లీలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరీందమ్ బాగ్చీ వివరించారు. ' మంగళవారమే ఆ ఎనిమిది మందితో సంప్రతింపుల జరిపే అవకాశం దోహా నగరంలోని భారతీయ ఎంబసీ దౌత్యాధికారులకు లభించింది. నిర్బంధంలో ఉన్న మాజీ నావికాధికారులతో మనవాళ్లు మాట్లాడారు. వారికి న్యాయ, దౌత్యపరమైన పూర్తి రక్షణ కల్పించేందుకు భారత ప్రభుత్వం కృషిచేస్తోంది' అని బాగ్చీ అన్నారు. వీరికి మరణశిక్ష ఖరారుచేస్తూ ఖతర్ కోర్టు అక్టోబర్ 26వ తేదీన తీర్పు ఇవ్వగానే భారత ప్రభుత్వం ఈ అంశాన్ని తీవ్రమైనదిగా పరిగణించింది. వారికి విముక్తి కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అనుసరించాల్సిన దౌత్య మార్గాలను అన్వేషిస్తోంది. 'అల్ దహ్రా గ్లోబల్ అనే ప్రైవేట్ కంపెనీలో పనిచేసిన వీరిపై ఖతర్ మరణ శిక్ష మోపింది. ఈ తీర్పు వివరాలు అత్యంత గోప్యమైనవి. వీటిని కేవలం న్యాయబృందంతోనే భారత్ పంచుకుంటోంది. తదుపరి చర్యలకు సిద్ధమయ్యాం. ఇప్పటికే అప్పీల్ కూడా చేశాం. బాధితుల కుటుంబాలతో మాట్లాడాం. ఇటీవలే వారి కుటుంబసభ్యులను భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ స్వయంగా కలిసి ధైర్యం చెప్పారు'' అని బాగ్చీ చెప్పారు. అసలు వీరు ఏ విధమైన గూఢచర్యానికి పాల్పడ్డారనే వివరాలను ఇంతవరకు ఖతర్ న్యాయస్థానం బహిరంగంగా వెల్లడించలేదు. కేసులోని సున్నితత్వం దృష్ట్యా ఈ అంశంపై భారత్ తరఫున ఉన్నతాధికారులూ బహిరంగంగా ఏమీ మాట్లాడలేదు. 'కేసు సున్నితత్వాన్ని పరిగణనలోకి తీసుకుని ఎవరూ ఈ అంశాన్ని సంచలనాల కోసం లేనిపోని రాద్ధాంతాలు, వక్రభాష్యాలతో నింపేయకండి' అని బాగ్చీ విజ్ఞప్తిచేశారు. మార్చి 25వ తేదీన మాజీ అధికారులపై కేసు నమోదుచేసి ఖతార్ చట్టాల కింద అరెస్ట్‌చేశారు. మరణశిక్షను ఎదుర్కొంటున్న వీరంతా భారత నావికాదళంలో ముఖ్యమైన పదవుల్లో దాదాపు 20 సంవత్సరాలపాటు సేవలందించారు. దళ సభ్యులకు ఇన్‌స్ట్రక్టర్‌లుగా పనిచేశారని మాజీ సైన్యాధికారులు గుర్తుచేసుకున్నారు. వీరి అరెస్ట్ తర్వాత మే నెలలో దోహాలోని అల్ దహ్రా గ్లోబల్ సంస్థ తన కార్యకలాపాలను నిలిపేసింది. అందులో పనిచేసే సిబ్బందిని, ముఖ్యంగా భారతీయులను స్వదేశానికి పంపించేసింది.

• పేదలకు కోట్ల ఇళ్లు కట్టించాను..

నాకు ఒక్క ఇల్లూ లేదు

- మధ్యప్రదేశ్ ఓటు 'త్రిశక్తి' వంటిది
- కాంగ్రెస్‌కు కనీసం 100 ఏళ్లు అధికారమివ్వకండి
- దేశాన్ని తిరోగమనంలో నడిపించడంలో ఆ పార్టీ దిట్ట
- మధ్యప్రదేశ్ ఎన్నికల ర్యాలీల్లో ప్రధాని మోదీ విమర్శలు



ఛత్తర్‌పూర్/సత్నా/నీముచ్(మధ్యప్రదేశ్): దేశంలోని పేదలకు తమ ప్రభుత్వం నాలుగు కోట్ల పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చిందని, తన కోసం ఒక్క ఇల్లు కూడా కట్టుకోలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మధ్యప్రదేశ్‌ని ఒక్కో ఓటు రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడేందుకు, కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి బలాన్నిచ్చేందుకు, అవినీతి కాంగ్రెస్‌ను మరో 100 ఏళ్లపాటు అధికారానికి దూరం ఉంచేందుకు ఉపయోగపడే 'త్రిశక్తి' వంటిందని పేర్కొన్నారు. దేశాభివృద్ధిని వెనక్కి నడిపించడంలో కాంగ్రెస్‌కు మంచి నైపుణ్యం ఉందని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. అందుకే, అవినీతి కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వరాదని ప్రజలకు పిలుపునిచ్చారు. మధ్యప్రదేశ్‌లోని ఛత్తర్‌పూర్, సత్నా, నీముచ్‌లలో గురువారం జరిగిన ఎన్నికల ర్యాలీల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. 'మా ప్రభుత్వం దేశంలోని పేదలకు నాలుగు కోట్ల పక్కా గృహాలను నిర్మించి ఇచ్చింది. కానీ, నేను ఒక్క ఇల్లు కూడా కట్టుకోలేకపోయాను'అని ఆయన చెప్పారు. 'వాహనం మనల్ని రివర్స్‌గేర్‌లో వెనక్కి తీసుకెళ్లినట్లుగానే కాంగ్రెస్ పార్టీకి సుపరిపాలనను రివర్స్‌గేర్‌లో దుష్పరిపాలనగా మార్చడంలో నైపుణ్యం ఉంది. 100 ఏళ్ల క్రితమే గొప్ప నీటి వనరులున్న బుందేల్‌ఖండ్‌లో నీటి సమస్యలను తీర్చేందుకు రాష్ట్రంలో అధికారంలో ఉండగా కాంగ్రెస్ ఎలాంటి ప్రయత్నమూ చేయలేదు. దీంతో, ఇక్కడి ప్రజలు నీటి కోసం అల్లాడుతున్నారు. అందుకే, ఆ పార్టీకి కనీసం 100 ఏళ్లపాటు అధికారం ఇవ్వరాదు. అప్పుడే అభివృద్ధి సాధ్యం'అని ప్రజలను కోరారు. బానిస మనస్తత్వంతో కూడిన కాంగ్రెస్ దేశ అభివృద్ధిని పట్టించుకోలేదు, దేశ వారసత్వంతోనూ ఆ పార్టీకి సంబంధం లేదని మోదీ అన్నారు. 'కాంగ్రెస్‌కు ఒక పంజా ఉంది. పేదల వద్ద ఉన్న వాటిని గుంజుకోవడానికే దానిని వాడుతుంది. అలాంటి కాంగ్రెస్ పంజా బారి నుంచి మధ్యప్రదేశ్‌ను మనం కాపాడు కోవాల్సిన అవసరం ఉంది'అంటూ ఆ పార్టీ ఎన్నికల గుర్తు హస్తంను ఉద్దేశించి ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

నకిలీలను తొలగించాం

ప్రభుత్వ పథకాల ద్వారా పేదల ధనాన్ని కాంగ్రెస్ ప్రభుత్వాలు లూటీ చేశాయని విమర్శించారు.కాంగ్రెస్ జమానాలో డబ్బంతా ఎక్కడికి చేరుతుందో ప్రజలకు అర్థమయ్యేది కాదు. 2జీ, కోల్, కామన్‌వెల్త్, హెలికాప్టర్ల కుంభకోణాల రూపంలో లక్షల కోట్లు దారి మళ్లాయి. వీటన్నిటినీ మోదీ ప్రభుత్వం ఆపు చేసింది. అప్పట్లో దళారులదే రాజ్యంగా ఉండేది. మోదీ ప్రభుత్వం వారి దుకాణాలను మూసివేయించింది. అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వాలు సృష్టించిన దేశంలోని ప్రభుత్వ పథకాల 10 కోట్ల నకిలీ లబ్ధిదారులను తొలగించి ప్రజాధనాన్ని కాపాడామన్నారు. పదేళ్ల కాలంలో రూ.33 లక్షల కోట్లను నేరుగా పేదల బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు వివరించారు. ఇందులో ఒక్క రూపాయి కూడా పక్కదారి పట్టలేదని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో పేదల పిల్లలు ఆకలితో అలమటించకుండా చేయగలగడం కేవలం మోదీ వల్ల కాదు, మీ అందరివల్లే ఇది సాధ్యమైందని చెప్పారు. ఓటుతో ప్రజలిచ్చిన అధికారం వల్లనే పేదల ఆకలి తీర్చగలిగినట్లు చెప్పారు.



సాహిత్య అకాడమీ 'బాలల సాహిత్య అవార్డ్'-2023ను ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సుధామూర్తికి అందజేస్తున్న దృశ్యం. గురువారం ఢిల్లీలో ఈ కార్యక్రమం జరిగింది.

ముగ్గురు జడ్జీలతో ప్రమాణం చేయించిన సీజేఐ



సుప్రీంకోర్టు జడ్జీలుగా ప్రమాణం చేస్తున్న జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్, జస్టిస్ సందీప్ మెహతా

న్యూఢిల్లీ: ఢిల్లీ, రాజస్తాన్, గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు గురువారం సుప్రీంకోర్టు జడ్జీలుగా ప్రమాణం చేశారు. వీరి నియామకంతో అత్యున్నత న్యాయస్థానంలో జడ్జీల సంఖ్య పూర్తి స్థాయి 34కు చేరింది. సుప్రీంకోర్టు భవన సముదాయంలో జరిగిన కార్యక్రమంలో మూడు హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ, జస్టిస్ ఆగస్టీన్ జార్జి మసీహ్, జస్టిస్ సందీప్ మెహతాలతో ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ వైవీ చంద్రచూడ్ ప్రమాణం చేయించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. అంతకుముందు, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శర్మ, రాజస్తాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మసీహ్, గౌహటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మెహతాలను సుప్రీంకోర్టులో జడ్జీలుగా నియమించినట్లు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 'ఎక్స్'లో ప్రకటించారు. వీరి పేర్లను కొలీజియం ఈ నెల 6న ఎంపిక చేసి కేంద్రానికి సిఫారసు చేసిన విషయం తెలిసిందే.

రిషి సునాక్ ఇంట దీపావళి వేడుక



లండన్‌లో దీపావళి వేడుక జరుపుకుంటున్న రిషి సునాక్, అక్షత

లండన్: భారత సంతతికి చెందిన బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్, అక్షతా మూర్తి దంపతులు 10 డౌనింగ్ స్ట్రీట్‌లోని తమ అధికార నివాసంలో దీపావళి వేడుకలు జరుపుకున్నారు. బుధవారం జరిగిన ఈ వేడుకల్లో పలువురు ప్రవాస భారతీయులు, పార్లమెంటేరియన్లు, పారిశ్రామికవేత్తలు, బాలీవుడ్ ప్రముఖులు పాల్గొన్నారు. ప్రధానిగా సునాక్ బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం సాయంత్రం ప్రధానమంత్రి నివాసాన్ని రంగురంగుల దీపాలతో అలంకరించారు. ప్రధాని రిషి సునాక్, అక్షతామూర్తి దంపతులు కలిసి దీపాలు వెలిగిస్తున్న దృశ్యాలను ప్రధాని కార్యాలయం 'ఎక్స్'లో పోస్టు చేసింది. ప్రధాని రిషి సునాక్ అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

కమలా హ్యారిస్ నివాసంలోనూ..

వాషింగ్టన్: భారత సంతతికి చెందిన అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ మంగళవారం వాషింగ్టన్‌లోని తన అధికార నివాసంలో దీపావళి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భారతీయ అమెరికన్లు సహా 300 మంది వరకు పాల్గొన్నారు. దీపాలు వెలిగించిన అనంతరం చట్టసభల ప్రతినిధులైన రో ఖన్నా, శ్రీ థానెదార్, రాజా కృష్ణమూర్తి, ప్రమీలా జయపాల్ తదితరులతో ఆమె మాట్లాడారు. ఈసందర్భంగా ఆమె ఇజ్రాయెల్, హమాస్ మధ్య పోరును ప్రస్తావించారు. పాలస్తీనియన్లకు సాయం అందించేందుకు అమెరికా ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

Interview

బీజేపీ, బీఆర్ఎస్ మధ్యనే పోటీ

చాలా చోట్ల కాంగ్రెస్‌కు డిపాజిట్ వచ్చే పరిస్థితి లేదు

కె. రాహుల్

"అధికార బీఆర్ఎస్‌పై ప్రజల ఆగ్రహ జ్వాలల అగ్నిపర్వతం నవంబర్ 30న బద్దలవుతుంది. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు వారిని అసహ్యించుకుంటున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీకి చాలాచోట్ల డిపాజిట్ వచ్చే పరిస్థితి లేదు. అసలు కొన్ని నియోజకవర్గాల్లో అయితే కాంగ్రెస్ అసలు పోటీలోనే లేదు. తెలంగాణలోని యువత మొత్తం భారతీయ జనతాపార్టీ వైపే ఉంది." అని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రస్తుత ఎన్నికల రాజకీయ పరిణామాలపై అంచనా వేశారు. "కేసీఆర్ పాలనలో తెలంగాణ పూర్తిగా విధ్వంసానికి గురి కాగా.. ఒకవేళ కాంగ్రెస్ వస్తే రాజకీయ అస్థిరత ఏర్పడి ఉద్యోగులకు జీతాలివ్వలేక తిరుగుబాటు చేసే పరిస్థితులు వస్తాయి. అందుకే బీసీ సీఎం నినాదంతో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే బీజేపీని అధికారంలోకి తీసుకు రావాలని కోరుతున్నాం.' అని పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో కిషన్‌రెడ్డి 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ విశేషాలు..

కేవలం కొన్ని చోట్లనే ముక్కోణపు పోటీ

మజ్లిస్ నేతలు ఉండాల్సింది జైలులో..



కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

అధికార బీఆర్ఎస్, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీలు మేమంటే మేము అధికారంలోకి వస్తామంటున్నాయి కదా ?

- ఎన్నికల్లో మాకు, బీఆర్ఎస్‌కే ప్రధాన పోటీ. కొన్నిచోట్ల మాత్రమే బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య ముక్కోణపు పోటీ ఉంది. అనేక నియోజకవర్గాల్లో అసలు కాంగ్రెస్ పోటీలోనే లేదు. గ్యారంటీల పేరుతో హైప్ సృష్టించే ప్రయత్నంతోపాటు బీజేపీపై బురదచల్లి తప్పుడు ప్రచారంతో లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఇక అధికార బీఆర్ఎస్‌పై ప్రజల్లో అసంతృప్తి నివురుగప్పిన నిప్పులా ఉంది. ఎప్పుడు అగ్నిపర్వతం బద్దలవుతుందో తెలియదన్నట్టుగా పరిస్థితి ఉంది. వారు ఎంత ప్రచారం చేస్తే ఏమి లాభం, ఆ పార్టీ అభ్యర్థులు ఎక్కడికి వెళ్లినా ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ప్రభుత్వంలో ఉంది కాబట్టి, నేతల బలాన్ని చూసి ఇప్పుడు బయటకు చెప్పకపోవచ్చు. కానీ బీఆర్ఎస్‌పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అయినా సరే హ్యాట్రిక్ కొడతామంటూ బీఆర్ఎస్ బింకాలు పోతోంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో కాంగ్రెస్ ఫ్రంట్ ఏర్పడితే అక్కడకు వెళ్లాలని కేసీఆర్ కలలు కంటున్నారు. ఆయన కుమారుడు కేటీఆర్ అప్పుడే సీఎం అయిపోయినట్టుగా ఊహాలోకాల్లో విహరిస్తున్నాడు. మంత్రులను నియమించుకుంటున్నట్టు కేటీఆర్ వ్యవహరిస్తున్నాడు. కేవలం భ్రమల్లో బీఆర్ఎస్ నేతలు బతుకుతున్నారు. ఇక మా పార్టీకి ఊహించని విధంగా ప్రజల్లో మద్దతు పెరుగుతోంది. ఇది మామూలు పరిస్థితుల్లో రాదు. మాది యూత్‌ఫుల్ పార్టీ. ఎక్కడి చూసిన యువతే పార్టీని నడిపిస్తోంది.

ప్రచారాన్ని ఎప్పుడు ముమ్మరం చేస్తారు ?

- నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యాక నాలుగైదు రోజుల్లో అన్ని పార్టీల అభ్యర్థులపై స్పష్టత వచ్చాక.. మొత్తంగా దీపావళి తర్వాత ప్రచారాన్ని ఉధృతం చేయబోతున్నాం. బీజేపీకి పోలింగ్‌బూత్ స్థాయి కమిటీలు, కార్యకర్తలు ఉన్నారు. సంస్థాగత నిర్మాణం ఉంది. ఎవరు అభ్యర్థులు ఐనా ఒరిజినల్‌గా ఉన్న ఆర్గనైజేషన్ నెట్‌వర్క్ అనేది పనిచేస్తుంది.

అభ్యర్థుల ఖరారులో ఆలస్యం వల్ల ప్రచారానికి ఇబ్బంది కాదా ?

- బీజేపీలో టికెట్ల కోసం విపరీతమైన పోటీ నెలకొంది. దీంతో అభ్యర్థుల ఖరారులో కొంత ఒత్తిడి ఏర్పడింది. అయితే ఆయా స్థానాలకు ఖరారు చేసిన వారు ఇప్పటికే మూడు, నాలుగేళ్లుగా పనిచేస్తున్న వాళ్లే. ప్రజలకు బాగా తెలిసినవారే. అందువల్ల పెద్ద ఇబ్బందేమి ఉండదు. రాబోయే ఇరవై రోజుల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తాం. ప్రధాని మోదీ, అమిత్‌షా, జేపీ నడ్డా, యూపీ సీఎం యోగి, అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ.. ఇలా హేమాహేమీల ప్రచారంతో హోరెత్తిస్తాం. పక్కా ప్లానింగ్‌తో ముందుకెళ్తాం.

పాత వారికి కాకుండా కొత్త వారికి ఎక్కువ సీట్లు ఇచ్చినట్టున్నారు ?

- మాది పెరుగుతున్న పార్టీ. బలపడుతున్న పార్టీ. అందువల్ల మిక్స్‌డ్‌గా ఆలోచించాలి. పాత-కొత్త కలయికగా వెళ్లాల్సి ఉంటుంది. ఈ కాంబినేషన్‌తో ప్రజల మద్దతు పొందాల్సి ఉంటుంది. పాత వారికే ఇస్తామని మడికట్టుకు ఉండలేం. పూర్తిగా కొత్తవారికీ ఇవ్వలేం. ఆ దిశలో అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేశాం. జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ ఇదే ప్రయోగం చేసి మంచి ఫలితాలు సాధించాం. అదే ఎక్స్‌పర్‌మెంట్‌తో ఇప్పుడూ మంచి ఫలితాలు సాధిస్తాం.

బీఆర్ఎస్ స్థానంలో కాంగ్రెస్ వస్తే పెనం నుంచి పొయ్యిలో పడుతుందని మీరు పదే పదే అంటున్నారు ? ఎందువల్ల ?

- కాంగ్రెస్ చరిత్ర ఏమిటి? పుట్టుక ఏమిటి? అవినీతి చరిత్ర ఏమిటి? ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎవరి చేతుల్లో ఉంది ? అని వివరించాల్సిన బాధ్యత మాపై ఉంది. కేంద్రంలో పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు రూ.12 లక్షల కోట్లు దోపిడీ చేశారు. కర్ణాటకలో అధికారంలోకి వచ్చాక అక్కడి దుస్థితి ఏమిటి? తెలంగాణ ఎన్నికల కోసం కర్ణాటకలో ఎలక్షన్ ట్యాక్స్ వేస్తున్నారు. ఇక బీఆర్ఎస్ అవినీతి పాలన గురించి ప్రజలకు వివరిస్తూనే...కాంగ్రెస్ తనకు తాను అధికారంలోకి వస్తామన్నట్టుగా అబద్ధపు ప్రచారంతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తోంది. దీంతో పెనం మీద నుంచి పొయ్యిలో పడకూడదనే హెచ్చరికతో ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత మాపై ఉంది. ఆ పార్టీల చరిత్రను వివరించి, అవి ఏరకంగానూ తెలంగాణను ఆదుకోలేవనే విషయాన్ని ఉదాహరణలతో చెప్పి ప్రజలను చైతన్యపరుస్తున్నాం. వాటిని నమ్మి మరోసారి మోసపోవద్దని చెబుతున్నాం.

ఇక్కడా యూపీ తరహా పాలన అంటున్నారు ?

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఎంఐఎం వంతపాడుతూ వస్తోంది. పాతబస్తీలో మజ్లిస్ దౌర్జన్యమే నడుస్తోంది. కరెంట్ బిల్లు, ఇంటి పన్నులు వసూలు చేయలేకపోతున్నారు. 90 శాతం ఇళ్లు మున్సిపల్ అనుమతులు లేకుండానే కడతారు. అందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ అండగా నిలవడమే కారణం. యూపీలో యోగి ఆదిత్యనాథ్ పాలనలో బుల్డోజర్ ప్రభుత్వంతో ఆ రాష్ట్ర ముఖచిత్రమే మారిపోయింది. తెలంగాణలోనూ అలాంటి బుల్డోజర్ ప్రభుత్వం తెస్తాం. మాఫియాపై, అవినీతి, అక్రమాలపై ఉక్కుపాదం మోపుతాం. మజ్లిస్ పార్టీ కాదు వారి జేజమ్మలు వచ్చినా ఏమీ చేయలేరు. అక్రమాలు, దాడులకు, నేరాలకు పాల్పడే మజ్లిస్ నేతలు ఉండాల్సింది పాతబస్తీలో కాదు చంచల్‌గూడ, చర్లపల్లి జైళ్లల్లో.. .. ఇప్పుడు ఎక్కడ ఉన్నారు ? ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ పక్కన కూర్చుని చర్చలు జరుపుతున్నారు.

ఎన్నికల బరిలో వారసులు

రాజకీయాల్లోకి రెండోతరం

భాషబోయిన అనిల్‌కుమార్

రాజకీయాల్లో వారసత్వమేమీ కొత్త విషయం కాదు. కొందరు వారసులు తమవంతు కోసం ఎదురుచూసి రాజకీయాల్లోకి వస్తే.. మరికొందరు ఇష్టం లేకపోయినా.. అనివార్యంగా రావాల్సి వస్తుంది. వారసులను రంగంలోకి దించేందుకు అనేక కారణాలు ఉంటాయి. రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించిన తల్లీ/తండ్రీ/మామ/బంధువులు ఎవరైనా ఆకస్మికంగా మరణించినా లేక అనారోగ్య సమస్యలు తలెత్తినా.. వారి వారసులు తెరమీదకు రావాల్సి ఉంటుంది. కానీ, ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేస్తోన్న వారసుల్లో అన్ని రకాల కారణాలతో వచ్చిన వారు ఉన్నారు. వారి వివరాలు ఒకసారి పరిశీలిద్దాం!

వెన్నెల

ప్రజాయుద్ధనౌకగా పేరొందిన సామాజిక ఉద్యమకారుడు గద్దర్ కుమార్తె వెన్నెల ఈ ఎన్నికల్లో కంటోన్మెంట్ నుంచి పోటీ చేస్తున్నారు. పాట ద్వారా సామాజిక స్పృహ పెంచి హక్కుల సాధన కోసం జీవితాంతం పోరాటం చేసిన శక్తిగా గద్దర్ ఎంతో గుర్తింపు పొందారు. ఇప్పుడు ఆయన కుమార్తె వెన్నెల కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్నారు. ఎంబీఏ, పీహెచ్‌డీ పూర్తి చేసిన ఈమెకు గద్దర్ పోరాటాలు వెంటనిలుస్తాయని ఆమె అనుచరులు ధీమాగా ఉన్నారు.

లాస్య నందిత

కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి. సాయన్న ఆకస్మిక మరణంతో ఆయన కుమార్తె లాస్య నందిత రాజకీయ అరంగేట్రం చేశారు. నగరంలోని సీనియర్ ఎమ్మెల్యేలలో ఒకరైన సాయన్నకు మంచి కేడర్ ఉంది. ఆ కేడర్‌ను కాపాడుకునేందుకు, తిరిగి బీఆర్ఎస్ విజయపతాక ఎగరేసేందుకు గులాబీ బాస్ కేసీఆర్ సాయన్న కూతురుకు టికెట్ ఇచ్చారు. ఈమె గతంలో జీహెచ్ఎంసీ కార్పొరేటర్‌గా గెలుపొందారు.



డాక్టర్ సంజయ్

కల్వకుంట్ల విద్యాసాగరరావు నాలుగుసార్లు కోరుట్ల నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. వయోభారం వల్ల ఆయన తప్పుకుని ఈసారి కుమారుడు సంజయ్‌కి అవకాశం కల్పించారు. ఆమరణ దీక్ష సమయంలో కేసీఆర్ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించిన డాక్టర్‌గా మంచి అనుబంధం ఉంది. దీనికితోడు తండ్రి వయోభారంతో రాజకీయ వారసత్వాన్ని అంగీకరించి తొలిసారి బరిలో నిలిచారు. ఈయన కేటీఆర్‌కు బంధువు, క్లాస్‌మేట్ కావడం గమనార్హం.

కుందూరు జయవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్ అసెంబ్లీ నుంచి మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి కుమారుడు జయవీర్ రెడ్డి బరిలో నిలుస్తున్నారు. ఘనమైన రాజకీయ నేపథ్యం, తండ్రికి ఉన్న బలమైన అనుచరబలం, అర్థబలం ఇతని వెంటరావడం కలిసి వచ్చే విషయాలు. 2008లోనే అమెరికాలో మాస్టర్స్ పూర్తి చేసిన జయవీర్.. తండ్రి తరహాలోనే కాంగ్రెస్ నుంచే తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

విజయారెడ్డి

మాజీ మంత్రి దివంగత పి.జనార్దన్‌రెడ్డి కుమార్తె విజయారెడ్డి. ఈమె ప్రస్తుతం ఖైరతాబాద్ నుంచి పోటీ చేస్తున్నారు. ప్రస్తుతం కార్పొరేటర్‌గా ఉన్న ఈమెకు తన తండ్రికి నగరంలో ఉన్న జనాదరణ కారణంగానే కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చింది. నగరంలో అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడిగా పేరొందిన పీజేఆర్ చేసిన పనులు తన విజయానికి సోపానాలు అవుతాయని ధీమాగా ఉంది.

మిథున్‌రెడ్డి

మహబూబ్‌నగర్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి ఏపీ మిథున్ రెడ్డి బరిలో ఉన్నారు. తన తండ్రి మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి రాజకీయ వారసత్వంగా రాజకీయాల్లోకి వస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో వ్యాపార, పారిశ్రామిక వర్గాల్లో మంచి పేరు ఉంది. వారసత్వం, తండ్రి కేడర్ ఈయనకు కలిసి వస్తాయని అంచనా వేస్తున్నారు.

కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి తనయునిగా రాజేశ్ రెడ్డి రాజకీయ అరంగేట్రం చేశారు. దంత వైద్యుడైన ఆయన తెలంగాణ డెంటిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నారు.

మైనంపల్లి రోహిత్

ఎమ్మెల్యే హనుమంతరావు కుమారుడు రోహిత్ మెదక్ నుంచి పోటీ చేస్తున్నారు. తన కుమారుడు టికెట్ కోసం అధికార పార్టీతో విభేదించిన మైనంపల్లి వెంటనే కాంగ్రెస్‌లో చేరారు. అనుకున్నట్లుగానే తనకు మల్కాజిగిరి, తన కుమారుడికి మెదక్ టికెట్ తెచ్చుకున్న సంగతి తెలిసిందే.

మంచి రోజని...

నామినేషన్ల పర్వం చివరి అంకానికి చేరుకుంది. గురువారం మంచిరోజు కావడంతో భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలు అయ్యాయి. సిరిసిల్ల, సిద్దిపేటలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, మధిరలో సీనియర్ కాంగ్రెస్ నేత మల్లు భట్టి విక్రమార్క నామినేషన్ వేశారు.



సిద్దిపేటలో బీఆర్ఎస్ అభ్యర్థి హరీశ్‌రావు



మధిరలో ఆర్ఓకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టివిక్రమార్క



సిరిసిల్లలో ఆర్ఓకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కేటీఆర్



అంబులెన్స్‌లో వచ్చి..

దుబ్బాకటౌన్: కత్తిపోటుకు గురై తీవ్రగాయాలతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి గురువారం అంబులెన్స్‌లో వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. అంబులెన్స్‌లో నేరుగా ఐఓసీ కార్యాలయానికి చేరుకున్న ప్రభాకర్‌రెడ్డిని వీల్‌చైర్‌లో ఆర్‌ఓ కార్యాలయంలోకి తీసుకెళ్లారు. అప్పటికే సిద్ధం చేసి ఉంచిన నామినేషన్ పత్రాలను మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి తనయుడు సోలిపేట సతీశ్‌రెడ్డితో కలిసి రిటర్నింగ్ అధికారి, జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్‌కు అందించారు.

ఇందూరుకు ఇవి కావాలి

పీపుల్స్ మేనిఫెస్టో
నిజామాబాద్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఉత్తర తెలంగాణలో కీలకమైన నిజామాబాద్ నగరంలో 4,70,152 మంది జనాభా ఉన్నారు. ఇందులో 2,86,766 మంది ఓటర్లు ఉన్నారు. నగరం వేగంగా విస్తరిస్తున్నా ఆ మేరకు సౌకర్యాల కల్పన మాత్రం జరగడం లేదన్న వాదనలున్నాయి. ఇక్కడ దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న భూగర్భ డ్రైనేజీ, ముంపు సమస్యల పరిష్కారంతో పాటు ప్రజల డిమాండ్లు ఇలా ఉన్నాయి.

బస్తీ దవాఖానాల సేవలు అంతంతే..

నిజామాబాద్‌లో బస్తీ దవాఖానాలు సేవలు నామమాత్రమే. నగరంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఉన్నప్పటికీ సేవలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. సేవలను మెరుగుపరచాలి.

భూగర్భ డ్రైనేజీ పనులకు మోక్షం ఎప్పుడు

నగరంలో భూగర్భ డ్రైనేజీ పనులు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు మొదలుపెట్టారు. ఇటీవల పనులు పూర్తయినా, మురుగునీరు ఇళ్ల నుంచి వెళ్లడానికి కనెక్షన్లు ఇవ్వలేదు. నగరం విస్తరించిన నేపథ్యంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీని ఇతర ప్రాంతాలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

'నుడా' పరిధిలో డ్రైపోర్టు ఏర్పాటు చేయాలి

నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) పరిధిలోని డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ వద్ద లేదా జానకంపేట రైల్వేస్టేషన్ వద్ద 50 ఎకరాల్లో డ్రైపోర్టు ఏర్పాటు చేసేందుకు కంటెయినర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంసిద్ధత వ్యక్తం చేసింది. డ్రైపోర్టు ఏర్పాటైతే ఇక్కడి నుంచి వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా ఎగుమతి చేయవచ్చని, తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో ఎకానమీ సైతం పెరుగుతుందంటున్నారు.

ముంపు సమస్య నివారించాలి

నగరం మధ్యలో ప్రవహిస్తున్న పులాంగ్ వాగు ఆక్రమణల కారణంగా ముంపు సమస్య ఉత్పన్నమవుతోంది. రామర్తి చెరువు 70 శాతం ఆక్రమణకు గురైంది. దీంతో బోధన్ రోడ్డుకు ఇరువైపులా వర్షాకాలంలో ముంపు తప్పడం లేదు. న్యాల్‌కల్ రోడ్డులోని రోటరీనగర్ ముంపునకు గురవుతోంది. నగరం విస్తరించిన నేపథ్యంలో భూగర్భ డ్రైనేజీ విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు. ముంపు నివారణకు శాశ్వత పరిష్కారం కోరుతున్నారు.

అంతర్గత రోడ్లు అధ్వానం..

కార్పొరేషన్ పరిధిలో ప్రధాన రోడ్లు మాత్రమే బాగున్నాయి. అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఈ రోడ్లను నిర్మించాలన్న డిమాండ్లున్నాయి.

ఒక్క సర్కారీ ఇంజనీరింగ్ కళాశాల కూడా లేదు

నగరంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల లేదు. ఇక నగరానికి సమీపంలో తెలంగాణ వర్సిటీ ఉన్నా, దీని పరిధిలోనూ ఇంజనీరింగ్ కళాశాల లేదు. తెలంగాణ వర్సిటీలో కోర్సులు పెంచాలన్న డిమాండ్లు ఉన్నాయి.

గాసిప్ టైమ్: మీటింగ్ అంటే మాటలా?

రోజువారీ ఖర్చులు ఎక్కువవుతున్న రోజులివి. ఆపై ఎన్నికల సమయం అంటే డబ్బు మంచినీళ్ల ప్రాయంలా ఖర్చవుతుంది. ఇక ఎన్నికలవేళ ప్రచార సభలంటే మాటలా.. ఒక సభకే కోట్ల రూపాయలు ఖర్చవుతుంటే ఒక నియోజకవర్గంలో రెండుసార్లు బహిరంగసభలు నిర్వహించాలంటే కనీసం రూ.రెండు కోట్లు అవసరమనేది బహిరంగ రహస్యం. అసెంబ్లీ నియోజకవర్గంలోని గ్రామాల సంఖ్య ఆధారంగా ఈ ఖర్చు పెరుగుతుందట. ఇక మెతుకు జిల్లాలోని ఓ ప్రముఖ నేతపై పోటీ పడుతున్న ఓ జాతీయ పార్టీ నాయకుడు పార్టీకి ఊపు తేవాలని తను నామినేషన్ వేసేరోజు రాష్ట్ర అగ్రనేతను పిలవాలనుకున్నాడట. తీరా ఆయన కోసం వెళ్లి అడిగితే నామినేషన్ వేసే సమయానికి ఆ అగ్రనేత షెడ్యూల్ ఖాళీ లేదట. ఏమి చేయాలో పాలుపోక వెంటనే తన శ్రేయోభిలాషికి ఫోన్ చేశాడు. నామినేషన్ వేసేటప్పుడే..రాష్ట్ర అగ్రనేత వస్తారని ప్రచారం చేద్దాం ...తీరా సమయం వచ్చేసరికి అనివార్య కారణాల వల్ల ఆ నాయకుడు రాలేదంటూ ఓ బీసీ నాయకుడిని పిలుచుకుని వచ్చి పనికానిచ్చేద్దాం అంటూ సలహా ఇచ్చాడు. ఇప్పటికే పార్టీ డౌన్‌లో ఉంది. నామినేషన్ రోజు హడావుడి చేయకపోతే మరింత వెనుకబడిపోతామని తెగబాధపడిపోతున్నాడు. నామినేషన్ వేసే రోజు హంగామా లేకపోతే ఆ తర్వాత ఎంత చేసినా వృథానే అంటూ గొణుగుతున్నాడు. ఎలాగూ ఆ స్థానంలో సదరు ఎమ్మెల్యే గెలిచే అవకాశం లేకపోయినా...ఆయన హడావుడి చూసి అక్కడున్న నేతలు ముక్కున వేలేసుకుంటున్నారు. మీటింగా మజాకా!

జాతి కోసమే బతికిన నేతల ఆశయమేదీ?

ఆ వారసత్వం మసకబారడానికి కారణాలేంటి?

- నైతికత లోపిస్తున్న రాజకీయం...
- చట్టసభల్లో అసభ్య పద ప్రయోగం
- స్థాయి తగ్గిన నేతల అనుచిత వ్యాఖ్యలు
- బ్యూరోక్రసీ ఇంతగా దిగజారాలా?

ఎన్నికల తీరుపై సీనియర్ రాజకీయవేత్త డీకే సమరసింహారెడ్డి



Interview

వనం దుర్గా ప్రసాద్

దేశ స్వాతంత్ర్యోద్యమంలో ఉన్నత పదవులే కాదు, ఉన్నదంతా ధారపోసిన మహానుభావులున్నారు. ఈ పోరాట స్ఫూర్తిలోంచే విలువలతో కూడిన రాజకీయం ఆవిర్భవించింది. ప్రజాసేవే లక్ష్యంగా...పైసాకి కూడా వెతుక్కునే గొప్ప నాయకులను భారతావని అందించింది. ఇవన్నీ చెబితే ఈ తరం నమ్ముతుందా? అవేవో పుక్కిట పురాణాలు అనుకుంటారు ప్రజలు. నేటితరం రాజకీయాలు వ్యవస్థను అలా తయారు చేశాయంటారు సీనియర్ నేత డీకే సమరసింహారెడ్డి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల నుంచి తిరుగులేని నేతగా సుదీర్ఘ కాలం గెలిచిన శాసనసభ్యుడాయన. హోం, రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్ సహా కీలక మంత్రి పదవుల్లో సమర్థత నిరూపించుకున్న వ్యక్తి ఆయన. అసెంబ్లీ సమావేశాల ఉన్నతిలో ఆయన పాత్ర స్పష్టంగా కన్పిస్తుంది. రాష్ట్ర ఎన్నికల వేళ ఆయనను కలిసినప్పుడు ఎన్నో విషయాలు నెమరువేసుకున్నారు. అందులోంచి కొన్ని ఆయన మాటల్లోనే...

రాజకీయాల్లో దూషణలు..అసభ్య పదజాలం.?

ఒకరిపై ఒకరు దూషణలు.. అసభ్య పద ప్రయోగం ..అనుచిత వ్యాఖ్యలు... ఇవీ నేటి రాజకీయాల్లో కనిపించేవి..బాధేస్తుంది..జాలేస్తోంది. అరే.. విధానపరమైన విమర్శలు చేస్తే తప్పేంటి? దీన్ని నేతలు ఎందుకు స్వీకరించడం లేదు. ప్రతి విమర్శలు గాడి తప్పుతున్నాయి. సిద్ధాంతపరమైన విమర్శలే రాజకీయాల్లో ఉండాలి. కానీ వ్యక్తిగత విమర్శనావాదం వచ్చేసింది. ప్రజాస్వామ్యానికి ఇది మంచిది కాదు. నేతలు ధన రాజకీయాల వైపే వెళ్తున్నారు. తేలికగా డబ్బు సంపాదిస్తున్నారు. దాన్ని ఎన్నికల్లో ఖర్చు చేస్తున్నారు.

బ్యూరోక్రాట్స్ సాగిల పడటమేంటి?

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఐఏఎస్, ఐపీఎస్‌లది కీలక పాత్ర. వారు దీన్ని మరిచిపోయారేమో అన్పిస్తోంది. సుదీర్ఘ అనుభవంతో చెబుతున్నా. బ్యూరోక్రాట్స్ ఇంత సాగిల పడటం ఈ మధ్య కాలంలోనే చూస్తున్నాను. దశాబ్దకాలంగా ఇది మరింత దిగజారింది. బ్యూరోక్రాట్స్ సరిగ్గా పనిచేస్తే, రాజకీయ వ్యవస్థ ఇంత భ్రష్టుపడుతుందా? కట్టడి చేయగల సామర్థ్యం వాళ్లకు మాత్రమే ఉంది. నేతలు ఐదేళ్లే అధికారంలో ఉంటారు. అధికారులు సుదీర్ఘ కాలం సర్వీస్ చేస్తారు. ఇది తెలిసీ నాయకులకు ఎందుకు సాగిలపడుతున్నారు..? మా అప్పుడు ఇలా లేదు. మేం చెప్పే దాంట్లో తప్పుంటే అభ్యంతరం చెప్పేవారు. ఖర్మ కాకపోతే... ఓ ఐఏఎస్ అధికారి ఎమ్మెల్యే చెప్పినట్టు వినడమేంటి? అయితే ఈ మధ్య కాలంలో యువ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు నిక్కచ్చిగా ఉంటున్నారు. వాళ్లలో ఆశయం కన్పిస్తోంది. ఇది శుభ పరిణామమే.


సభా మర్యాద ముఖ్యం..

చట్టసభలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఎన్నికయ్యే ప్రతీ ఎమ్మెల్యే దాన్ని గుర్తించాలి. చట్టసభల విలువలు కాపాడే ప్రయత్నం చేయాలి. మేం అసెంబ్లీకి వెళ్తున్నామంటే దృష్టంతా దానిపైనే ఉండేది. మంత్రిగా సమాధానంచెప్పాల్సివస్తే..ముందే విద్యార్థిలా ప్రిపేర్ అయ్యేవారం, చాలామంది మంత్రులు అసెంబ్లీలో అధికారులపై ఆధారపడకుండానే సమాధానమిచ్చే వారు. తమ శాఖలపై అంత కమాండ్ ఉండేది. అసెంబ్లీ నియమాలు..ఏ అంశాన్ని ఏ రూల్ కింద లేవనెత్తాలి... వాకౌట్ ఎప్పుడు చేయాలి? ఇవన్నీ పార్లమెంటరీ నిబంధనలు చదివినప్పుడే తెలుస్తాయి. దీనికోసం ఎన్నో పుస్తకాలు చదివేవారం. అసెంబ్లీలో చిన్నమాట తప్పుగా మాట్లాడినా పెద్ద వివాదమయ్యేది. మాట్లాడేప్పుడు అది గుర్తుండేది. కానీ ఇప్పుడేంటి? దారుణమైన భాష మాట్లాడుతున్నారు. అసెంబ్లీలో ఏం మాట్లాడుతున్నారో ప్రజలు లైవ్‌లో చూస్తున్నారు. ఎమ్మెల్యేలు ముందుగా నైతిక విలువలు నేర్చుకోవాలి.

ఎవరెటో చెప్పలేని స్థితి

ఓ నాయకుడు ఫలానా పార్టీ అని చెప్పడం కష్టంగా ఉంది. ఎప్పుడు మారతాడో తెలియదు. ఎందుకు మారతాడో అసలే తెలియదు. వ్యక్తిగత అవసరాల కోసం పార్టీలు మారుతున్నారని అందరికీ తెలుసు. పైకి మాత్రం ప్రజాభీష్టమంటారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమంటారు. రాజకీయాలు ఇంత దిగజారుతాయని ఎప్పుడూ ఊహించలేదు. ఇదో దురదృష్టకర పరిణామమే. నేతల్లో విలువలు పెరగాలి. ఎన్నికల్లో పార్టీలిచ్చే హామీలు వినసొంపుగా ఉంటున్నాయి. కానీ వాటి అమలే ప్రశ్నార్థకంగా ఉంటున్నాయి. ఎవరు ఏమిచ్చినా..తిరిగి ఏదో రూపంలో ప్రజల నుంచే రాబడతారనేది అందరూ గుర్తించాలి. తెలంగాణ అభివృద్ధి చెందిందా అంటే... చెందిందనే చెబుతాను. కాకపోతే జరగాల్సిన అభివృద్ధి జరగలేదనేదే నా వాదన. గాడి తప్పిన వ్యవస్థను దారిలో పెట్టగలిగే సామర్థ్యం ప్రజలకే ఉంది. అది ప్రజాస్వామ్యం ప్రజలకిచ్చిన ఓటు హక్కు. ఇప్పటికైనా ప్రజలు రాజకీయ విలువలకు ప్రాధాన్యమిచ్చే నేతలనే గుర్తించి, చట్టసభలకు పంపాలి.

ఇడ్లీ పాత్ర.. దోసె పెనం.. కుతకుతలాడే అన్నం!



''మీ పార్టీలో అందరూ సీఎమ్ము క్యాండిడేట్లే. నామినేషన్ వేసే ప్రతివాడూ నేనూ సీఎమ్మంటూ స్టేట్‌మెంట్లు ఇస్తుంటారు. జనాలు నవ్వుకుంటుంటే మీకు సిగ్గేయడం లేదా?'' అంటూ బీఆర్ఎస్ నేతలూ, కార్యకర్తలందరూ విమర్శించసాగారు.

పై ప్రశ్నకు ఇలా బదులు చెప్పారు కాంగ్రెస్ నేతలు.

''తిండి అంటే అందరికీ ఇష్టం. కాబట్టి మీ ప్రశ్నకు వంట ఐటమ్స్‌తోనే జవాబు చెబుతాం వినండి. కాంగ్రెస్ అనేది ఇడ్లీ పాత్రలాంటిది. అందులో బోల్డన్ని ఇడ్లీప్లేట్లు ఉంటాయి. కింది నుంచి పైకి వేర్వేరు అంతస్తుల్లో అంచెలవారీగా కనిపిస్తుంటాయిగానీ..ఇడ్లీలన్నీ సమానంగా ఉడుకుతాయి. మా నాయకులూ అంతే. ఒకేసారి వాయి దిగే ఇడ్లీల్లాంటివారే. ఎందరో ఇడ్లీలు..అందరూ సీఎమ్ములే''

''మరి మా బీఆర్ఎస్ వాళ్లో?''

''బీఆర్ఎస్ సీఎంని దోసెపెనంతో పోల్చవచ్చు. ఇక్కడ దోసెపెనం ఎగ్జాంపుల్‌ను రెండు రకాలుగా చెప్పవచ్చు. మొదటిది..ఇంటి దోసెపెనం. ఈ ఎగ్జాంపుల్‌ను తీసుకుంటే ఇక్కడ ఒకేఒక్క దోసెకు అవకాశముంటుంది. అది మీ పార్టీ అధినేత. అంటే... ఆయనొక్కడే సీఎం అన్నమాట. ఇక.. 'ఏ హోటల్లోనో లేదా టిఫిన్ సెంటర్‌లోనో ఒకేసారి నాలుగు దోసెలేసే వెడల్పాటి పెనాలుంటాయి కదా' అని మీరడగొచ్చు. అక్కడికే వస్తున్నాం. టిఫిన్‌సెంటర్లోలాంటి ఆ పెనమ్మీద ఒకేసారి వేయగలిగే నాలుగు దోసెల్లాంటి బీఆర్ఎస్‌లోని ఇంపార్టెంట్ నేతలెవరో మీకు వేరే చెప్పక్కర్లేదనకుంటా!''

''మరి కమ్యూనిస్టులో?''

''ఒకప్పుడు వాళ్లు కూడా అన్నోఇన్నో సీట్లు గెలిచి పచ్చడిజాడీల్లా ఉండేవారు. ఇక్కడ పచ్చడి జాడీ అని ఎందుకంటున్నామంటే... అది మామిడికాయ పచ్చడైనా, పండుమిరపకాయ కొరివికారమైనా..ఇలా దాదాపు పచ్చళ్లేవైనా..' ఎర్రటి ఎరుపురంగులో మిలమిలలాడుతూ కమ్యూనిస్టు కళతో కళకళల్లాడేవి. కానీ ఇప్పుడో? ఇటు పొత్తులపరంగా చూసినా..లేదా అటు గెలుపుపరంగా చూసినా వాళ్లకు దెబ్బ మీద దెబ్బ పడుతోంది.

షుగర్ & పెప్పర్

..:: యాసీన్

కాబట్టి..ప్రస్తుతానికి వాళ్లను దంపుడుకారం మిల్లులోని గుంటల్లో మిరపకాయలనుకోవచ్చు. ఎర్రటి ఎండు మిరపల్ని అందులో వేయగానే..రోకళ్లు రెండూ ఒకదాని తర్వాత మరొకటి ఆల్టర్నేట్‌గా దెబ్బేస్తుంటాయి. ఆ రోకళ్లు మరెవరో కాదు.. మొదట బీఆర్ ఎస్, తర్వాత కాంగ్రెస్! దాంతో పాపం..ఆ ఎండు మిరపలన్నీ పొడి పొడి అయిపోయి, కారంగా మా రి, ఘాటెక్కి, మంటెక్కి భగభగలాడుతున్నారు''

''సరే... మరి పువ్వు పార్టీ వాళ్లో?''

''వాళ్లు కాషాయం పార్టీ వాళ్లు కదా..అందుకే కషాయం అనుకోవచ్చు. అది ఆరోగ్యానికి మంచిదంటారు కదా. అచ్చం అలాగే కాషాయం దేశానికి మంచిదని వాళ్లు అనుకుంటుంటారు''

''సరే మరి ఓటర్లో?''


''ఓటర్లనేవాళ్లు బియ్యపుగింజల్లా బోలెడంత మంది ఉంటారు. వ్యవహారికంలో కష్టాలొచ్చినప్పుడు 'ఎసరొచ్చింది' అనే నానుడి వాడుతుంటాం కదా. అలా ఎప్పుడూ వాళ్లకే ఎసరొస్తూ ఉంటుంది. ఎసరు మరగ్గానే పోసిన బియ్యపు గింజల్లా..పాపం వాళ్లెప్పుడూ కుతకుతలాడిపోతూ, ఉడికిపోతూ ఉంటారు. కానీ..ఎన్ని వంటకాలున్నా, ఎన్ని కూరలున్నా, ఎన్ని పచ్చళ్లున్నా అన్నమే మెయిన్ కదా. అలా చూస్తే..ఓటర్లు అన్నం లాంటి వాళ్లన్నమాట. కాకపోతే ఎలక్షన్ టైములో అప్పుడే ఉడికిన వేడివేడి అన్నంలాంటి వాళ్లు. ఇక ఎన్నికలై ఏడాదిగానీ గడిచిందా.. పాశిపోయి పారేయాల్సిన సద్దిబువ్వల్లాంటివాళ్లవుతారు. ప్చ్..పాపం. ఇలా ఏరకంగా చూసినా వాళ్లు...

'అన్నమో రామచంద్రా' అంటూ ఆల్వేస్ మొత్తుకుంటూ ఉండే అన్నం మెతుకులన్నమాట.''

చాంద్రాయణగుట్టకు 45 ఏళ్లుగా ఇద్దరే..

సాక్షి, హైదరాబాద్: అక్కడ ఇప్పటివరకు ఇద్దరంటే ఇద్దరే ఎమ్మెల్యేలుగా గెలిచారు.. అలా అని అదేం కొత్తగా ఏర్పడిన నియోజకవర్గమేమీ కాదు.. ఏకంగా పదిసార్లు ఎన్నికలు జరిగాయి. ఒక్కొక్కరు వరుసగా అయిదుసార్లు గెలిచి రికార్డు సృష్టించారు. అదెక్కడో కాదు..పాతబస్తీలోని చాంద్రాయణగుట్టలో. ఒకరేమో అమానుల్లాఖాన్ కాగా మరొకరు అక్బరుద్దీన్ ఒవైసీ.

అమానుల్లాఖాన్ ప్రస్థానం ఇలా



- 1978 ఎన్నికలకు ముందు చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఏర్పడింది. ఆ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన అమానుల్లాఖాన్ కాంగ్రెస్ అభ్యర్థి బాలయ్యపై 1,333 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- 1983లో ఎ.నరేంద్ర(బీజేపీ)పై 3,581 ఓట్లతో, 1985లో 3,009 ఓట్ల మెజారిటీతో గెలిచారు.
- 1989 ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ తరఫున బరిలోకి దిగి టీడీపీ అభ్యర్థిపై 28,147 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.
- 1994 ఎన్నికల నాటికి సలావుద్దీన్ ఒవైసీతో విభేదించి మజ్లిస్‌కు పోటీగా అమానుల్లాఖాన్ ఎంబీటీ పార్టీని స్థాపించారు. ఆ ఎన్నికల్లో ఎంబీటీ తరఫున పోటీచేసి ఎంఐఎం అభ్యర్థిపై 35,210 ఓట్లతో గెలిచారు.

అక్బరుద్దీన్ ఒవైసీ ఎంట్రీతో...



- అమానుల్లాఖాన్ వరుస విజయాలకు అడ్డుకట్ట వేసేలా సలావుద్దీన్ ఒవైసీ తన చిన్న కుమారుడు అక్బరుద్దీన్ ఒవైసీని 1999 ఎన్నికల్లో పోటీకి దింపారు. ఆ ఎన్నికల్లో 11,920 ఓట్ల మెజారిటీతో అక్బరుద్దీన్ ఒవైసీ విజయం సాధించారు.
- 2004 ఎన్నికల్లో 11,949 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఆ తర్వాత 2009 ఎన్నికల్లో 15,177 ఓట్లతో, 2014లో 59,279 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మోగించారు. 2018 ఎన్నికల్లో అక్బరుద్దీన్ ఒవైసీ భాజపా అభ్యర్థి షెహెజాదీ సయ్యద్‌పై 80,264 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. వరుసగా అయిదు సార్లు గెలిచి అమానుల్లాఖాన్ రికార్డును సమం చేశారు. ఈ ఎన్నికల్లో కూడా అక్బర్ చాంద్రాయణగుట్ట నుంచే పోటీ చేస్తున్నారు.

జంగ్ తెలంగాణ పంచతంత్రం



ఛత్తీస్‌గఢ్‌లో మంత్రి కారుపై రాళ్ల దాడి

బెమెతరా: ఎన్నికల ప్రచారహోరులో మునిగిపోయిన ఛత్తీస్‌గఢ్‌లో మంత్రి వాహనశ్రేణిపై గుర్తుతెలియని వ్యక్తులు రాళ్ల దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో మంత్రి గురు రుద్ర కుమార్ త్రుటిలో తప్పించుకున్నారు. మరో వాహనం స్వల్పంగా ధ్వంసమైంది. ఈ వాహనంలో ఉన్న భద్రతా సిబ్బందికి చిన్నపాటి గాయాలయ్యాయి. వారికి దగ్గర్లోని ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్సచేశారు. బుధవారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నవాగఢ్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేస్తున్న రుద్రకుమార్ బెమెతరా జిల్లాలో గురువారం సాయంత్రం ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారం ముగిశాక మంత్రి తిరుగుపయనమైన సందర్భంగా నవాగఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఝూల్ గ్రామం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లదాడికి పాల్పడ్డారని జిల్లా మహిళా ఎస్పీ భావనా గుప్తా చెప్పారు. నవాగఢ్ సిట్టింగ్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత అయిన దయాళ్‌దాస్ బఘేల్‌కు ఈసారి పార్టీ టికెట్ నిరాకరించింది. అహివారా ఎమ్మెల్యే అయిన రుద్రకుమార్‌ను ఈసారి నవాగఢ్ నుంచి పార్టీ బరిలో దింపింది. దీంతో దయాళ్‌దాస్ మద్దతుదారులే ఈ దాడి చేసి ఉంటారనే అనుమానాలు వినపిస్తున్నాయి.



ఐదేళ్లలో నక్సలిజం అంతం చేస్తాం


ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హామీ



జాష్‌పూర్: ఛత్తీస్‌గఢ్ శాసనసభ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో నక్సలిజాన్ని అంతం చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. ఆయన గురువారం జాష్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. భూపేష్ బఘేల్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఛత్తీస్‌గఢ్‌లో గత ఐదేళ్లలో మత మార్పిడులు విచ్చలవిడిగా జరిగాయని ఆరోపించారు. గిరిజనులను బలవంతంగా మరో మతంలోకి మార్చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అవినీతి పెచ్చరిల్లిందని మండిపడ్డారు. రూ.వేల కోట్ల కుంభకోణాలు చోటుచేసుకున్నాయని చెప్పారు. మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో కాంగ్రెస్ ప్రభుత్వం కూరుకుపోయిందని అన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే అవినీతిపరులను జైలుకు పంపిస్తామని అమిత్ షా స్పష్టం చేశారు. బలవంతపు మతమార్పిడుల నుంచి గిరిజనులను కాపాడుతామని వెల్లడించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారును అధికారంలోకి తీసుకురావాలని ఓటర్లకు పిలుపునిచ్చారు.

- మధ్యప్రదేశ్‌లో క్రిమినల్ కేసులున్న అభ్యర్థులకు పార్టీల పట్టం
- పోటీలో నిలిచిన 472 మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు
- 200 మంది బీజేపీ, 196 మంది కాంగ్రెస్ అభ్యర్థులు కోటీశ్వరులు
- ఒక్క రూపాయి కూడా ఆస్తి లేదని ప్రకటించిన 12 మంది అభ్యర్థులు
- ఏడీఆర్ నివేదిక వెల్లడి

'నేర'గాళ్లను నెత్తినెట్టుకుంటున్నాయి!



సాక్షి, న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థులపై క్రిమినల్ కేసులున్నప్పటికీ రాజకీయ పార్టీలు 'డోంట్ కేర్' అనే విధంగా వ్యవహరిస్తున్నాయి. ఏరికోరి నేరచరితులకే పార్టీ టికెట్‌ను ఇస్తూ వారినే గెలుపు గుర్రాలుగా రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో 472 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) సంస్థ తన తాజా నివేదికలో వెల్లడించింది. గురువారం విడుదల చేసిన ఈ నివేదికలో మధ్యప్రదేశ్‌లో బరిలో నిలిచిన అభ్యర్థుల ఆస్తిపాస్తులు, నేర చరిత్ర తదితరాలను పొందుపరిచింది. అందులోని వివరాలను పరిశీలిస్తే..

కొన్ని పార్టీల నుంచి 53 శాతం మంది నేరచరితులే

మొత్తం అభ్యర్థులు 2,534లో 19 శాతం మందిపై అంటే 471 మందిపై క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. గతంలోనూ ఇదే సంఖ్యలో అభ్యర్థులు టికెట్ పొంది ఎన్నికల బరిలో నిలిచారు. ఈసారీ రాజకీయ పార్టీలు తమ పంథాను మార్చుకోకపోవడం విచారకరం. కొన్ని పార్టీల అభ్యర్థుల్లో 12 శాతం మందిపై క్రిమినల్ కేసులుంటే ఇంకొన్ని పార్టీల అభ్యర్థుల్లో ఏకంగా 53 శాతం మంది నేరచరితులే. అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ నుంచి 121 మంది, బీజేపీ నుంచి 65 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తమ అఫిడవిట్లలో ప్రకటించినట్లు ఏడీఆర్, మధ్యప్రదేశ్ ఎలక్షన్ వాచ్ సంస్థలు వెల్లడించాయి. ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి 26 మంది, బహుజన్ సమాజ్‌పార్టీ(బీఎస్పీ) నుంచి 22 మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. 230 అసెంబ్లీ నియోజకవర్గాలున్న మధ్యప్రదేశ్‌లో ఈ నెల 17వ తేదీన జరగబోయే పోలింగ్‌లో మొత్తం 2,534 మంది అభ్యర్థులు తమ భవితవ్యాన్ని పరీక్షించుకోనున్నారు.

రెడ్ అలర్ట్ నియోజకవర్గాలు 79

711 మంది జాతీయ పార్టీల నుంచి, 103 మంది రాష్ట్ర పార్టీల నుంచి, 553 మంది రిజిస్టర్డ్ గుర్తింపు లేని పార్టీల నుంచి, 1167 మంది అభ్యర్థులు స్వతంత్రంగా పోటీ చేస్తున్నారు. 471 మందిపై సాధారణ క్రిమినల్ కేసులు ఉండగా 291 (11 శాతం) మంది తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. పార్టీల వారీగా పరిశీలిస్తే క్రిమినల్ కేసులు ఉన్న అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీలో 121 (53 శాతం) మంది, బీజేపీలో 65 (28 శాతం) మంది, ఆమ్ ఆద్మీ పార్టీలో 26 (39 శాతం) మంది, బీఎస్పీలో 22 (12 శాతం) మంది ఉన్నారు. మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నట్లు 24 మంది అభ్యర్థులు, హత్యకు సంబంధించిన కేసులు ఉన్నట్లు 10 మంది తమ అఫిడవిట్లలో పేర్కొన్నారు. ఇక 230 నియోజకవర్గాల్లో 79(34%) రెడ్ అలర్ట్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఏదైనా నియోజకవర్గంలో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది నేరచరితులు బరిలో నిలిస్తే ఆ నియోజకవర్గాన్ని 'రెడ్ అలర్ట్' స్థానం అంటారు. ఇలాంటి నియోజకవర్గాలు 2018 ఏడాది ఎన్నికల్లో 76 (33 శాతం) ఉండటం చూస్తే 'నేర'గాళ్లు ఎంతగా ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములయ్యారో ఇట్టే తెలిసిపోతుంది.

బీజేపీ, కాంగ్రెస్‌లో కోటీశ్వరుల హవా

మొత్తం 2,534 మంది అభ్యర్థులలో 727 మంది అంటే 29 శాతం మంది అభ్యర్థులు కోట్లకు పడగలెత్తారు. ప్రధాన పార్టీల్లో వీరి సంఖ్య ఎక్కువగా ఉంది. బీజేపీ నుంచి 230 మంది పోటీచేస్తుంటే అందులో 87 శాతం మంది అంటే 200 మంది కోటీశ్వరులే. కాంగ్రెస్‌లో 85 శాతం(196) మంది, ఆమ్ ఆద్మీ పార్టీలో 59 శాతం(66) మంది, బహుజన్ సమాజ్ పార్టీలో 30 శాతం(54) మంది అభ్యర్థులు రూ.1 కోటి కంటే ఎక్కువ ఆస్తులకు అధిపతులు. రత్లామ్ నగర నియోజకవర్గం నుంచి బరిలో నిలిచిన బీజేపీ అభ్యర్థి చేతన్య కశ్యప్ తనకు రూ.296 కోట్లకుపైగా ఆస్తులున్నట్లు ప్రకటించి ఈ జాబితాలో టాప్‌లో నిలిచారు. రూ.242 కోట్లకు పైగా ఆస్తులతో విజయ రాఘవగఢ్ నుంచి బీజేపీ అభ్యర్థి సంజయ్ సత్యేంద్ర పాఠక్, రూ.217 కోట్లతో ఇండోర్-1 కాంగ్రెస్ అభ్యర్థి సంజయ్ శుక్లా ఆ తర్వాత స్థానాల్లో నిలబడ్డారు. బరిలో నిలిచిన అభ్యర్థుల్లో 12 మంది తమకు కనీసం ఒక్క రూపాయి కూడా ఆస్తి లేదని ప్రకటించడం గమనార్హం. రుణాలు, అప్పుల్లో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థులే ముందు వరసలో నిల్చున్నారు. అందరికంటే ఎక్కువగా రూ.86 కోట్లకుపైగా అప్పులున్నట్లు బేతుల్ కాంగ్రెస్ అభ్యర్థి నిలయ్ వినోద్ డాగా ప్రకటించారు.

952 మంది యువ అభ్యర్థులే

విద్యార్హత విషయానికొస్తే మొత్తం అభ్యర్థుల్లో 5-12వ తరగతి చదువుకున్న అభ్యర్థులు 49 శాతం మంది ఉన్నారు. డిగ్రీ, అంతకంటే ఎక్కువ చదివిన వారు 44 శాతం మంది ఉన్నారు. 28 మంది అభ్యర్థులు నిరక్షరాస్యులు. ఆరుగురు అభ్యర్థులు తమ విద్యార్హతలను అఫిడవిట్లలో పేర్కొనలేదు. మొత్తం అభ్యర్థుల్లో 25-40 ఏళ్ల వయసువారు 38 శాతం మంది ఉన్నారు. 41-60 ఏళ్ల వయసు వారు 49 శాతం మంది ఉన్నారు. 61-80 ఏళ్ల వయసు వారు 13 శాతం మంది ఉన్నారు. ఇద్దరి వయసు 80 సంవత్సరాలపైమాటే. మొత్తం అభ్యర్థుల్లో 10 శాతం అంటే 253 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. 2018 ఎన్నికల్లో మొత్తం అభ్యర్థుల్లో కేవలం 9 శాతం మందే మహిళా అభ్యర్థులు ఉన్నారు.

భార్యాభర్తల నుంచి బావామరదళ్ల దాకా...

బరిలో బంధువులు

రాజస్తాన్‌లో ఆసక్తి రేపుతున్న పోటీలు

ఒకచోట భార్యాభర్తలు. మరోచోట బావా మరదళ్లు. ఇంకొన్ని స్థానాల్లో బాబాయ్-అబ్బాయ్-అమ్మాయ్. మరో దగ్గరేమో తండ్రీకూతుళ్లు. రాజస్తాన్‌లో అసెంబ్లీ ఎన్నికల పోరు ఇలాంటి ఆసక్తికర సన్నివేశాలకు వేదికవుతోంది. పలు స్థానాల్లో బంధువుల మధ్య జరుగుతున్న ఈ పోటీలు రసవత్తరంగా మారుతున్నాయి...!

రక్త సంబంధీకులు, దగ్గరి బంధువుల పరస్పర పోట్లాటలు రాజస్తాన్‌లో అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. ఇటువంటి స్థానాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు ఎంతో ఆసక్తి కలిగిస్తున్నాయి.

దాంతారాంగఢ్: భార్యాభర్తల పోరు



ఈ స్థానం రాష్ట్రవ్యాప్త ఆసక్తికి కారణమైంది. ఇక్కడ కాంగ్రెస్ తరఫున వీరేంద్ర సింగ్ బరిలో ఉన్నారు. ఆయనపై ఏకంగా భార్య రీటా పోటీ చేస్తున్నారు. జన్ నాయక్ జనతా పార్టీ తరఫున ఆమె బరిలో ఉన్నారు. వీరేంద్ర తండ్రి నారాయణ్ సింగ్ కాంగ్రెస్ అగ్రనేత కావడం విశేషం. 2018లో ఆయన రాజకీయాల నుంచి తప్పుకున్నారు. కుమారుడికి టికెట్ ఇప్పించి గెలిపించుకున్నారు. అయితే వీరేంద్రకు కొంతకాలంగా భార్యతో గొడవలు ముదురుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏడాదిగా వారు విడిగా ఉంటున్నారు. ఎన్నికలు సమీపించగానే రీటా ఏకంగా భర్తపైనే బరిలో దిగారు!

ధోల్‌పూర్: గోదాలో బావామరదళ్లు

ఇక్కడ బీజేపీ తరఫున శివచరణ్ కుష్వాహా పోటీ చేస్తున్నారు. అయితే కాంగ్రెస్ ఏకంగా ఆయన మరదలు శోభారాణికి టికెటిచ్చి బరిలో దించింది.

అళ్వార్ (గ్రామీణ): తండ్రీ కూతుళ్ల సవాల్

ఇక్కడ బీజేపీ జయరామ్ జాటవ్‌కు టికెటిచ్చింది. ఆయనతో విభేదాల నేపథ్యంలో కుమార్తె మీనాకుమారి ఏకంగా ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగి తండ్రినే సవాలు చేస్తున్నారు! ఇద్దరు పరస్పరం జోరుగా విమర్శల వర్షం కురిపించుకుంటూ ఓటర్లకు యథాశక్తి వినోదం పంచుతున్నారు.

నా కుమారుడికి ఓటు వేయొద్దు!

ఖండార్ అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ తరఫున అశోక్ బైర్వా బరిలో ఉన్నారు. తండ్రి డాల్‌చంద్‌తో ఆయనకు చాలాకాలంగా వివాదాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'నా కొడుక్కు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటేయకండి' అంటూ డాల్‌చంద్ జోరుగా ప్రచారం చేస్తుండటం విశేషం. దాంతో ఏమీ చేయలేక అశోక్ తలపట్టుకుంటున్నారు.

బాబాయ్-అబ్బాయ్-అమ్మాయ్

భాద్రా అసెంబ్లీ స్థానంలో బీజేపీ నుంచి సంజీవ్ బెనీవాల్ పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ తరఫున ఆయన అన్న కుమారుడు అజిత్ బెనీవాల్ బరిలో దిగి బాబాయ్‌ని సవాలు చేస్తున్నారు. ఖేత్రీ అసెంబ్లీ స్థానంలోనూ ఇదే పరిస్థితి. ఇక్కడ కాంగ్రెస్ నుంచి మనీషా గుజ్జర్ పోటీలో ఉన్నారు. బీజేపీ తరఫున ఆమె బాబాయ్ ధర్మపాల్ బరిలో దిగారు. నాగౌర్‌లో బీజేపీ నుంచి జ్యోతీ మీర్ధా పోటీ చేస్తుంటే కాంగ్రెస్ తరఫున ఆమెకు బాబాయ్ వరసయ్యే హరేంద్ర మీర్ధా బరిలో ఉన్నారు. సోజత్ అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ నుంచి పీసీసీ ప్రధాన కార్యదర్శి నిరంజన్ ఆర్య బరిలో ఉన్నారు. బీజేపీ తరఫున ఆయన బంధువు శోభా చౌహాన్ పోటీలో దిగారు.

ఐఏఎస్ వర్సెస్ ఐపీఎస్

బస్సీ అసెంబ్లీ స్థానంలో మరో రకం పోటీ నెలకొంది. మాజీ ఐఏఎస్ చంద్రమోహన్ మీనా బీజేపీ నుంచి పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ తరఫున ఆయనపై పోటీ చేస్తున్న లక్ష్మణ్ మీనా మాజీ ఐపీఎస్ అధికారి కావడం విశేషం. పైగా వీరిద్దరూ బంధువులే.

రెండు పార్టీలకూ ప్రచారం

జాట్ సామాజిక వర్గంలో బాగా పట్టున్న ప్రముఖ నేత రీచ్‌పాల్ మీర్ధాది మరో తరహా కథ. డెగానా స్థానంలో కాంగ్రెస్ టికెట్‌పై పోటీలో ఉన్న తన కుమారుడు విజయ్ పాల్‌కు ఓటేయాల్సిందిగా ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు నగౌర్ అసెంబ్లీ స్థానంలో బీజేపీ టికెట్‌పై బరిలో దిగిన తమ్ముడి కూతురు జ్యోతీ మీర్ధా తరఫున స్వయంగా బరిలో దిగి ప్రచారం చేస్తున్నారు!

- సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 10 । నవంబర్ । 2023

సనత్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా గురువారం నామినేషన్ వేసేందుకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ భారీ ర్యాలీతో బయలుదేరారు. బన్సీలాల్‌పేట్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆయనకు గజమాల వేసి ఘనంగా సత్కరించారు. - బన్సీలాల్‌పేట్

● అభిమానం ఉప్పొంగె.. గజమాలతో సత్కరించె..



నామినేషన్ వేసేందుకు వయసు సరిపోలే!



ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ఆ యువకుడు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. పార్టీ బీ–ఫాంను స్వీకరించారు. నామినేషన్ పత్రాలను పూర్తి చేసి ఒక సెట్‌ను వేసేందుకు కేంద్రానికి వచ్చారాయన. వయసు 25 ఏళ్లు లేక పోవడంతో అధికారులు ఆయన నామినేషన్‌ను తిరస్కరించారు. రాజేంద్రనగర్ బుద్వేల్ ప్రాంతానికి చెందిన గుంటి గౌతమ్ (24)కు జనతా కాంగ్రెస్ పార్టీ నాలుగు రోజుల క్రితం బీ–ఫాం అందజేసింది. నామినేషన్ వేసేందుకు రిటర్నింగ్ అధికారి నుంచి పత్రాలను స్వీకరించారు. గురువారం మంచి రోజు ఉండటంతో ఒక సెట్ నామినేషన్ వేసి 10వ తేదీన తన అనుచరులతో ర్యాలీగా మరో నామినేషన్ వేసేందుకు సిద్ధమయ్యారు. తీరా నామినేషన్ పత్రాలను పరిశీలించిన అధికారులు పోటీ చేసేందుకు 25 సంవత్సరాలు నిండి ఉండాలని తెలపడంతో గౌతమ్ నిరాశతో వెనుతిరిగారు. - రాజేంద్రనగర్

ఓటుతోనే బంగారు భవిష్యత్



సెలబ్రిటీ కామెంట్

హైదరాబాద్ నగరం ప్రస్తుతం ఎంతో బాగుంది. అభివృద్ధి చెందుతోంది. మౌలిక సదుపాయాలు పెరుగుతున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే విశ్వనగరంగా మారుతోంది. ఈ క్రమంలో ఓటును సద్వినియోగం చేసుకోవాలి. మన బంగారు భవిష్యత్ తరాల కోసం ఎంతో ఉపయోగపడుతుంది. ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకుని జీవితానికి బంగారు బాటలు వేసుకోవాలి.

– రక్షిత్ అట్లూరి, 'పలాస 1978', 'నరకాసుర' చిత్రాల ఫేం

తండ్రి సెంటిమెంటు.. తనయ కొనసాగింపు!



లాస్య నందితతో పాటు రిటర్నింగ్ కార్యాలయంలోనికి వెళ్తున్న రమేశ్ రెడ్డి

కంటోన్మెంట్‌లో ఎన్నికల నామినేషన్ సమయంలోనే ప్రత్యక్షమయ్యే నేత ఆయన. 1994 నుంచీ దివంగత సాయన్న పోటీ చేసిన ఆరు ఎన్నికల్లోనూ ఆయనే నామినేషన పత్రాలు నింపారు. ఇప్పుడు సాయన్న కుమార్తె లాస్య నందిత సైతం అదే సెంటిమెంట్ ఫాలో అయ్యారు. ఇంతటి కీలకమైన సెంటిమెంట్ కలిగిన ఆయనే మాజీ టీడీపీ నేత రమేశ్‌రెడ్డి. కొన్నేళ్లుగా దాదాపుగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. అయినప్పటికీ సాయన్న కుమార్తె లాస్య నందిత, మళ్లీ ఆయననే పిలిపించుకున్నారు. గురువారం ఎన్నికల నామినేషన్ పత్రాలను రమేశ్ రెడ్డి ద్వారానే పూర్తి చేసి.. తండ్రి చిత్రపటం వద్ద ఉంచి రిటర్నింగ్ కార్యాలయానికి బయలుదేరారు. సాయన్న అనుచరులు పలువురు చాన్నాళ్ల తర్వాత రమేశ్ రెడ్డిని చూసి ఆనందం వ్యక్తం చేశారు. తమ నేతకు సెంటిమెంట్‌గా మారిన రమేశ్‌రెడ్డి రాక లాస్య నందిత విజయానికి శుభ సూచకం అంటూ మురిసిపోయారు. - కంటోన్మెంట్

కరవాలం చేబూని.. అశ్వంపై బయలుదేరి



ఎల్‌బీనగర్‌లో అశ్వంపై వచ్చి ఓ స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ వేశారు. తెలంగాణ కుమ్మరి సంఘం ఉపాధ్యక్షుడు, సామాజిక కార్యకర్త డాక్టర్ కేవీబీ వసంతరాయలు ప్రజాపతి గత ఎన్నికల్లో కూడా స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగారు. గురువారం నామినేషన్ వేసేందుకు చేతిలో కత్తి పట్టుకుని గుర్రంపై బయలుదేరిన ఆయనను దారిలో పలువురు ఆసక్తి తిలకించారు. - చైతన్యపురి

అక్కా.. ఆల్ ది బెస్ట్



వారిద్దరూ కంటోన్మెంట్ ఎన్నికల్లో నువ్వా నేనా అన్నట్లుగా పోటీ పడుతున్న అభ్యర్థులు. ఒకరు ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన దివంగత సాయన్న కుమార్తె. మరొకరు తన పాటతో ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం ఏర్పరుచుకున్న ప్రజా యుద్ధనౌక గద్దర్ కుమార్తె. ఆ ఇద్దరు ప్రముఖులు ఇటీవల మరణించడంతో వారి వారసులు కంటోన్మెంట్ ఎన్నికల్లో ఎమ్మెల్యే స్థానం కోసం పోటీ పడుతున్నారు. సాయన్న కుమార్తె లాస్య నందిత బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తుండగా.. గద్దర్ కుమార్తె వెన్నెలకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చింది. గురువారం ఈ ఇద్దరు నేతలు నామినేషన్ దాఖలుకు కంటోన్మెంట్ బోర్డు కార్యాలయానికి వచ్చిన సందర్భంగా ఒకరికొకరు ఎదురయ్యారు. దూరం నుంచే ఆత్మీయంగా పలకరించుకున్న లాస్య, వెన్నెల పరస్పరం 'ఆల్ ది బెస్ట్' చెప్పుకొన్నారు. దూరం నుంచి వీరిని గమనిస్తున్న అనుచరులు అపురూప దృశ్యాన్ని తమ సెల్‌ఫోన్‌లలో బంధించి సోషల్ మీడియాలో షేర్ చేసుకున్నారు. - కంటోన్మెంట్

బహదూర్‌పురా మజ్లిస్ అభ్యర్థిగా ముబీన్



మజ్లిస్ పార్టీ మరో సిట్టింగ్ ఎమ్మెల్యేకు అల్విదా పలికింది. ఇప్పటికే చార్మినార్, యాకుత్‌పురా సీనియర్ ఎమ్మెల్యేలు అహ్మద్ పాషాఖాద్రీ, ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌లకు రిటైర్మెంట్ ప్రకటించిన మజ్లిస్..తాజాగా బహదూర్‌పురా సీనియర్ ఎమ్మెల్యే మౌజం ఖాన్‌కు టికెట్ నిరాకరించింది. అక్కడ శాస్త్రిపురం కార్పొరేటర్ ముబీన్ అభ్యర్థిత్వం ఖరారు చేసింది. మొత్తం ఏడు సిట్టింగ్ స్థానాల్లో మూడింటిని మార్పు చేసింది. రెండు స్థానాల్లో మాజీ మేయర్లకు, ఒక స్థానంలో కార్పొరేటర్‌కు అవకాశం కల్పించింది. –సాక్షి, సిటీబ్యూరో

చార్మినార్ కాంగ్రెస్ అభ్యర్థిగా ముజీబుల్లా షరీఫ్



కాంగ్రెస్ పార్టీ తుది జాబితాను విడుదల చేసింది. చార్మినార్ అసెంబ్లీ స్థానానికి ముజీబుల్లా షరీఫ్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. అక్కడి నుంచి అలీ మస్కతీని పోటీ చేయాలని సూచించినా ఆయన ఆసక్తి కనబర్చకపోవడంతో చివరకు ముజీబుల్లా షరీఫ్ అభ్యర్థిత్వాని ప్రకటించింది. - చార్మినార్

● నామినేషన్ సంరంభం.. 'వివేకానందం'



కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే వివేకానంద్ నామినేషన్ వేసే కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి ఓపెన్ టాప్ వాహనంపై ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. - కుత్బుల్లాపూర్

● 'విజయ' పథమే ధ్యేయం..



ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి గురువారం నామినేషన్ అట్టహాసంగా దాఖలు చేశారు. అనంతరం తన తండ్రి పీజేఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మహంకాళి అమ్మవారి దయతో తాను ఎమ్మెల్యేగా ఘన విజయం సాధిస్తానని ఈ సందర్భంగా ఆమె ధీమా వ్యక్తంచేశారు. - ఖైరతాబాద్

● కర పత్రం ఇస్తున్నా.. కనికరించమ్మా!



కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండనగర్‌లో గురువారం శేరిలింగంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఓ యువతికి కర పత్రం అందించి తనకు ఓటు వేయాలని కోరారు. – హఫీజ్‌పేట్

నామినేషన్ల జోరు

- నగరమంతటా ఊరేగింపులతో సందడి
- కార్యకర్తలు, అభిమానులతో బైక్ ర్యాలీలు
- ఎటుచూసినా ఆటాపాటలతో అట్టహాసం
- భారీ ట్రాఫిక్ జాంలతో జనాల అవస్థలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో నామినేషన్ల దాఖలు ప్రక్రియ జోరుగా సాగింది. గురువారం మంచి రోజు అనే నమ్మకంతో పలు పార్టీల అభ్యర్థులు ర్యాలీలు, ఊరేగింపులతో వచ్చి అట్టహాసంగా నామినేషన్లు వేశారు. చాలామంది తొలుత తమ ఇష్ట దైవాలను పూజించుకొని, పండితుల వేద మంత్రాల ఆశీర్వాదాలు పొంది, తల్లిదండ్రులకు పాదాభివందనాలు చేసి నామినేషన్లకు బయలు దేరారు. దారి పొడవునా అభిమానులు కార్యకర్తల కేరింతలు, డాన్సులతో పరిసరాలు మార్మోగాయి. అభ్యర్థులకు మంగళహారతులు పడుతూ, శాలువాలు, గజమాలలతో సత్కరిస్తూ అడుగడుగునా అభిమానాన్ని చాటుకున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసిన వారిలో ఉన్నారు. ర్యాలీల కారణంగా ట్రాఫిక్ జాంలతో కొన్ని ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.




ఎమ్మెల్యేగా గెలుస్తా..

ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి మందముల పరమేశ్వర్‌రెడ్డి గురువారం కార్యకర్తలతో కలిసి భారీ బైక్ ర్యాలీతో బయలుదేరారు. అనంతరం నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు ఆయన ఉప్పల్‌లోని రామచంద్రస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలుస్తానని ధీమా వ్యక్తంచేశారు.

'రియల్'కు జైకొడతారా!

- శివార్లలో జోరుగా స్థిరాస్తి వ్యాపారం
- ఈ వర్గం వారికే టికెట్లు కేటాయించిన పార్టీలు
- కొత్తవారికి పట్టం కడతారా.. పాతవారినే గెలిపిస్తారా?
- ఎవరికి ఓటు వేటు వేస్తారో తేల్చుకోలేని అభ్యర్థులు
- డోలాయమానంలో ఆయా ప్రాంతాల ప్రజలు



సాక్షి, సిటీబ్యూరో: తాయిలాలు, హామీలే కాదు అభివృద్ధి, స్పష్టమైన విధానాలు కూడా ఓటర్లను ఆకర్షించడంలో అత్యంత కీలకమైనవే. ఐటీ, పారిశ్రామిక పెట్టుబడులతో దశాబ్ద కాలంగా శివారు ప్రాంతాల్లో అభివృద్ధి జోరుగా సాగుతోంది. దీని ఫలితాలను ముందుగా ఆస్వాదిస్తోంది అక్షరాలా స్థిరాస్తి కొనుగోలుదారులే. ఇక్కడి ఓటర్లను ఆకట్టుకోవడం అధికార, విపక్ష పార్టీలకు కత్తిమీద సాములాంటిదే. ఎప్పటిలాగే అధికారాన్ని పునరావృతం చేస్తారా? లేక ఊహించని విధంగా కొత్త వారికి జైకొడతారా? ఇలా శివారు ఓటర్లు ఎవరివైపు మొగ్గు చూపుతారన్నది అంతుచిక్కని ప్రశ్నే. మరోవైపు ఈ ఓట్లను ఒడిసిపట్టేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు కూడా స్థిరాస్తి వ్యాపారులకే టికెట్లు కేటాయించడం గమనార్హం.

భూముల ధరలకు రెక్కలు..

రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాక.. 23 పట్టణాలు జిల్లా కేంద్రాలుగా అవతరించాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రధాన ఆర్థిక వనరుగా మారింది. శివారు ప్రాంతాల్లోని భూముల ధరలు రెట్టింపు కంటే ఎక్కువే పెరిగాయి. గత శాసనసభ ఎన్నికల సమయంలో ఒక కొత్త జిల్లా కేంద్రం సమీపంలో ఎకరా భూమి ధర రూ.10 లక్షలు ఉంటే.. ఇప్పుడది రూ.కోటిన్నర పైనే పలుకుతోంది. మరోవైపు ఇప్పటికే అధికార పార్టీ శివారు ప్రాంతాలకు మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్లు, నగరం చుట్టూ ఐటీ హబ్‌లు వంటి అభివృద్ధి పనులకు పచ్చజెండా ఊపింది. దీంతో ఆయా ప్రాంతాల్లోని ఓటర్లు ఈసారి ఎన్నికలలో ఎవరి వైపు మొగ్గు చూపిస్తారనేది ఆసక్తిగా మారింది.

ఈ నియోజకవర్గాల్లో జోరుగా..

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి ఈ నాలుగు జిల్లాల పరిధిలో 26 నియోజకవర్గాలున్నాయి. సుమారు 1.01 కోట్ల మంది ఓటర్లున్నారు. పట్టణీకరణ, నగరాలకు వలసలు, ఆర్థిక వ్యవస్థ పురోగతి, భూముల ధరలు పెరగడంతో ఈ జిల్లాల్లో రియల్టీ వ్యాపారం అనూహ్యంగా పెరుగుతూ వస్తోంది. ప్రధానంగా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్, ఉప్పల్, చేవెళ్ల, రాజేంద్రనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్ నియోజకవర్గాలలో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రధాన నగరంతో పోలిస్తే ఈ శివారు నియోజకవర్గాలు ఓటర్ల పరంగా, ఆర్థికంగా, సామాజికంగా బలమైనవి. రాష్ట్రంలోనే అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గం శేరిలింగంపల్లి, ఆ తర్వాత కుత్బుల్లాపూర్, మేడ్చల్, ఎల్బీనగర్, రాజేంద్రనగర్ నియోజకవర్గాలున్నాయి. కేవలం ఈ ఐదు అసెంబ్లీ పరిధిలోనే 30 లక్షల మంది ఓటర్లున్నారు.

టికెట్లలోనూ వీరికే ప్రాధాన్యం..

మరోవైపు రాజకీయ పార్టీలు కూడా శివారు ఓటర్లను ఆకర్షించేందుకు వ్యక్తిగతంగా, వ్యాపారపరంగా వారితో సత్సంబంధాలు ఉన్న స్థిరాస్తి వ్యాపారస్తులకే టికెట్లను కేటాయించాయి. కొందరు నేరుగా రియల్ రంగంలో ఉండగా.. మరికొందరు వారి కుటుంబ సభ్యులు, ఇతరులు భాగస్వామ్యంతో చేస్తున్నవారే ఉన్నారు.

మచ్చుకు కొందరు అభ్యర్థులు..

- శేరిలింగంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి ఆరికెపూడి గాంధీ బిల్డర్ కమ్యూనిటీ నుంచే వచ్చారు.
- కూకట్‌పల్లి బీఆర్ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు తనయుడు బాచుపల్లిలోని ఓ ప్రముఖ నిర్మాణ సంస్థలో భాగస్వామి. ఇక్కడే జనసేన నుంచి బరిలోకి దిగిన ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ కూడా నిర్మాణ రంగానికి చెందినవారే.
- మహేశ్వరంలో అధికార పార్టీ అభ్యర్థి సబితా ఇంద్రారెడ్డి తనయుడు రియల్ ఎస్టేట్ వ్యాపారే. ఇదే నియోజకవర్గంలో బీఎస్పీ అభ్యర్థి కొత్త మనోహర్ రెడ్డి కూడా బిల్డర్ కమ్యూనిటీకి చెందిన వారే. పటాన్‌చెరు ఎమ్మెల్యే, పీర్జాదిగూడ మేయర్ నిర్మాణ రంగానికి చెందినవారే.
- వీరే కాకుండా మల్కాజిగిరి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, షాద్‌నగర్ నుంచి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న వారు సైతం స్థిరాస్తి రంగంతో సంబంధం ఉన్నవాళ్లే.



రౌడీషీటర్ల ఇంటికి వెళ్తున్న ఎస్పీ సునీతా రెడ్డి

మీ వాళ్లు జర పైలం!

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించడానికి నగర కొత్వాల్ సందీప్ శాండిల్య కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే రౌడీషీటర్లపై డేగకన్ను వేశారు. స్థానిక పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారుల ద్వారా వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం, బైండోవర్‌లతో పాట వాంటెడ్ ఉన్న వారిని కటకటాల్లోకి పంపిస్తున్నారు. నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్న వారినీ వెతికిపట్టుకుని జైలుకు తరలిస్తున్నారు. ఓ పక్క ఈ చర్యలు తీసుకుంటున్న పోలీసు కమిషనర్ మరోపక్క రౌడీల కుటుంబీకుల సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. అసాంఘిక శక్తులుగా ముద్రపడిన ఈ రౌడీలు ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోకుండా, ఓటర్లను ప్రభావితం చేసేలా అభ్యర్థుల వెంట తిరగకుండా, రాజకీయ పార్టీలకు అనుకూలంగా, ప్రతికూలంగా స్థానికులను భయభ్రాంతులకు గురి చేయకుండా ఉండేలా చేసేందుకు వారి కుటుంబీకుల సహాయం తీసుకుంటున్నారు. ఆయా రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి, కుటుంబీకులకు కౌన్సెలింగ్ చేసే బాధ్యతల్ని మహిళా అధికారులకు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ వ్యవహారాల కోసం జోన్ల వారీగా డీసీపీ, ఎస్పీ, ఏసీపీ స్థాయి అధికారిణులను నియమించారు. వీళ్ళు ప్రతి రోజూ ఉదయం 7–10 గంటల మధ్య, సాయంత్రం 4–7 గంటల మధ్య తమకు కేటాయించిన జోన్లలోని రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి.. వారి కుటుంబీకులతో మాట్లాడటంతో పాటు ఎన్నికల క్రతువు పూర్తయ్యే వరకు దైనందిన కార్యకలాపాలు ముగిసిన తర్వాత ఇంటికి వచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈ అధికారిణుల వెంట స్థానిక మహిళ ఎస్సైలు, సాయుధ బలగాలు ఉంటున్నాయి. ఈ కార్యక్రమానికి హార్ట్ టు హార్ట్ అని పేరు పెట్టారు.

జోన్ల వారీగా ఇన్‌చార్జిలు ఇలా...

జోన్	అధికారిణి
సెంట్రల్ జోన్	ఐసీసీసీ డీసీపీ పుష్ప
ఈస్ట్ జోన్	ఉమెన్ సేఫ్టీ ఏసీపీ డి.ప్రసన్న లక్ష్మి
నార్త్ జోన్	స్థానిక డీసీపీ చందనా దీప్తి
సౌత్ జోన్	సీసీఎస్ డీసీపీ కె.శిల్పవల్లి
సౌత్ వెస్ట్ జోన్	టాస్క్‌ఫోర్స్ డీసీపీ నితిక పంత్
సౌత్ ఈస్ట్ జోన్	ఉమెన్ సేఫ్టీ డీసీపీ డి.కవిత
వెస్ట్ జోన్	టీ–నాబ్ ఎస్పీ సునీతా రెడ్డి

బీఆర్ఎస్ నేతల మాటలు నమ్మొద్దు

పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



అమీర్‌పేటలో జరిగిన సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

అమీర్‌పేట: ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే వచ్చే నెల నుంచి ఇంట్లోని అత్తకు రూ.4 వేల పింఛన్, సౌభాగ్య లక్ష్మి పథకం కింద కోడలికి రూ.2,500 ఇస్తామని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని అమీర్‌పేటలో గురువారం రాత్రి జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఇవ్వకపోతే కేసీఆర్ కుటుంబం అధోగతి పాలయ్యేదని ఆరోపించారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పేదలకు అన్యాయం చేశారని దుయ్యబట్టారు. అమ్మకు అన్నం పెట్టటేని బీఆర్ఎస్ నాయకులు చిన్నమ్మకు బంగారు గాజులు పెడతానంటే మహిళలు నమ్మే స్థితిలో లేరన్నారు. సనత్‌నగర్ నియోజక వర్గంలో తలసానిని గెలిపిస్తే మోండా మార్కెట్‌లో ఆలుగడ్డలు అమ్మినట్లు ఆస్తులు అమ్ముకుంటాడని ఎద్దేవా చేశారు. శ్రీనివాస్ యాదవ్ మాటలను ప్రజలు నమ్మవద్దని చెప్పారు. గడిచిన 10 ఏళ్లలో ప్రజలకు ఆయన చేసిందేమీ లేదన్నారు. ఆడబిడ్డ ఆత్మగౌరవం నిలబెట్టాలంటే కోట నీలిమకు ఓట్లు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. తాము అధికారంలోకి వస్తే అర్హులందరికీ ఇళ్లు, ఇళ్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, ఉద్యోగులందరికీ మొదటి తేదీ నాడే వేతనాలు చెల్లిస్తామన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను ఇంటికి చేరుస్తామని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ మైనార్టీ నేత ఇబ్రహీం, రోహిత్, అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠకు తెర

శేరిలింగంపల్లి బీజేపీ అభ్యర్థిగా రవి కుమార్ యాదవ్



బీజేపీ కార్యకర్తల సందడి



రవికుమార్ యాదవ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి బీజేపీ అభ్యర్థి ఎంపికకు తెరదించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి గురువారం సాయంత్రం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్‌కు పిలుపు వచ్చింది. ఈ మేరకు ఆయనకు టికెట్ ఖరారు చేస్తూ బీజేపీ అధిష్టానం ఫోన్ చేసి తెలిపింది. దీంతో మసీదుబండలోని బీజేపీ కార్యాలయం, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, రవికుమార్ యాదవ్ నివాసంలో కార్యకర్తలు, నాయకులతో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు స్వీట్లు పంచి బాణాసంచా కాల్చారు. రాత్రి పొద్దుపోయాక బీజేపీ రాష్ట్ర నాయకులు కొండా విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయానికి బయలుదేరారు. శుక్రవారం భారీ ర్యాలీతో నామినేషన్ వేసేందుకు రవి కుమార్ యాదవ్ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రాష్ట్రంలోనే అతి పెద్ద నియోజకవర్గమైన శేరిలింగంపల్లి బీజేపీ అభ్యర్థి ఎంపిక అంశం ఎన్నో మలుపులు తీసుకుంది. బీజేపీ జాతీయ నాయకత్వం జనసేనతో పొత్తు ఖరారు చేయడంతో శేరిలింగంపల్లి బీజేపీ అభ్యర్థి ఎంపిక ప్రక్రియ జటిలంగా మారింది. ఒక దశలో టికెట్ జనసేనకే దక్కుతుందని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. దీంతో బీజేపీ కేడర్‌ను అయోమయం ఆవరించింది. చివరికి శేరిలింగంపల్లి టికెట్ జనసేనకు ఇవ్వకపోవడంతో స్థానిక బీజేపీ నేతలు ఊపిరి పీల్చుకున్నారు. నామినేషన్ ఆఖరి రోజుకు కొద్ది గంటల ముందు రవి కుమార్ యాదవ్‌ను శేరిలింగంపల్లి అభ్యర్థిగా ప్రకటించి ఎట్టకేలకు ఉత్కంఠకు తెర దించింది.

నామినేషన్ల పర్వం

నగరంలో వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు గురువారం నామినేషన్లను దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ కార్యాలయాల వద్ద కోలాహలం నెలకొంది.


రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


నామినేషన్ దాఖలు చేస్తున్న కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు


సనత్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్..


నామినేషన్ దాఖలు చేస్తున్న కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్


ప్రచార ర్యాలీలో జనానికి అభివాదం చేస్తున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్


ఉప్పల్ ఆర్వో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి


జీఎన్‌రెడ్డి నగర్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎల్‌బీనగర్ బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

చంద్రయాన్-3 ఎంతో గర్వకారణం


శాస్త్రవేత్త కమలాకర్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న డాక్టర్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు, జయప్రకాష్ నారాయణ్ తదితరులు

అబిడ్స్: చంద్రయాన్–3 విజయవంతం కావడం మనందరికీ ఎంతో గర్వకారణమని తెలంగాణ రాష్ట్ర బీసీ కమీషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. గురువారం రవీంద్రభారతిలో ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో భారతరత్న సీవీరామన్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్రో పూర్వ సంచాలకులు జేఏ కమలాకర్‌కు ఆకృతి – సర్ సీవీ రామన్ ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కమలాకర్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ్, ఆకృతి వ్యవస్థాపక అధ్యక్షులు సుధాకర్ తదిరులు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

- ప్రేమ వ్యవహారమే కారణమంటున్న స్థానికులు
- మూకుమ్మడిగా చితకబాదడంతో మృతి


కరణ్ నాయక్ (ఫైల్)

పోచారం: మైనర్ బాలికతో ప్రేమాయణం సాగిస్తున్న యువకుడిపై 11 మంది మూకుమ్మడిగా దాడి చేయడంతో అతను మృతి చెందాడు. ఈ సంఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నోజిగూడలోని ఎల్‌ఎన్ కాలనీకి చెందిన దారావత్ కరణ్ నాయక్ (18) గత కొంత కాలంగా అదే కాలనీలో ఉంటున్న ఓ మైనర్ బాలిక(15) తో ప్రేమాయణం సాగిస్తున్నాడు. దీంతో కరణ్‌ను అమ్మాయి తల్లిదండ్రులు పలుమార్లు మందలించారు. బుధవారం రాత్రి అమ్మాయి తల్లిదండ్రులు ఫంక్షన్‌కు వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలిక వద్దకు కరణ్ వచ్చాడు. ఈ సమాచారం ఇరుగుపొరుగు ద్వారా తల్లిదండ్రులకు తెలవడంతో వారు ఇంటికి వచ్చి యువకుడి కళ్లలో కారం కొట్టి చితక బాదారు. తలకు బలమైన గాయం తగలడంతో అతను మృతి చెందాడు. బాలిక మహారాష్ట్రకు చెందినట్లు స్థానికులు తెలిపారు. కాగా, మృతుడు పోచారం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ రెడ్యా నాయక్‌కు మేనల్లుడు. 11 మంది మూకుమ్మడి దాడి చేయడంతో ఈ దారుణం జరిగింది. వీరిలో 9 మంది పోలీసులు అదుపులో ఉండగా, ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిసింది. నిందితుల అరెస్టు వివరాలను పోలీసులు వెల్లిడించాల్సి ఉంది.

కళాశాల భవనంపై నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య


సంజయ్ (ఫైల్)

మేడ్చల్ రూరల్: ప్రేమ వ్యవహారంలో మనస్థాపానికి గురైన విద్యార్థి కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీఎంఆర్‌ఈసీ కళాశాలలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నవీన్ రెడ్డి తెలిపిన మేరకు..రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన సంజయ్(21) గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌ఈసీ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ కోర్సులో 4వ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలలో ఇంటర్నల్ ఎగ్జామ్స్ ఉండడంతో బుధవారం ఉదయం పరీక్ష రాసిన విద్యార్థి సంజయ్ మధ్యాహ్నం జరిగే పరీక్షకు హాజరు కాలేదు. దీంతో తోటి విద్యార్థులు పరీక్షకు ఎందుకు హాజరు కాలేదు, సంజయ్ ఎక్కడికి వెళ్లాడని ఆరా తీశారు. ప్రేమ విషయంలో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకోవాలని భావించిన సంజయ్ కళాశాల సాయంత్రం సమయంలోనే కళాశాల భవనంపైకి ఎక్కాడు. రాత్రి 8 గంటల సమయంలో తాను కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు తోటి మిత్రులకు సంజయ్ ఫోన్ మెసెజ్ చేశాడు. దీంతో హుటాహుటిన కళాశాలకు చేరుకున్న మిత్రులు సంజయ్ కోసం వెతుకుతుండగా అంతలోనే 4వ అంతస్తు నుండి దూకాడు. విద్యార్థులు, కళాశాల యాజమాన్యం సంజయ్ ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మరణించాడు.



నామినేషన్‌కు ముందు ఖైరతాబాద్ మహంకాళి ఆలయంలో నామినేషన్ పత్రాలతో పూజలు నిర్వహిస్తున్న విజయారెడ్డి





జై పీజేఆర్ నినాదాలతో దద్దరిల్లిన ఖైరతాబాద్

అట్టహాసంగా విజయారెడ్డి నామినేషన్ ర్యాలీ

- సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేసిన కళాకారులు
- విజయం తథ్యమంటూ పార్టీ వర్గాల ధీమా
- ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలివచ్చిన పీజేఆర్ అభిమానులు, పార్టీ శ్రేణులు



ఖైరతాబాద్: ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి. విజయారెడ్డి గురువారం నామినేషన్ కార్యక్రమం ఆద్యంతం అట్టహాసంగా సాగింది. ఉదయం నుంచే నియోజకవర్గం పరిధిలోని ఆరు డివిజన్ల నుంచి వేలాదిగా విచ్చేసిన పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు, జనహృదయ నేత పీజేఆర్ అభిమానులతో ఖైరతాబాద్ బడా గణేష్ పరిసరాలు కిటకిటలాడాయి. ఉదయం నామినేషన్ పత్రాలతో విజయారెడ్డి ఖైరతాబాద్ మహంకాళి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అర్చకుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. అమ్మవారి దయతో ఎమ్మెల్యేగా ఘన విజయం సాధిస్తానని ఈ సందర్భంగా విజయారెడ్డి వెల్లడించారు. అనంతరం తన తండ్రి పీజేఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. గిరిజన మహిళల నృత్యాలు, యువత కేరింతలు, అభిమానుల జిందాబాద్ నినాదాల నడుమ ఆమె నామినేషన్ ర్యాలీ ఘనంగా జరిగింది.

- భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, యువజన కాంగ్రెస్ నేత అనిల్‌కుమార్ యాదవ్, పి. మోహన్‌యాదవ్ తదితరులతో కలిసి విజయారెడ్డి నామినేషన్ వేశారు.
- మహిళలు భారీ సంఖ్యలో విచ్చేసి ఆమెకు మద్దతుగా నిలబడ్డారు.
- బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ, హిమాయత్‌నగర్, జూబ్లిహిల్స్ డివిజన్ల నుంచి కార్యకర్తలు బస్సుల్లో తరలిరాగా మరికొంత మంది బైక్‌లు, కార్లపై ఊరేగింపుగా ఖైరతాబాద్‌కు విచ్చేశారు. పీజేఆర్ జిందాబాద్ నినాదాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది.
- జనహృదయ నేత పీజేఆర్‌పై ఉన్న ప్రేమాభిమానాలతో తనను దీవిస్తున్నారని ఈ ఎన్నికల్లో కూడా తనను అసెంబ్లీకి పంపించాలని విజ్ఞప్తి చేశారు. తనకు వచ్చిన ప్రతి అవకాశాన్ని మీ అండతో విజయవంతంగా వినియోగించుకున్నానని మీ సోదరికి మీ అవసరం బాగా ఉందని అన్నారు.
- 20 ఏళ్ల నిరీక్షణను 20 రోజుల్లో ముగించుకుందామన్నారు. భారీ మెజార్టీతో తనను గెలిపించాలన్నారు. మీరున్నారనే ధైర్యంగా ముందుకు సాగుతున్నానని అన్నారు. అధిష్టానం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగించుకుంటానని, ప్రజలు తనకు ఓటు వేసి గెలిపించాలని విజయారెడ్డి కోరారు.







నాన్నా.. నీ ఆశీస్సులు కావాలి

ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు ఆమె ఖైరతాబాద్ చౌరస్తాలోని పీజేఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు అక్కడికి విచ్చేసిన కార్యకర్తలు, అభిమానులకు చేతి గుర్తునుచూపిస్తూ అభివాదంచేశారు.

జూబ్లీహిల్స్‌లో ఎనిమిది నామినేషన్లు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఏఐఎంఐఎం అభ్యర్థిగా ఉమర్ రషీద్ ఫరాజుద్దీన్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి గోపినాథ్, కాంగ్రెస్ అభ్యర్థిగా అజహరుద్దీన్, ఆధార్ పార్టీ అభ్యర్థిగా నందకిషోర్ కళ్లాడ, తెలంగాణ మైనార్టీస్ ఓబీసీ రాజ్యపార్టీ అభ్యర్థిగా ఎం.డి.జాహెద్‌ఖాన్, జై మహా భారత్ పార్టీ అభ్యర్థిగా మెరుగు అనసూయ, స్వతంత్ర అభ్యర్థిగా వల్లాల నవీన యాదవ్, ఇండియన్ బిలీవర్స్ పార్టీ అభ్యర్థిగా బిషప్ హ్యారీ సెబాస్టియన్ తదితరులు నామినేషన్లు దాఖలు చేశారు. గురువారం ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయి.

జంగ్ 2023 తెలంగాణ

జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిగా అజహరుద్దీన్ నామినేషన్



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా టీం ఇండియా మాజీ సారథి, మాజీ ఎంపీ మహమ్మద్ అజహరుద్దీన్ గురువారం షేక్‌పేట మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్‌వో కేంద్రంలో నామినేషన్ దాఖలు చేశారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నేతలు భవానీ శంకర్, ఉపేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్ తదితరులతో కలిసి నామినేషన్ పత్రాలను ఆర్‌వో రవికి అందజేశారు.

నామినేషన్ వేసిన బీజేపీ అభ్యర్థి చింతల



బంజారాహిల్స్: ఖైరతాబాద్ బీజేపీ అభ్యర్థిగా చింతల రామచంద్రారెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఖైరతాబాద్ బడా గణేష్ నుంచి ర్యాలీగా నామినేషన్ కేంద్రానికి బీజేపీ నేతలు విష్ణువర్దన్‌రెడ్డి, గౌతం రావుతో కలిసి బయల్దేరారు.

మూడోసారి గెలిచి సీఎంకు బహుమతి ఇస్తాం: మాగంటి గోపీనాథ్



నామినేషన్ దాఖలు చేస్తున్న మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు ఆయన మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడిలో నామినేషన్ అనంతరం అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం షేక్‌పేట మండల కార్యాలయంలోని నామినేషన్ కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు తిరిగి తమను అధికారంలోకి తీసుకొస్తాయని అన్నారు. తనపై నమ్మకంతో కేసీఆర్ మూడోసారి అవకాశం కల్పించారని నియోజక వర్గ ప్రజల తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నియోజక వర్గంలోని కీలక సమస్యలన్నింటిని పరిష్కరించడమే కాక పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత తమదేనని ధీమా వ్యక్తం చేశారు. పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్‌రెడ్డి తనతో కలిసి రావడం తనకు మరింత బలాన్ని చేకూర్చిందని అన్నారు. బడుగు బాంధవుడిగా పీజేఆర్‌కు పేరుందని ఆయన తనయుడికి కూడా పేద ప్రజల మద్దతు ఉందని ఇదంతా తమకు కలిసి వచ్చే అంశమని అన్నారు.

అది నా అదృష్టం: నిర్మాత అల్లు అరవింద్

బంజారాహిల్స్: దివంగత దర్శకుడు కె.విశ్వనాథ్ స్మారకార్థం ఇండికా పిక్చర్స్ అధినేతలు దాంజీ, హరి షార్ట్ ఫిలిం పోటీలు నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో కె.విశ్వనాథ్ స్మారక షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్ ఫైనల్ స్క్రీనింగ్ నిర్వహించి ఎనిమిది మంది విజేతలను ప్రకటించారు. నిర్మాత అల్లు అరవింద్, నటి మంజు భార్గవి విజేతలను సన్మానించారు. అనంతరం అల్లు అరవింద్ మాట్లాడుతూ... కె.విశ్వనాథ్‌తో తాను శుభలేఖ (1982) చిత్రం తీశాను. ఆయనతో సినిమా తీయడం నా అదృష్టంగా భావిస్తున్నా. నటి, డాన్సర్ మంజు భార్గవి మాట్లాడుతూ... శంకరాభరణం సినిమా నా కెరీర్‌నే మార్చేసిందన్నారు. నటి అమల అక్కినేని మాట్లాడుతూ... అక్కినేని నాగేశ్వరరావుతో విశ్వనాథ్‌కు మంచి స్నేహ సంబంధాలు ఉండేవన్నారు. ఇండికా పిక్చర్స్ అధినేత దాంజీ హరి మాట్లాడుతూ... నాలుగేళ్ల క్రితమే ఇండికా పిక్చర్స్ నెలకొల్పాం. ప్రతి ఏడాది ఈ కాంటెస్ట్ నిర్వహిస్తాం అని అన్నారు. నిర్మాత నవీన్ ఎర్నేని, డైరెక్టర్ షణ్ముక కార్తీక్, హరికిరణ్, కేఎల్ నారాయణ పాల్గొన్నారు.

దళిత బహుజన పార్టీ అభ్యర్థులకు బీ ఫాంల అందజేత



లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులకు దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వి.కృష్ణస్వరూప్ బీ ఫాంలను అందజేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వివిధ నియోజకవార్గల నుంచి పోటీ చేస్తున్న 27 మందికి అధికారికంగా బీ ఫాంలు ఇచ్చి ఎన్నికల్లో విజయం సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బహుజన రాజ్యాన్ని నిర్మించుకునేందుకు అభ్యర్థులు ఎన్నికల్లో విజయం సాధించి తీరాలన్నారు. కలిసికట్టుగా ఐక్యంగా పోరాటం చేస్తే అంబేద్కర్ ఆశించిన సమతా రాజ్యాన్ని నిర్మించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల కమిటీ చైర్మన్ వి.ఎల్.రాజు అభ్యర్థులు బి.సతీష్‌కుమార్, పి.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యపరీక్షలకు ఆస్పత్రికొస్తే బంగారు గొలుసు మాయం

పంజగుట్ట: వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వస్తే ఐదు తులాల బంగారు గొలుసు మాయమైన సంఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... బేగంపేట ప్రకాష్‌నగర్‌కు చెందిన కె.నాగమణి గృహిణి పలు ఆరోగ్య సమస్యలతో ఈ నెల 2వ తేదీన సోమాజిగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి రాగా పలు వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ సూచించాడు. సదరు వైద్య పరీక్షలు చేయించుకునేందుకు ఈ నెల 8వ తేదీన తిరిగి ఆస్పత్రికి వచ్చింది. ఎక్స్‌రే తీయించుకునేందుకు వెళ్లగా ఆమె మెడలో ఉన్న ఐదు తులాల బంగారు గొలుసు తియ్యమని సిబ్బంది సూచించారు. ఆమె గొలుసు తీసి తన బ్యాగ్‌లో పెట్టుకుంది. అల్ట్రాసౌండ్ పరీక్ష వద్దకు వెళ్లి తాను వాష్‌రూం వెళ్లివస్తాను బ్యాగ్ ఎక్కడపెట్టాలని సిబ్బందిని అడగగా వారు కంప్యూటర్ పక్కనపెట్టమని సూచించారు. అక్కడ బ్యాగ్ ఉంచి ఆమె వాష్‌రూం వెళ్లివచ్చి బ్యాగ్‌తీసుకుని అక్కడ కూర్చుంది. బ్యాగ్‌ను పరిశీలించడంతో బ్యాగ్ జిప్ ఓపెన్ చేసి ఉంది. లోన చూడగా ఆమె బంగారు గొలుసు కనిపించకుండా పోయింది. అల్ట్రాసౌండ్ సిబ్బందిని ప్రశ్నించగా వారు మాకు తెలియదు అని సమాధానం ఇవ్వడంతో ఆస్పత్రి యాజమాన్యానికి ఫిర్యాదు చేసింది. అనంతరం పంజగుట్ట పోలీసులను ఆశ్రయించింది.

వినూత్నంగా జూబ్లీహిల్స్ కాంగ్రెస్ కార్యకర్తల ప్రచారం



అజహరుద్దీన్ కటౌట్లతో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అజహరుద్దీన్ గెలిపించాలని వినాయకనగర్ బస్తీ కాంగ్రెస్ నాయకులు కేశవులు, యోహన్, రవి, వెంకటేశ్‌లు ఆయన కటౌట్‌లతో వినూత్న ప్రచారం నిర్వహిస్తున్నారు. హస్తం గుర్తు, అజహరుద్దీన్ బ్యాటింగ్ చేసే కటౌట్లతో బస్తీల్లో తిరుగుతూ కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అలసత్వం వహించొద్దు

వెంకటేశ్వరకాలనీ: విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్ విషయంలో ఏ మాత్రం అలసత్వం వహించొద్దని వారు పాటించడంతో పాటు ఇతరులు ట్రాఫిక్ రూల్స్ పాటించేలా విద్యార్థులు అవగాహన కల్పించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు సూచించారు. గురువారం బంజారాహిల్స్ రోడ్‌నెం 10లోని సరస్వతి జూనియర్ కాలేజీలో విద్యార్థులకు ఆయన ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా యువత ఎక్కువగా హెల్మెట్ పెట్టుకోకుండా, రాంగ్‌రూట్‌లో వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రామసుబ్బయ్య నాయుడు, ప్రిన్సిపాల్ రామకృష్ణ, డైరెక్టర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ప్రేమించాలని వేధిస్తున్న యువకుడిపై ఫిర్యాదు

వెంగళరావునగర్: ఒకసారి ప్రేమించి విడిపోయిన యువకుడు మళ్లీ ప్రేమించాలని యువతిని వేధిస్తున్న సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రహమత్‌నగర్‌కు చెందిన యువతికి (20)కి 2018లో చందూలాల్ అనే వ్యక్తి ప్రేమించుని కొంతకాలం తర్వాత విడిపోయారు. 2021లో మళ్లీ ప్రేమలో పడి కొంతకాలం తర్వాత విడిపోయారు. ఇటీవల చందూలాల్ తిరిగి ప్రేమించాలని వేధిస్తున్నాడు. దాంతో విసుగుచెందిన యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

శారీరకంగా కలవాలంటూ బెదిరింపు

గతంలో పరిచయం ఉన్న వ్యక్తి తనను కలవకపోతే ఫొటోలు సోషల్ మీడియాలో పెడతామని బెదిరిస్తున్నట్లు యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మధురానగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉండే యువతికి 9 నెలల కిందట రమేష్ అనే వ్యక్తి ఇన్‌స్టా గ్రామ్ ద్వారా పరిచయం అయ్యాడు. కొన్ని రోజుల తర్వాత వరంగల్‌లో ఇరువురూ కలుసుకున్నారు. ఆమె వ్యక్తిగత ఫొటోలు యువకుడు తీసుకున్నాడు. ఇటీవల ఆ యువకుడు తనను శారకంగా కలవాలని, లేకపోతే గతంలో తీసిన ఫొటోలు సోషల్ మీడియలో పెడతానని బెదిరింపులకు గురిచేస్తున్నాడని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రూ. 50 లక్షలు చోరీ చేసిన నిందితుడి అరెస్టు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్ నెం.78లోని ఫినిక్స్ హల్సియాన్ అపార్ట్‌మెంట్‌లో దొంగతనానికి పాల్పడిన నిందితుడిని ఫిలింనగర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ సమాచారం మేరకు... ఫిలింనగర్‌లోని పటేల్‌నగర్ బస్తీకి చెందిన పెదాడ రామకృష్ణ(29) కారు డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. జల్సాలకు అలవాటు పడి ఈజీమనీ కోసం దొంగతనాలకు తెరలేపాడు. ఈ నెల 3వ తేదీన ఫినిక్స్ అపార్ట్‌మెంట్స్‌లో నివసించే వడ్లమూడి శ్రీహర్ష నివాసంలో రూ. 50 లక్షలు దొంగిలించి పరారయ్యాడు. అదేరోజు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు రంగంలోకి దిగి సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఆ ఇంటికి తరచూ వివిధ పనుల నిమిత్తం వచ్చేవారని పనిమనుషులను విచారించారు. గతంలో ఈ ఇంట్లో పని చేసిన రామకృష్ణ ఈ దొంగతనానికి పాల్పడినట్లుగా గుర్తించారు. రూ. 45 లక్షలు రికవరీ చేశారు.

కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయడమే లక్ష్యం



మేయర్ విజయలక్ష్మితో కలిసి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి దానం



గౌరీ శంకర్ కాలనీలో ఓ అవ్వకు కేసీఆర్ మేనిఫెస్టోను వివరిస్తున్న దానం

- ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ గురువారం బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని ఎన్బీటీ నగర్‌లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో, వెంకటేశ్వరకాలనీ డివిజన్‌పరిధిలోని గౌరీ శంకర్ కాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల, అభివృద్ధి మేనిఫెస్టోను స్థానికులకు వివరించారు. ఎన్నికల తర్వాత పింఛన్లు, సౌభాగ్యలక్ష్మి, గృహిలక్ష్మి, ఆరోగ్య రక్ష, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు తదితర పథకాలన్నీ అమలవుతాయని అన్నారు. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎంను చేయడమే లక్ష్యంగా శ్రేణులన్నీ పని చేయాలని ఈ మేరకు ప్రజలకు కేసీఆర్ మేనిఫెస్టోను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్ల పరిధిలో బస్తీవాసులు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. మా ఓటు కారుకే అంటూ నినాదాలు చేశారు.

బీఆర్ఎస్‌తోనే పేదల 'సంక్షేమం'

పంజగుట్ట: ఎన్నికలప్పుడు ఎంతో మంది వచ్చి కల్లబొల్లి మాటలు చెపుతారని వాటిని నమ్మకుండా ఆలోచించి 10 సంవత్సరాల బీఆర్ఎస్ అభివృద్ధి చూసి ఓటు వేయాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని పంజగుట్ట బాలాపూర బస్తీ, జాఫల్ అలీబాగ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు యధావిధిగా సాగాలంటే తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తేనే సాధ్యం అవుతుందని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీల చేతిలో రాష్ట్రాన్ని పెడితే రాష్ట్ర భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకువచ్చిన సంక్షేమ పథకాలు, కొత్త మేనిఫెస్టోను ప్రతి గడపకూ తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తపై ఉందని సూచించారు. ఇప్పటికే అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇచ్చామని, డిసెంబర్ 3 తర్వాత పెండింగ్‌లో ఉన్న షాదీముబారక్, డబుల్ బెడ్ రూం, దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి అన్ని మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఖైరతాబాద్ డివిజన్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



బాలాపూర్‌లో ప్రచారం చేస్తున్న దానం నాగేందర్

బుడ్డోడిని ఆడిస్తూ...

బంజారాహిల్స్: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ సరదా సరదగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గురువారం బంజారాహిల్స్‌రోడ్ నెం. 12లోని ఎన్బీటీనగర్‌లో పర్యటిస్తుండగా ఓ బుడ్డోడు ముద్దొచ్చాడు. అంతే తల్లి వద్ద నుంచి ఆ బుడ్డోడిని ఎత్తుకొని ఆడించి ముచ్చట పడ్డాడు. చూడ ముచ్చటైన ఈ దృశ్యాన్ని తిలకించిన కార్యకర్తలు కూడా సరదా పడ్డారు.



నలుగురి వద్ద కలిపి రూ. 40 వేలే...

ఆస్తులు, అప్పుల వివరాలు వెల్లడించిన అభ్యర్థులు

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పి. విజయారెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఇందులో భాగంగా ఆమె తన ఆస్తులు, అప్పులు, కేసులు ఇతర వివరాలను అఫిడవిట్లో జతపర్చారు. ఇందులో భాగంగా ఆమె చేతిలో ప్రస్తుతం రూ. 18 వేలు ఉండగా భర్త జీవీబీఆర్ రెడ్డి చేతిలో రూ. 16500, కుమారుడు జీఎస్ఆర్ ప్రభాత్ రెడ్డి చేతిలో రూ. 5500, కుమార్తె హరీశ్వరీరెడ్డి చేతిలో రూ. 2 వేలు ఉన్నట్లు చూపారు. ఆమె పేరుతో రెండు కార్లు, ఆమె భర్త పేరుతో ఒక కారు, కుమార్తె పేరుతో మరో కారు, ట్రాక్టర్, రెండు ద్విచక్ర వాహనాలున్నట్లు పేర్కొన్నారు. ఆమె పేరుతో రూ. 69 లక్షల విలువైన 900 గ్రాముల బంగారు, వజ్రాభరణాలు ఉండగా, భర్త పేరుతో రూ. 45,75,000ల విలువైన 400ల గ్రాముల బంగారు, వజ్రాభరణాలు ఉన్నట్లు చూపారు. వివిధ రూపాల్లో తీసుకున్న రుణాలను గమనిస్తే విజయారెడ్డి పేరుతో రూ. 7,99,09,021, భర్త పేరుతో రూ 5,73,70,546, కుమార్తె పేరుతో రూ. 5,26,000 ఉన్నాయి. విజయారెడ్డిపై ఖైరతాబాద్, పంజగుట్ట పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదవ్వగా, పద్నాలుగో ఏసీఎంఎం కోర్టులో ఒక కేసుతోపాటు మరో రెండు కేసులు నమోదై ఉన్నాయి.

- స్థిరాస్తుల విలువను చూస్తే విజయారెడ్డి పేరుతో రూ. 13,0682,000 భర్త పేరుతో రూ. 8,04,48,100, కుమారుడు పేరుతో రూ. 14,50,000, కుమార్తె పేరుతో రూ.27,00,000లు ఉన్నట్లు చూపారు.
- చరాస్తుల విలువను చూస్తే విజయారెడ్డి పేరుతో 13,4428,603 ఉండగా భర్త పేరుతో రూ. 10,66,22,629, కుమారుడు పేరుతో రూ. 48,78,323, కుమార్తె పేరుతో రూ. 1016,671 ఉన్నాయి.

పిసరంత బంగారం లేని చింతల రామచంద్రారెడ్డి

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా చింతల రామచంద్రారెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన తన ఆస్తులు, అప్పులు, కేసులు ఇతర వివరాలను అఫిడవిట్లో జతపర్చారు. ఇందులో భాగంగా చింతల రామచంద్రారెడ్డి చేతిలో ప్రస్తుతం రూ. 25 వేలు ఉండగా ఆయ భార్య ఉమామహేశ్వరి చేతిలో రూ. 10 వేల నగదు ఉన్నట్లు చూపారు. తన పేరుతో రెండు కార్లు, ఒక ట్రాక్టర్ ఉన్నట్లు చూపారు. అతనిపై మొత్తం నాలుగు కేసులు నమోదై ఉన్నాయి. ఇందులో ఒకటి సైఫాబాద్ పోలీస్ స్టేషన్లో ఉండగా, మరొకటి మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో, డీఎంఈడీ కింద మరో కేసు, జీహెచ్ఎంసీ ముఖ్య కార్యాలయం ముందు ధర్నా సందర్భంగా అయిన కేసు నమోదై ఉన్నాయి. చింతల రామచంద్రారెడ్డికిగానీ, అతని కుమారుడు ఖగేంద్ర రామానుజరెడ్డి పేరుతోగాని పిసరంత బంగారం లేదని చూపారు. అదే సమయంలో అతని భార్యకు రూ. 80 లక్షల విలువైన 800ల గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నట్లు చూపారు. ఆయన తీసుకున్న రుణాలు 8.43,86,5454 ఉండగా, అతని భార్య పేరుతో రూ. 63,08,697 ఉన్నాయి.

- స్థిరాస్థుల విలువను చూస్తే చింతల రాచంద్రారెడ్డి పేరుతో రూ. 12,64,61,487, అతని భార్య పేరుతో 1,84,00,548, కుమారుడి పేరుతో రూ. 13.01.373 చూపారు.
- చరాస్థుల విలువను చూస్తే అతని పేరుతో రూ. 8,43,86,544, భార్య పేరుతో రూ. 2,22,06,892 ఉన్నాయి.



తల్లి ఆశీర్వాదం తీసుకుంటున్న ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
143	48
64,832	19,395

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	13,651	△	5
డోజోన్స్	34,083	▽	29
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,456	△	54
డాక్స్	15,223	△	71
షాంఘై	3,053	△	1
నికాయ్	32,647	△	480

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,830
బంగారం (99.5 స్వచ్ఛత)	56,980
వెండి (కిలో)	70,300

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.51	84.18
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	100.58	103.20
€	యూరో	ఎస్‌బీఐ	87.74	90.78
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.40	55.96
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.85	56.06
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.11	61.34
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.88	21.35
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.78	23.57
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.31	12.38

ఇక కెనరా బ్యాంక్ వంతు...

5 బేసిస్ పాయింట్ల వడ్డీరేటు పెంపు

న్యూఢిల్లీ: నిధుల సమీకరణ వ్యయ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్‌ఆర్)ను ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్ – ఐదు బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) పెంచింది. ఇటీవలే ప్రైవేటు రంగ దిగ్గజం– హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఇదే స్థాయిలో కొన్ని కాలపరిమితులపై ఎంసీఎల్‌ఆర్‌ను పెంచిన సంగతి తెలిసిందే. అయితే కెనరా బ్యాంక్ మాత్రం అన్ని కాలపరిమితులపై రుణ రేటును పెంచింది. దీనితో ఎంసీఎల్‌ఆర్‌కు అనుసంధానమైన అన్ని రుణాలపై వడ్డీరేట్లు పెరగనున్నాయి. పెంచిన రేట్లు ఈ నెల 12వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. కెనరా బ్యాంక్ తాజా రెగ్యులేటరీ ఫైలింగ్ ప్రకారం – సాధారణంగా ఆటో, వ్యక్తిగత, గృహ రుణాలకు ప్రాతిపదికన అయిన ఏడాది ఎంసీఎల్‌ఆర్ 8.70 శాతం నుంచి 8.75%కి చేరింది. ఓవర్‌నైట్, నెల, మూడు నెలలు, ఆరు నెలల ఎంసీఎల్‌ఆర్ రేట్లు కూడా 5 బేసిస్ పాయింట్ల చొప్పున పెరిగాయి.

హెచ్‌ఏఎల్‌తో ఎయిర్‌బస్ జట్టు



న్యూఢిల్లీ: దేశీయంగా విమానాల మెయింటెనెన్స్, రిపేర్, ఓవరాలింగ్ (ఎంఆర్‌వో) రంగాన్ని మరింత పటిష్టం చేసే దిశగా హిందుస్తాన్ ఏరోనాటిక్స్ (హెచ్‌ఏఎల్)తో ఎయిర్‌బస్ జట్టు కట్టింది. కమర్షియల్ విమానాల సర్వీసుల విభాగంలోకి ప్రవేశించేందుకు హెచ్‌ఏఎల్‌కు ఈ ఒప్పందం తోడ్పడనుంది. భారత్‌ను సమగ్ర ఎంఆర్‌వో హబ్‌గా తీర్చిదిద్దాలని తాము లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, ఎయిర్‌బస్‌తో తమ నాసిక్ విభాగం ఒప్పందం ఇందులో భాగమేనని హెచ్‌ఏఎల్ సీఈవో (ఎంఐజీ కాంప్లెక్స్) సాకేత్ చతుర్వేది తెలిపారు. ఒప్పందంలో భాగంగా ఏ320 రకం విమానాలకు సంబంధించిన టూల్ ప్యాకేజీని ఎయిర్‌బస్ అందిస్తుంది. అలాగే ఎంఆర్‌వో కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక కన్సల్టింగ్ సర్వీసులు, తమ డిజిటల్ ప్లాట్‌ఫామ్ (ఎయిర్‌బస్ వరల్డ్)కు యాక్సెస్ అందిస్తుంది.

రిలయన్స్, ఇన్ఫీ, టీసీఎస్ షేర్లు పడేశాయ్



19,400 దిగువకు నిఫ్టీ • సెన్సెక్స్ నష్టం 143 పాయింట్లు

ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు 1% పతనంతో సూచీలు గురువారం నష్టాలు చవిచూశాయి. నిఫ్టీ మళ్లీ 19,400 పాయింట్ల దిగువకు చేరింది. మిశ్రమ అంతర్జాతీయ సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్లు వరుస విక్రయాలు ఇందుకు తోడయ్యాయి. ఇంట్రాడేలో 280 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్ చివరికి 143 పాయింట్లు పతనమై 64,832 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 86 పాయింట్ల పరిధిలో కదలాడింది. ఆఖరికి 48 పాయింట్లు నష్టపోయి 19,395 వద్ద నిలిచింది. సూచీలు ఉదయం స్వల్ప లాభాల్లో కదలాడినా, వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. తదుపరి కోలుకున్న ప్రతిసారీ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఎఫ్‌ఎంసీజీ, ఇంధన, మెటల్, ఐటీ, టెక్, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లు నష్టాలు చవిచూశాయి. ఫార్మా, ఆటో, రియల్టీ షేర్లకు స్వల్ప కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ ఇన్వెస్టర్లు 12 రోజూ అమ్మకాలకు పాల్పడుతూ రూ.1,712 కోట్ల విలువైన ఈక్విటీను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,512 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియా, యూరప్ మార్కెట్లు ట్రేడింగ్‌లో అధిక భాగం నష్టాల్లో ట్రేడైనప్పటికీ.. చివరికి స్వల్ప లాభాలతో గట్టెక్కాయి.

- సంస్థాగత కొనుగోలుదారుల(క్యూఐబీ) దన్నుతో అస్క్ ఆటోమేటివ్ ఐపీఓ చివరి రోజు నాటికి 51.14 రెట్ల అధిక స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా కంపెనీ 2.06 కోట్ల షేర్లు జారీ చేయగా 105 కోట్ల బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ కోటా 142.41 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల విభాగం 35.47 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల కోటా 5.70 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి.
- నష్టాల మార్కెట్లోనూ వెల్‌స్పన్ కార్ప్ షేరుకు భారీ డిమాండ్ నెలకొంది. క్యూ2లో నికర అమ్మకాలు 16% పెరగడం ఇందుకు కారణమైంది. బీఎస్‌ఈలో 5% పెరిగి రూ.480 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 9% ర్యాలీ చేసి రూ.496 వద్ద ఏడాది గరిష్టాన్ని అందుకుంది.
- సెప్టెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో శ్రీ రేణుకా షుగర్స్ షేరు 4% నష్టపోయి రూ.50 వద్ద స్థిరపడింది.

2026 నాటికి ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలు

ఆర్చర్ ఏవియేషన్, ఇంటర్‌గ్లోబ్ డీల్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 2026 నాటికల్లా పూర్తి ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీ సర్వీసులను ప్రారంభించనున్నట్లు ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్ తెలిపింది. ఇందుకోసం ఆర్చర్ ఏవియేషన్ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. ఎయిర్ ట్యాక్సీలతో ఢిల్లీలోని కనాట్ ప్లేస్ నుంచి హర్యానాలోని గురుగ్రామ్‌కి 7 నిమిషాల్లో చేరుకోవచ్చని పేర్కొంది. రోడ్డు మార్గంలో 27 కి.మీ. దూరం ఉండే ఈ ప్రయాణానికి సాధారణంగా 60–90 నిమిషాలు పడుతోందని వివరించింది. పట్టణ ప్రాంతాల్లో ఎయిర్ ట్యాక్సీలతో పాటు కార్గో, లాజిస్టిక్స్, ఎమర్జెన్సీ సర్వీసుల కోసం ఎలక్ట్రిక్ విమానాలను వినియోగించే అవకాశాలను కూడా ఇరు సంస్థలు పరిశీలించనున్నట్లు ఇంటర్‌గ్లోబ్ తెలిపింది. ఇండిగో పేరిట ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్ విమానయాన సర్వీసులు అందిస్తోంది. ఎలక్ట్రికల్ వర్టికల్ టేకాఫ్, ల్యాండింగ్ (ఈవీటీవోఎల్) విభాగంలో ఆర్చర్ ఏవియేషన్ కార్యకలాపాలు సాగిస్తోంది.



అరబిందో ఫార్మా లాభం రూ. 752 కోట్లు

- ఆదాయం రూ. 7,219 కోట్లు
- రూ. 3 డివిడెండ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ రంగ దిగ్గజం అరబిందో ఫార్మా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 752 కోట్ల నికర లాభం ప్రకటించింది. గతేడాది ఇదే వ్యవధిలో నమోదైన రూ. 409 కోట్లతో పోలిస్తే లాభం దాదాపు 84 శాతం ఎగిసింది. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 5,739 కోట్ల నుంచి 26 శాతం పెరిగి రూ. 7,219 కోట్లకు చేరింది. రెండో త్రైమాసికంలోనూ భారీగా విక్రయాలు నమోదయ్యాయని, వివిధ మార్కెట్లలో పటిష్టమైన పనితీరు సాధించామని కంపెనీ వైస్ చైర్మన్ కె. నిత్యానంద రెడ్డి తెలిపారు. కొత్తగా మరిన్ని ఉత్పత్తులను ప్రవేశపెట్టనుండగా, కీలక ప్రాజెక్టులు తుది దశల్లో ఉన్నాయని ఆయన చెప్పారు. వీటి దన్నుతో భవిష్యత్‌లోను పటిష్టమైన వృద్ధిని సాధించడం కొనసాగించగలమని పేర్కొన్నారు. రెండో త్రైమాసికంలో ఫార్ములేషన్స్ విభాగం ఆదాయం 29 శాతం పెరిగి రూ. 5,968 కోట్లకు చేరింది. అమెరికా మార్కెట్ సుమారు 36 శాతం ఎగిసి రూ. 3,385 కోట్లుగా నమోదైంది. కన్సాలిడేటెడ్ ఆదాయంలో దీని వాటా 47 శాతంగా ఉంది. సమీక్షాకాలంలో అమెరికాలో అరబిందో ఫార్మా 19 ఉత్పత్తులను ప్రవేశపెట్టింది. యూరప్ మార్కెట్ 17 శాతం పెరిగి రూ. 1,769 కోట్లకు, గ్రోత్ మార్కెట్స్ 25 శాతం పెరిగి రూ. 564 కోట్లకు చేరాయి. పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై కంపెనీ రూ. 300 కోట్లు వెచ్చించింది.

బీఎస్‌ఈలో అరబిందో షేరు 1.50 శాతం పెరిగి రూ. 951 వద్ద ముగిసింది.

ఈక్విటీ ఫండ్స్‌లోకి భారీ పెట్టుబడులు

- అక్టోబర్‌లో రూ.20,000 కోట్లు రాక
- సిప్ రూపంలో రూ.17 వేల కోట్లు



న్యూఢిల్లీ: ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ అక్టోబర్‌లోనూ ఇన్వెస్టర్ల ఆదరణ చూరగొన్నాయి. నికరంగా రూ.20,000 కోట్లను ఆకర్షించాయి. సెప్టెంబర్‌లో వచ్చిన రూ.14,091 కోట్లతో పోలిస్తే 40 శాతానికి పైగా పెరిగాయి. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో నెలవారీగా వచ్చే పెట్టుబడులు రూ.16,928 కోట్ల మైలురాయిని చేరాయి. సిప్ రూపంలో ఒక నెలలో వచ్చిన గరిష్ట స్థాయి పెట్టుబడులు ఇవే కావడం గమనించొచ్చు. అక్టోబర్ నెల గణాంకాలను మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) గురువారం విడుదల చేసింది. అక్టోబర్ నెలలో నాలుగు కొత్త మ్యూచువల్ ఫండ్ పథకాలు నిధుల సమీకరణ కోసం మార్కెట్లోకి రాగా, ఇవి రూ.2,996 కోట్లను సమీకరించాయి.

- స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోకి అత్యధికంగా రూ.4,495 కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయి. గత కొన్ని నెలలుగా స్మాల్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్ పథకాలు పెద్ద మొత్తంలో పెట్టుబడులను ఆకర్షిస్తుండడం గమనించొచ్చు.
- థీమ్యాటిక్ ఫండ్స్ రూ. 3,896 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి.
- వరుసగా ఐదు నెలల పాటు పెట్టుబడులను కోల్పోయిన లార్జ్‌క్యాప్ పథకాల దశ మారింది. ఇవి నికరంగా రూ.724 కోట్లను రాబట్టాయి.
- డెట్ మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లోకి నికరంగా రూ.42,634 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. సెప్టెంబర్‌లో డెట్ విభాగం నుంచి నికరంగా రూ.లక్ష కోట్లు బయటకు వెళ్లడం గమనార్హం.
- డెట్‌లో లిక్విడ్ ఫండ్స్ రూ.32,694 కోట్లను ఆకర్షించాయి. గిల్ట్ ఫండ్స్‌లోకి రూ.2,000 కోట్లు వచ్చాయి.
- గోల్డ్ ఈటీఎఫ్‌లోకి రూ.841 కోట్లు వచ్చాయి.
- అన్ని విభాగాల్లోకి కలిపి అక్టోబర్‌లో రూ.80,528 కోట్లు వచ్చాయి.
- మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ నిర్వహణలోని ఆస్తులు (ఏయూఎం) సెప్టెంబర్ చివరికి ఉన్న రూ. 46.58 లక్షల కోట్ల నుంచి రూ. 46.71 లక్షల కోట్లకు పెరిగాయి.

అదానీ పోర్ట్స్ లాభం ఫ్లాట్

క్యూ2లో రూ. 1,762 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ప్రయివేట్ రంగ దిగ్గజం అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం స్వల్ప వృద్ధితో రూ. 1,762 కోట్లకు చేరింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 1,738 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 5,649 కోట్ల నుంచి రూ. 6,952 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 3,752 కోట్ల నుంచి రూ. 4,477 కోట్లకు పెరిగాయి. నిర్వహణ లాభం(ఇబిటా) 49% ఎగసి రూ. 7,429 కోట్లకు చేరింది. ఈ ఏడాది ప్రథమార్ధం(ఏప్రిల్–సెప్టెంబర్)లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 12,894 కోట్ల ఆదాయం సాధించినట్లు అదానీ పోర్ట్స్ సీఈవో కరణ్ అదానీ తెలిపారు. 203 మిలియన్ మెట్రిక్ టన్నుల(ఎంఎంటీ) కార్గో పరిమాణం నమోదైనట్లు వెల్లడించారు. తొలి ఆరు నెలల్లో 8 పోర్టులు రికార్డ్ కార్గో పరిమాణాన్ని సాధించినట్లు వివరించారు. ఈ జాబితాలో ముంద్రాసహా హజీరా, ఎన్నోర్, ధామ్రా, కృష్ణపట్నం, గంగవరం ఉన్నట్లు పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో అదానీ పోర్ట్స్ షేరు 1.5% నీరసించి రూ. 806 వద్ద ముగిసింది.

అశోక్ లేలాండ్ లాభం హైస్పీడ్

క్యూ2లో రూ. 561 కోట్లు




న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ఆటో రంగ దిగ్గజం అశోక్ లేలాండ్ ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం దాదాపు మూడు రెట్లు ఎగసి రూ. 561 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 199 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 8,266 కోట్ల నుంచి రూ. 9,638 కోట్లకు జంప్ చేసింది. భారీ, మధ్యతరహా వాణిజ్య వాహన దేశీ విక్రయాలు 18 శాతం వృద్ధితో 29,947 యూనిట్లకు చేరాయి. తేలికపాటి వాణిజ్య వాహన అమ్మకాలు మాత్రం 17,040 యూనిట్ల నుంచి 16,998 యూనిట్లకు స్వల్పంగా తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో అశోక్ లేలాండ్ షేరు 1.7% బలహీనపడి రూ. 171 వద్ద ముగిసింది.

రౌండప్

సీమ థర్మల్ విద్యుత్ కేంద్రానికి 'ఎంవీఆర్' పేరు

దివంగత కార్మిక నేత డాక్టర్ ఎంవీ రమణారెడ్డి సేవలకు గుర్తింపు



సాక్షి, అమరావతి/ఎర్రగుంట్ల(వైఎస్సార్ జిల్లా: రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్(ఆర్టీపీపీ) పేరును డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంటుగా పేరు మారుస్తూ ఏపీ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులిచ్చింది. కార్మిక నేతగా, ఎమ్మెల్యేగా, రచయితగా రాయలసీమ ప్రాంత అభివృద్ధికి కృషి చేసిన దివంగత నేత డాక్టర్ ఎంవీ రమణారెడ్డి(ఎంవీఆర్) సేవలకు గుర్తింపుగా, రాయలసీమ ప్రాంత నేతల విజ్ఞప్తి మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు. వారి ఆమోదంతో వైఎస్సార్ జిల్లా కలమల్లలోని 1650 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల ఆర్టీపీపీ పేరును డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంటుగా మార్చుతూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పేరు మార్పు తక్షణమే అమల్లోకొస్తుందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మూడు థర్మల్ ప్లాంట్లకు ముగ్గురి పేర్లు


ఏపీలో మూడు థర్మల్ పవర్ ప్లాంట్లుండగా, వేర్వేరు రంగాలకు చెందిన వారి పేర్లు వాటికి సార్థక నామధేయాలుగా మారాయి. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ప్లాంట్‌కు మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రమని పేరు పెట్టారు. ఇబ్రహీంపట్నంలోని పవర్ ప్లాంటుకు విద్యుత్ రంగ పితామహుడుగా పేరు పొందిన డాక్టర్ నార్ల తాతారావు పేరు పెట్టారు. తాజాగా ఆర్టీపీపీని కార్మిక నేత ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంటుగా ప్రభుత్వం మార్చింది.

ఎంవీఆర్ కృషితో సీమలో థర్మల్ ప్లాంట్

వెనుకబడ్డ రాయలసీమ ప్రాంతంలో విద్యుత్ సమస్య పరిష్కారం కోసం థర్మల్ విద్యుత్ కర్మాగారం ఏర్పాటు చేయాలని మొట్టమొదట డిమాండ్ చేసిన నేత డాక్టర్ ఎంవీ రమణారెడ్డి. 1985లో 'రాయలసీమ కన్నీటి గాథ' అనే పుస్తకం ద్వారా ఆయన రాయలసీమ సమస్యలను ప్రజల దృష్టికి తెచ్చారు. ఎంవీఆర్ చేసిన డిమాండ్.. ఆర్టీపీపీ స్థాపనకు బాట వేసిందని, ఆ నేతకు నివాళిగా ఆర్టీపీపీ పేరును డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టుగా మార్చాలని రాయలసీమ నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాయలసీమ విమోచన సమితి పేరుతో రమణారెడ్డి, రాయలసీమ సంయుక్త కార్యాచరణ సమితి పేరుతో వైఎస్సార్, మాజీ మంత్రి ఎంవీ మైసూరారెడ్డి, టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి తదితర నేతలంతా అప్పట్లో ఉద్యమం చేపట్టారని సాహితీవేత్త భూమన్ తెలిపారు.

చంద్రబాబుకి దక్కని ఊరట

- ఫైబర్‌నెట్ కేసు విచారణ 30కి వాయిదా
- స్కిల్ కేసులో తీర్పు దీపావళి తర్వాతే నన్న సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: చంద్రబాబుకు సుప్రీంకోర్టులో మరోసారి ఊరట లభించలేదు. ఫైబర్‌నెట్ కేసులో ముందస్తు బెయిలు కోసం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఈనెల 30కి వాయిదా వేసింది. చంద్రబాబు పిటిషన్ గురువారం జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదీలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించబోతుండగా.. జస్టిస్ అనిరుద్ధ బోస్ జోక్యం చేసుకుని స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో ఎఫ్‌ఐఆర్ క్వాష్ చేయాలంటూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పు దీపావళి సెలవుల తర్వాత వెలువడే అవకాశముందని లూథ్రానుద్దేశించి చెప్పారు. ఆ కేసులో తీర్పు వెలువడిన తర్వాతే ఫైబర్‌నెట్ కుంభకోణం కేసు విచారించాల్సి ఉంటుందన్నారు. మరోవైపు.. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకి అక్టోబరు 30న ఏపీ హైకోర్టు నాలుగు వారాల మధ్యంతర బెయిలు ఇచ్చిందని ఏపీ సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఫైబర్‌నెట్ కేసు నవంబరు 23కు వాయిదా వేస్తామని ధర్మాసనం పేర్కొంది. అయితే, మరో తేదీన విచారణ చేపట్టాలని లూథ్రా విజ్ఞప్తి చేశారు. దీంతో నవంబరు 30కు ఫైబర్‌నెట్ కేసు విచారణ వాయిదా వేశారు. అప్పటి వరకూ చంద్రబాబును అరెస్టుచేయకూడదని ఆదేశాలివ్వాలని లూథ్రా కోరారు. దీనిపై ఇప్పటికే ఒప్పందం ఉందిగా అని ఏపీ సీఐడీ తరఫు మరో సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ గుర్తుచేశారు. అనంతరం.. అక్టోబరు 30 వరకూ చంద్రబాబును అరెస్టు చేయరని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అలాగే, 'పిటిషనర్ దాఖలు చేసిన మరో పిటిషన్ ఉంది. దాంట్లో రిజర్వు చేసిన తీర్పు ఇదే ధర్మాసనం ఇవ్వాల్సి ఉంది. రెండింటికీ ముడిపడిన అంశాలున్నాయి. అందువల్ల ఈ కేసు నవంబరు 30కు జాబితా చేయాలని ఆదేశిస్తున్నాం'.. అని ధర్మాసనం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఫైబర్‌నెట్ కేసులో సుప్రీంకోర్టు విచారణ సాగుతుండగా చంద్రబాబును అరెస్టుచేయబోమని ఏపీ సీఐడీ ధర్మాసనానికి ఇప్పటికే చెప్పిన విషయం విదితమే.

ఐటీ దాడులకు బీజేపీకి సంబంధం లేదు

- దీపావళి తరువాత బీజేపీ ప్రచారాన్ని ఉరకలెత్తిస్తాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కేసీఆర్ పాలన తడిబట్టలతో గొంతుకోసేలా తయారైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్‌కు ప్రజలపై కంటే మాఫియాపైనే ఎక్కువ నమ్మకం ఉందని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ దున్నపోతులను తినే రకం అయితే... కాంగ్రెస్ పార్టీ ఏకంగా ఏనుగులను తినే రకం అని విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయంలో బీజేపీ తరపున పోటీచేసే లంకల దీపక్ రెడ్డి (జూబ్లీహిల్స్), నవీన్‌కుమార్ (వికారాబాద్), శ్రీకాంత్‌రెడ్డి (సిద్దిపేట), మొగిలయ్య (నకిరేకల్), పూస రాజు (ముషీరాబాద్)కు బీ–ఫారాలను అందచేసిన సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. దీపావళి తర్వాత ఈనెల 13వ తేదీ నుంచి బీజేపీ ప్రచారాన్ని ఉరకలెత్తిస్తామని చెప్పారు. ఐటీ దాడులు ఎక్కడో చోట జరుగుతూనే ఉంటాయని, వారున్నదే దాడులు చేయడానికని వ్యాఖ్యానించారు. ఆదాయ పన్ను చెల్లించకుండా ఎగ్గొట్టారని సమాచారం వచ్చిన వారిపై దాడులు చేస్తారని, ఆ దాడులకు బీజేపీకి, కేంద్రానికి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. ఐటీ దాడులు జరుగుతాయని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ముందే ఎలా తెలుసని నిలదీశారు. జనంలోకి వెళ్లకుండా, మాట్లాడకుండా కొన్ని సంస్థలు సెల్‌ఫోన్, కంప్యూటర్‌ల ముందు కూర్చుని సర్వే నివేదికలు ఇస్తున్నాయని, అవన్నీ దొంగ సర్వేలని కిషన్‌రెడ్డి కొట్టిపారేశారు. ఈ సర్వేలపై ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

11న మోదీ.. : ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ ఈనెల 11న రాష్ట్రానికి వస్తున్నారని, ఆ తరువాత మరో రెండు మూడు సభల్లో పాల్గొంటారని కిషన్‌రెడ్డి తెలిపారు.

మరో ఏడుగురికి బీజేపీ టికెట్లు!

▶ మొదటి పేజీ తరువాయి

ఈ సీటుకోసం జనసేన ప్రయత్నం చేసింది. కానీ తనకు సంబంధించిన చేవెళ్ల లోక్‌సభ స్థానం పరిధిలోని కీలకమైన సీటు కావడంతో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పట్టుబట్టి రవికుమార్ యాదవ్‌కు ఇప్పించుకున్నారు. ఇక మల్కాజిగిరిలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావుకు.. పెద్దపల్లిలో పార్టీ ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్‌కు టికెట్లు ఇచ్చారు. సంగారెడ్డి నుంచి పులిమామిడి రాజు, నాంపల్లి నుంచి రాహుల్‌చంద్ర, కంటోన్మెంట్ నుంచి రిటైర్డ్ ఐపీఎస్ కృష్ణప్రసాద్‌ల పేర్లు ఖరారైనట్లు తెలిసింది. ఇంకా నర్సంపేట, మధిర, అలంపూర్, దేవరకద్ర, చాంద్రాయణగుట్ట సీట్లకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. చాంద్రాయణగుట్ట అభ్యర్థిగా సత్యనారాయణ ముదిరాజ్ పేరును ఇంతకుముందే ప్రకటించినా.. అనారోగ్య కారణాలతో ఆయన పోటీ నుంచి తప్పుకున్నారు. శుక్రవారం నామినేషన్ల దాఖలుకు చివరితేదీ కావడంతో.. ఈ ఐదు సీట్లకు వెంటనే అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది.

నేడు నామినేషన్లు.. ప్రచార సభల్లో కేంద్రమంత్రులు

శుక్రవారం బీజేపీ అభ్యర్థుల నామినేషన్లు, ప్రచార సభల్లో పలువురు కేంద్ర మంత్రులు పాల్గొననున్నారు. వరంగల్‌లో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, చేవెళ్లలో బీఎల్ఎస్ వర్మ, కొల్లాపూర్‌లో పురుషోత్తం రూపాలా తదితరులు పర్యటించనున్నారు. ఈ నెల 13 నుంచి 27 వరకు జరిగే బీజేపీ ఎన్నికల ప్రచార సభలు, కార్యక్రమాల్లో ప్రధాని మోదీ, అమిత్‌షా, నడ్డాలతోపాటు బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, సీనియర్ నేతలు పాల్గొంటారని బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ తెలిపారు.

టికెట్ ఖరారు సమాచారం అందిన నేతలు

నియోజకవర్గం	అభ్యర్థి
1.మల్కాజిగిరి	రాంచందర్‌రావు
2.మేడ్చల్	విక్రమ్‌రెడ్డి
3.పెద్దపల్లి	దుగ్యాల ప్రదీప్‌రావు
4.శేరిలింగంపల్లి	రవికుమార్ యాదవ్
5.నాంపల్లి	రాహుల్ చంద్ర
6.కంటోన్మెంట్	కృష్ణప్రసాద్
7.సంగారెడ్డి	పులి మామిడి రాజు

దీపావళి నాడు ఫైర్ సిబ్బంది అంతా విధుల్లోనే..

అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: దీపావళి పండుగ రోజున ప్రమాదాల నివారణకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, అనుకోని పరిస్థితుల్లో ఏమైనా జరిగితే వెంటనే స్పందించేలా అగ్నిమాపక శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని ఆ శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి తెలిపారు. పండుగ రోజు అధికారులు, సిబ్బంది తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని ఇప్పటికే ఆదేశాలు జారీచేసినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సిబ్బంది సెలవులను సైతం రద్దు చేశామని పేర్కొన్నారు. ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే వెంటనే 101 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు.

మహేశ్వరం రజాకార్ల రాజ్యమా?: బండి సంజయ్

వలస పక్షులను తరిమికొట్టండి



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ శివారులోని మహేశ్వరంలో రజాకార్ల రాజ్యం నడుస్తుందని అనుకుంటున్నారా అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. ఎంఐఎం అరాచకాలు శ్రుతి మించినా అధికార పార్టీ నోరు మెదపలేదని, మహేశ్వరంలో కట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కూడా పాతబస్తీ ఎంఐఎం కార్యకర్తలకు పంచిపెట్టారని ధ్వజమెత్తారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా అందెల శ్రీరాములు యాదవ్ దాఖలు చేసిన నామినేషన్ కార్యక్రమానికి బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఓ ప్రకటనలో స్థానిక పరిస్థితులపై ధ్వజమెత్తారు. మహేశ్వరంలోని కందుకూర్ మండలంలో ఫార్మా సిటీ కోసం 19వేల ఎకరాలు రైతుల నుంచి లాక్కున్నారని, స్థానికులకు మాత్రం ప్రభుత్వం ఒక్క ఉద్యోగమివ్వలేదని విమర్శించారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి భూకబ్జాలకు, అవినీతి, అక్రమాలకు అంతేలేదని, ధరణి పేరుతో ఆమె తనయుడు భూకబ్జాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఒక పార్టీ టికెట్‌పై గెలిచి ఎంఐఎం మధ్యవర్తిత్వంతో బీఆర్‌ఎస్‌లో చేరి మంత్రి పదవులను అనుభవించడం సిగ్గు చేటన్నారు. మహేశ్వరంలో కాంగ్రెస్ అభ్యర్థి ఓ డమ్మీ అని, మేడ్చల్ నుంచి వలస వచ్చి పోటీ చేస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలిద్దరూ కాంగ్రెస్ నుంచి వచ్చిన వలసపక్షులేనని అన్నారు. వారిని ఎన్నికల్లో ఓడించి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థి శ్రీరాములు యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని మహేశ్వరం ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బీఆర్‌ఎస్, బీజేపీ ఓటమే లక్ష్యం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ

- వామపక్ష ఐక్యతకు గండికొట్టలేదని వెల్లడి..
- రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం రావాలని ఆకాంక్ష



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీని ఓడించడమే తమ లక్ష్యమని, రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం రావాలన్నదే తమ ఆకాంక్ష అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీట్ ది ప్రెస్‌లో చాడ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందనేందుకు ఎన్నికల ముంగిట కాంగ్రెస్ అభ్యర్థులపై జరుగుతున్న ఐటీ దాడులే నిదర్శనమని ఆరోపించారు. ప్రపంచ రికార్డ్ అని చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడు కుంగిపోయిన రికార్డు సాధించిందని ఎద్దేవా చేశారు. ఎన్ని కుయుక్తులు పన్నినా అధికార పార్టీకి ప్రజాతిరుగుబాటు తప్పదని జోస్యం చెప్పారు. కొత్తగూడెం స్థానంలో తమ పార్టీ అభ్యర్థి కూనంనేని సాంబశివరావును ప్రజలు గెలిపిస్తారని చాడ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 24 గంటల నాణ్యమైన కరెంటు అమలు కావడం లేదని విమర్శించారు. ధనిక రాష్ట్రంలో పేదల ఆదాయం ఎందుకు పెరగడం లేదని, వారు ఇంకా ప్రభుత్వం పైన ఆధారపడాల్సిన పరిస్థితులు ఎందుకొచ్చాయని ప్రభుత్వాన్ని నిలదీశారు.

కేసీఆర్ మాట తప్పారు..

గతంలో బీజేపీకి మద్దతిచ్చిన మాట వాస్తవమేనని, ఇప్పుడు ఆ పార్టీకి దూరంగా ఉంటామంటూ సీఎం కేసీఆర్ మునుగోడు ఉపఎన్నిక ముందు తమతో చెప్పారని చాడ గుర్తుచేశారు. కానీ ఆ తర్వాత ఆయన మాట తప్పారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడాలని, భూమి సమస్యలు పరిష్కారానికి నోచుకోవాలని చాడ ఆకాంక్షించారు.

వై.ఎస్. హయాం నాటి ఎల్లంపల్లి చెక్కుచెదరలేదు

సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల రీడిజైనింగ్ పేరుతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ కట్టిన మూడేళ్లకే దెబ్బతిన్నదని చాడ విమర్శించారు. కానీ ఉమ్మడి రాష్ట్రంలో నాటి సీఎం వై.ఎస్. రాజశేఖరరెడ్డి మేడిగడ్డకు సమీపంలో శ్రీకారం చుట్టిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నేటికీ చెక్కుచెదరలేదని చాడ ఈ సందర్భంగా గుర్తుచేశారు.

తప్పని పరిస్థితుల్లోనే కాంగ్రెస్‌తో ముందుకు...

సీట్ల విషయంలో కాంగ్రెస్, సీపీఎం మధ్య అవగాహన కుదరలేదని, కాబట్టి వామపక్షాలుగా కలసి పోటీ చేయలేకపోతున్నామని చాడ ఓ ప్రశ్నకు బదులిచ్చారు. తామేమీ వామపక్ష ఐక్యతకు గండికొట్టలేదని.. 2018లోనూ సీపీఐ, సీపీఎం వేర్వేరుగానే ఎన్నికలకు వెళ్లాయని గుర్తుచేశారు. తమతో అవగాహనలో భాగంగా కాంగ్రెస్ ఒక్క సీటే కేటాయించడంపట్ల సంతృప్తి లేకున్నా అప్రజాస్వామిక, నియంతృత్వ బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు తప్పని పరిస్థితుల్లోనే ఆ పార్టీతో ఎన్నికల అవగాహనతో ముందుకెళ్తున్నామని చాడ వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పొత్తులు అనివార్యమయ్యాయని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీయే ఎన్డీఏ పేరుతో 36 పార్టీలతో పొత్తు పెట్టుకుందని చాడ గుర్తుచేశారు.

ఫ్యాషన్





పట్టుబట్టలతోనే కాదు మనవైన సంప్రదాయ దుస్తులతోనూ వెలిగిపోవచ్చు.
మోడ్రన్ షేర్వాణీలను ధోతీ ప్యాంట్లతో మ్యాచ్ చేయచ్చు.
పర్యావరణ అనుకూలమైన డ్రెస్సులను ఎంచుకోవచ్చు.
పాత కాలం నాటి ప్రింట్లు, హ్యాండ్‌మేడ్ డిజైన్స్‌కి ప్రాధాన్యం ఇవ్వచ్చు.
ఎవర్‌గ్రీన్ లుక్‌తో రాబోయే రోజులను
ప్రకాశవంతంగా మార్చడానికి ఈ దీపావళి నుంచే మొదలుపెట్టవచ్చు.
పండగ రోజున దీపాలనే కాదు
సరికొత్త ట్రెండ్‌తో వార్డ్ రోబ్‌లను కూడా వెలిగించవచ్చు.
ప్రతి వేడుకలోనూ మెరిసిపోవచ్చు.

వార్డ్ రోబ్‌లకూ వెలుగులు



నియో–సంప్రదాయం

పాతకాలం నాటి కుర్తాలు, షేర్వాణీలు ఇప్పుడు కొత్తగా రూపాంతరం చెందాయి. ఈ దీపావళికి ఇవి ఎంతో అందంగా ఉంటాయి. అలాగే, లేయర్డ్ షేర్వాణీలు, ధోతీ ప్యాంట్‌లను ధరించవచ్చు. వీటిని మోడర్న్ డిజైన్, ఓల్డ్ ట్రెడిషన్‌తో మిళితం చేయచ్చు. ఈ మిక్స్ అండ్ మ్యాచ్ వల్ల సొగసైన రూపాన్ని పొందవచ్చు. ఇక నియాన్ కలర్స్ ఇప్పుడు ట్రెండ్‌లో ఉన్నాయి. వీటిలో బ్లూ, రెడ్, గ్రీన్, ఎల్లో కలర్స్ చాలా ప్రకాశవంతంగా ఉంటాయి. ఇవి సాధారణ రంగుల నుండి కాంతివంతంగా కనిపిస్తాయి.

పర్యావరణ అనుకూలం

సరైన అవగాహనతో ఫ్యాషన్ పర్యావరణ అనుకూల బట్టల వైపు మొగ్గు చూపుతోంది. సేంద్రియ పత్తి, వెదురు, జనపనార బట్టలు స్థిరంగా ఉండటమే కాకుండా మట్టి సొబగులను కూడా వెదజల్లుతాయి. సురయ్యా, ఇతర ప్రముఖ బ్రాండ్‌లు ఈ ట్రెండ్‌లో ముందంజలో ఉన్నాయి,



పేస్టల్స్ పెరుగుదల

దీపావళి ప్రకాశవంతమైన రంగులకు పర్యాయపదంగా ఉన్నప్పటికీ, లావెండర్, మింట్, బేబీ పింక్ పేస్టెల్ కలర్స్ పండుగ కళను పెంచుతాయి. ఈ రంగులు ప్రశాంతతతోపాటు రిచ్‌నెస్‌ను కళ్లకు కడతాయి.

డిజిటల్ ప్రింట్లు సాంప్రదాయ మూలాంశాలు

సాంకేతికత మన జీవితంలోని ప్రతి రంగాన్నీ ప్రభావితం చేస్తున్నప్పుడు ఫ్యాషన్‌ను మాత్రం ఎందుకు వదిలివేయాలి... అందుకే, లోటస్ లేదా పీకాక్ ఫెదర్స్‌తో కూడిన భారతీయ సంప్రదాయ మూలాంశాలను ప్రదర్శించే డిజిటల్ ప్రింట్లు గొప్పగా కనిపిస్తున్నాయి. ఈ ప్రింట్లు, డిజైన్లు సంప్రదాయానికి ఆధునిక టచ్‌ను అందిస్తున్నాయి.

పాతకాలపు డిజైన్ల పునరుద్ధరణ

బనారసీ సిల్క్, చికంకారి ఎంబ్రాయిడరీ, బంధని వంటి పాతకాలపు వస్త్రాల ఆకర్షణ మళ్లీ మళ్లీ ఆకట్టుకుంటుంది. డిజైనర్లు ఈ సంప్రదాయ వస్త్రాలను ఆధునిక దుస్తులలో డిజైన్ చేస్తున్నారు. మనదైన గొప్ప వారసత్వాన్ని దేశీయ కళాకారులు కాపాడుతున్నారు.

చేతితో తయారు చేసిన పాదరక్షలు

పాదరక్షల్లో మన దేశీయ హస్తకళా నైపుణ్యం తనదైన ముద్ర వేస్తోంది. జూతీలు, కొల్హాపురీ, ఎంబ్రాయిడరీ ఇతర అలంకారాలతో చేతితో తయారు చేసిన పాదరక్షలలో దేనిని ఎంపిక చేసుకున్నా పండగ కళ కనిపిస్తుంది. ఇవి కళాకారుల నైపుణ్యానికి నిదర్శనంగా ఉండటమే కాకుండా, వేడుకలో ప్రత్యేకమైన టచ్‌ను అందిస్తాయి.





సమాజానికి మంచి ఆహారాన్నివ్వాలనుకుంది.
ఖాద్యమ్... పేరుతో తినదగిన ఆహారాన్నిస్తోంది.
'వరల్డ్ ఫుడ్ ఇండియా'లోనూ నిరూపించుకుంది.
దేశ రక్షణ కోసం కొండల్లో గుట్టల్లో డ్యూటీ చేసే
సైన్యానికి మంచి ఆహారాన్నిచ్చే బాధ్యత చేపట్టింది.
ఈ సందర్భంగా కట్టెకోల మాధవి విజయగాథ.

జై జవాన్‌కు టిఫిన్ బాక్స్

రక్షణరంగంలో విధులు నిర్వర్తించే వారి ఆహారం ఎలా ఉండాలో నిర్దేశించడానికి డీఎఫ్ఆర్ఎల్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం పని చేస్తూ ఉంటుంది. ఆ ప్రమాణాల మేరకు ఆహారం తయారు చేయడానికి అనుమతి సాధించారు ఓ తెలుగు మహిళ. ఈ అనుమతి సాధించడానికి ముందు ఆమె ఆహారం మీద అంతులేని పరిశోధన చేశారు. భూమిలో నాటే గింజ నుంచి పంట దిగుబడి, దినుసులను ప్రాసెస్ చేయడం, వండి చల్లార్చి డబ్బాల్లో ప్యాక్ చేయడం వరకు ప్రతిదీ ఒక చేతి మీదుగా నడిచినప్పుడే నిర్దేశించిన ప్రమాణాలను పాటించగలమని నమ్ముతారామె. సేంద్రియ పంట, వంటను ఈ నెల న్యూఢిల్లీలో జరిగిన 'వరల్డ్ ఫుడ్ ఇండియా' సదస్సులో ప్రదర్శించి మరోసారి నిరూపించారు. ఈ సందర్భంగా సాక్షితో తన అనుభవాలను పంచుకున్నారు హైదరాబాద్‌లో నివసిస్తున్న కట్టెకోల మాధవి.

రైతులు విచిత్రంగా చూశారు!

మాది సూర్యాపేట. నాన్న ఉద్యోగ రీత్యా నా చదువు మొత్తం హైదరాబాద్‌లోనే. నిజానికి నా చదువుకి, నేనెంచుకున్న ఈ రంగానికి సంబంధమే లేదు. బీఎస్సీ స్టాటిస్టిక్స్ చేసి కొంత కాలం టీచర్‌గా, ఆ తర్వాత బ్యాంకులో ఉద్యోగం చేశాను. మా వారు మైక్రో బయాలజీ చేసి హిమాలయ సంస్థలో ఉద్యోగం చేశారు. నెలలో ఇరవై రోజులు క్యాంపుల ఉద్యోగం ఆయనది. జీవితం ఇది కాదనిపించేది. మన జ్ఞానాన్ని సరిగ్గా ఒకదారిలో పెడితే గొప్ప లక్ష్యాలను సాధించవచ్చనిపించింది. సొంతంగా ఏదో ఒకటి చేయాలనే నిర్ణయానికి 2009లో వచ్చాం. నాలుగేళ్లపాటు సమాజం అవసరాలేమిటి, అందుబాటులో ఉన్న వనరులేమిటి అని అధ్యయనం చేశాం. సమాజంలో ఆరోగ్యకరమైన ఆహారం తప్ప అన్నీ ఉన్నాయని తెలిసింది. మేము 2014లో గ్రామాలకు వెళ్లి రైతులతో కొర్రలు పండిస్తారా అని అడిగినప్పుడు మమ్మల్ని వెర్రివాళ్లను చూసినట్లు చూశారు. కుగ్రామాలకు వెళ్లి మహిళలకు మా ఉద్దేశాన్ని వివరించాం. విత్తనాల నుంచి పంటకు అవసరమైన ఇన్‌పుట్స్ అన్నీ మేమే ఇస్తాం, మీరు పండించిన పంటను మేమే కొంటాం... అని భరోసా ఇచ్చాం. దాంతోపాటు వారు పండించే కంది పంట మధ్య చాళ్లలో చిరుధాన్యాలను పండించమని సూచించాం. ఒక కందిపంట సమయంలో చిరుధాన్యాలు మూడు పంటలు వస్తాయి. తమకు నష్టం ఏమీ ఉండదనే నమ్మకంతోపాటు మామీద విశ్వాసం కలిగిన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, రాజస్థాన్, సిక్కిం రాష్ట్రాల్లో మొత్తం 1350 మంది మహిళారైతులు మాతో కలిశారు. గ్రౌండ్ వర్క్ చేసిన తర్వాత 2018లో కంపెనీ ఖాద్యమ్‌ని రిజిస్టర్ చేశాం. ఖాద్యమ్ అనే సంస్కృత పదానికి అర్థం తినదగినది అని. పంట నుంచి మా ప్రయోగాలు వంటకు విస్తరించాయి.

వండి చల్లబరుస్తాం!

ఇడ్లీ, సాంబార్, చట్నీ వంటి ఆహార పదార్థాలు యంత్రాల్లోనే తయారవుతాయి. ఉడికిన వెంటనే మైనస్ నలభై డిగ్రీల ఉష్ణోగ్రతకు తీసుకువెళ్లడంతో వాటిలో ఉండే తేమ హరించుకుపోతుంది. ఇలా తయారైన ఆహారం ప్యాకెట్లలో తొమ్మిది నెలల పాటు నిల్వ ఉంటుంది. వేడినీటిలో ముంచితే ఐదు నిమిషాల్లో ఇడ్లీ మెత్తగా మారుతుంది, సాంబార్, చట్నీలు కూడా అంతే. మేము కనుగొన్న విజయవంతమైన ఫార్ములా ఇది. పోహా నుంచి స్పగెట్టీ, పాస్తా వరకు ఒక ఇంట్లో అన్ని తరాల వారూ ఇష్టపడే రుచులన్నింటినీ ఇలాగే చేస్తున్నాం. మొదట్లో రెడీ టూ కుక్ ఉత్పత్తుల మీద దృష్టి పెట్టాం. రోజూ వండి బాక్సు పట్టుకెళ్లడం కుదరని రోజుల్లో రెడీ టూ ఈట్ విధానాన్ని అనుసరించాం. ఆఫీస్‌కి టిఫిన్ బాక్స్ తేలిగ్గా తీసుకెళ్లడానికి, ప్రయాణాల్లో తీసుకెళ్లడానికి మా ఉత్పత్తులు చాలా అనువుగా ఉంటాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే సైన్యం అవసరాలకు తగినట్లు ఆహారాన్ని తయారు చేయడం పెద్ద సవాల్ అనే చెప్పాలి. మైసూర్‌లో ఉన్న డీఎఫ్ఆర్ఎల్‌కి ఎన్నిసార్లు వెళ్లామో లెక్క పెట్టలేం. యాభైసార్లకు పైగా వెళ్లి ఉంటాం. విమాన టిక్కెట్ల ఖర్చే లక్షల్లో వచ్చింది. సైంటిస్టులు సూచించిన నియమావళి ప్రకారం తయారు చేయడం, శాంపుల్ తీసుకెళ్లి చూపించడం, వాళ్లు చెప్పిన సవరణలను రాసుకుని హైదరాబాద్ రావడం, మేడ్చల్ దగ్గర బండ మాదారంలో ఉన్న మా యూనిట్‌లో తయారు చేసి మళ్లీ పట్టుకెళ్లడం... ఇలా సాగింది. మా ప్రయోగాల గురించిన ప్రతి వివరాన్నీ నోట్స్ సమర్పించాం. జీవితంలో ఓ గొప్ప లక్ష్యాన్ని సాధించాలనుకున్నాం, ఆ ప్రయాణంలో మేము లక్ష్యాన్ని చేరేలోపు ఉద్యోగంలో సంపాదించుకున్న డబ్బు రెండు కోట్లకు పైగా ఖర్చయిపోయింది. ఏ దశలోనూ వెనుకడుగు వేయకుండా దీక్షగా ముందుకెళ్లడమే ఈ రోజు విజేతగా నిలిపింది. ఏ– ఐడియా వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ఆర్థికంగానూ, మౌలిక వసతుల కల్పనలోనూ సహకరిస్తున్నాయి. మా ఉత్పత్తులు ఈ–కామర్స్ వేదికల మీద పన్నెండు దేశాలకు చేరుతున్నాయి. ఢిల్లీలో ఈ నెల మూడు నుంచి ఐదు వరకు 'వరల్డ్ ఫుడ్ ఇండియా' సదస్సు జరిగింది. అందులో స్టాల్ పెట్టమని ప్రభుత్వం నుంచి ఆహ్వానం రావడమే ఈ ప్రయత్నంలో మేము గెలిచామని చెప్పడానికి ఉదాహరణ'' అని వివరించారు ఖాద్యమ్ కో ఫౌండర్ మాధవి.

వరల్డ్ ఫుడ్ ఇండియా సదస్సులో...



డీఎఫ్ఆర్ఎల్... డిఫెన్స్ ఫుడ్ రీసెర్చ్ లాబొరేటరీ. కర్నాటక రాష్ట్రం మైసూర్‌లో ఉన్న ఈ సంస్థ డీఆర్‌డీవో (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్)లో ఒక విభాగం. రక్షణ రంగంలో విధులు నిర్వర్తించే వారికి నిల్వ ఉండే ఆహారాన్ని సరఫరా చేస్తుంది. పర్వత ప్రాంతాలు, లోయలు, గడ్డకట్టే మంచులో ఉండే ఆర్మీ క్యాంపుల్లో విధులు నిర్వర్తించేవారికి తాజా ఆహారాన్ని అందించడం కొన్ని సందర్భాల్లో సాధ్యం కాదు. అలాంటి సమయాల్లో వారి ఆకలి తీర్చేది... ముందుగానే వండి, శీతలపరిచి డబ్బాల్లో నిల్వ చేసిన ఆహారమే. అలా నిల్వ చేసే ఆహారాన్ని తయారు చేయడం అత్యంత క్లిష్టమైన పని. ఆహారం నెలల కొద్దీ నిల్వ ఉండాలి, అందులో పోషకాలు లోపించకూడదు.

– వాకా మంజులారెడ్డి
ఫొటో : నోముల రాజేశ్ రెడ్డి

వంటిల్లు

వెచ్చటి వెలుగుల్లో తియ్యటి ఘుమఘుమలు

ఇల్లంతా దీపాల సందడి, టపాసుల వెలుగుల్లో చిన్నాపెద్దల చిరునవ్వులతో ఒకటే హడావుడి. స్వీట్లు చేయడానికి ఓపిక, సమయం రెండూ ఉండవు. అయినా పండగపూట మనింట్లో తయారైన తీపి రుచే వేరు. అందుకే సులభంగా చేసుకోదగిన తీపి ఘుమఘుమలతో వచ్చేసింది మనందరి వంటిల్లు....

గుడ్ పారే



కావలసినవి:
మైదా – రెండు కప్పులు; నెయ్యి – పావు కప్పు; పాలు – అరకప్పు; బెల్లం – కప్పు; శొంఠి పొడి – టీస్పూను; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: మైదాపిండిలో నెయ్యివేసి కలపాలి ● తరువాత గోరువెచ్చని పాలుపోసి ముద్దలా కలిపి ఇరవై నిమిషాలు పక్కన పెట్టుకోవాలి ● ఇరవై నిమిషాల తరువాత పిండిముద్దను రెండు భాగాలు చేయాలి ● ఒక్కో భాగాన్నీ మందపాటి చపాతీలా వత్తుకుని అంగుళం పరిమాణంలో ముక్కలు చేయాలి ● మిగతాపిండిని కూడా ఇదే విధంగా చేయాలి ● ఇప్పుడు సలసల కాగుతోన్న నూనెలో ఈ ముక్కలను వేసి మీడియం మంట మీద వేయించాలి. రెండువైపులా గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారితే పారేలు రెడీ అయినట్లే, వెంటనే తీసేయాలి ● బెల్లాన్ని గిన్నెలో వేసి పావుకప్పు నీళ్లుపోసి స్టవ్ మీద పెట్టాలి. మీడియం మంట మీద బెల్లం కరిగి సిరప్‌లా తయారయ్యేంతవరకు మరిగించాలి ● అడుగు అంటకుండా తిప్పుతూనే ఉండాలి. సిరప్ తయారైన తరువాత శొంఠి పొడివేసి కలిపి దించేయాలి ● వేయించి పెట్టుకున్న పారేలను సిరప్‌లో వేసి కలుపుతూనే ఉండాలి. ఇలా కలుపుతూ ఉండగానే మిశ్రమం మొత్తం చల్లబడి గుడ్ పారేలు అతుక్కోకుండా విడివిడిగా వస్తాయి. ఇప్పుడు తీసి ప్లేటులో వేసి సర్వ్‌చేసుకోవాలి ● గాలి చొరబడని డబ్బాలో వేసి ఉంచితే నెలరోజులపాటు నిల్వ ఉంటాయి.

కాజు పిస్తా రోల్స్



కావలసినవి: జీడిపప్పు – ఒకటిన్నర కప్పులు; పిస్తా పప్పు – ఒకటిన్నర కప్పులు; కండెన్స్‌డ్ మిల్క్ – ఒకటింబావు కప్పులు; గ్రీన్ ఫుడ్ కలర్ – ఐదు చుక్కలు; బటర్ – రెండు టేబుల్ స్పూన్లు; పంచదార పొడి – కప్పు; యాలకులపొడి – పావు టీస్పూను;

తయారీ: జీడిపప్పును దోరగా వేయించి, మెత్తగా గ్రైండ్ చేయాలి. ● గ్రైండ్ అయిన తరువాత జల్లెడపట్టి పొడిని తీసుకోవాలి. ●బాణలిలో వెన్న వేసి వేడెక్కనివ్వాలి. కరిగిన బటర్‌లో కండెన్స్‌డ్ మిల్క్ పోయాలి. ● నిమిషం పాటు పాలను కలుపుతూ ఉండాలి. తరువాత జీడిపప్పు పొడి వేయాలి. ● సన్నని మంటమీద తిప్పుతూ ఐదునిమిషాలు వేయించాలి. తరువాత దించేసి చల్లారనివ్వాలి. ●చేతులకు కొద్దిగా నెయ్యి రాసుకుని జీడిపప్పు మిశ్రమాన్ని ముద్దలా కలిపి పెట్టుకోవాలి. ● ఇప్పుడు పిస్తాపప్పుని దోరగా వేయించి మెత్తగా గ్రైండ్ చేయాలి. ● గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని జల్లెడపట్టి మెత్తటి పొడిని తీసుకోవాలి. ● పిస్తా పొడిలో పంచదార పొడి, యాలకుల పొడి, ఫుడ్ కలర్ కొద్దిగా వేడి నీళ్లు చల్లుకుంటూ ముద్దలా కలపాలి. ● ఇప్పుడు జీడిపప్పు ముద్దను రెండు ముద్దలుగా చేసి, ఒక్కో ముద్దను మందపాటి చపాతీలా వత్తుకుని, కాస్త వెడల్పుగా ఉండేలా ముక్కలు కోయాలి. ● పిస్తా ముద్దను చిన్న ఉండలుగా చేసి, వీటిని పొడవాటి రోల్స్‌లా చుట్టుకోవాలి. ● జీడిపప్పు ముక్కపైన పిస్తా రోల్‌ను పెట్టి, జీడిపప్పు ముక్కను రోల్ చేయాలి. ● పిండి ముద్దను మొత్తాన్ని ఇలా రోల్ చేసి, పైన కుంకుమ పువ్వు, సిల్వర్ పేపర్‌తో గార్నిష్ చేస్తే కాజుపిస్తా రోల్స్ రెడీ.

షీర్ పీరా

కావలసినవి: పంచదార – కప్పు; పాలపొడి – రెండు కప్పులు; బాదం పలుకులు – టేబుల్ స్పూను; జీడిపప్పు పలుకులు – టేబుల్ స్పూను; పిస్తా పలుకులు – టేబుల్ స్పూను; కిస్‌మిస్ – టేబుల్ స్పూను; యాలకులు – నాలుగు; నెయ్యి – టేబుల్ స్పూను; గార్నిష్ కోసం.... పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు – టేబుల్ స్పూను (పెద్దసైజువి).

తయారీ: డ్రైఫ్రూట్స్ పలుకులు సన్నగా పొడవుగా ఉండేలా తీసుకోవాలి ● మందపాటి బాణలిలో పంచదార, కప్పు నీళ్లుపోసి మంటమీద పెట్టాలి ● తీగపాకం వచ్చేంత వరకు మరిగించాలి ● తీగపాకం వచ్చినప్పుడు సన్నమంటమీద ఉంచాలి ● ఇప్పుడు పాలపొడిని కొద్దికొద్దిగా వేస్తూ ఉండలు లేకుండా కలుపుతూ ఉండాలి ● పాలపొడి దగ్గర పడేంత వరకు కలుపుతూనే ఉండాలి ● దగ్గర పడుతున్నప్పుడు బాదం, జీడిపప్పు, పిస్తా పలుకులు, కిస్‌మిస్ ముక్కలను వేసి కలపాలి ● చివరిగా యాలకులను పొడిచేసి వేయాలి ● ప్లేటుకును నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని వేయాలి ● ప్లేటంతా సమంగా పరుచుకుని పైన కొద్దిగా పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు చల్లాలి ● స్పూను పెట్టి పైన కూడా సమంగా వత్తుకుని ప్లేటుని రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత నచ్చిన ఆకారంలో ముక్కలు కట్‌చేసి సర్వ్ చేసుకోవాలి.



చిరోటీ



కావలసినవి: మైదా – ఒకటింబావు కప్పులు; సూజీ రవ్వ – కప్పు; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్లు; ఉప్పు – చిటికెడు; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా; పంచదార – అరకప్పు; యాలకులు – మూడు; పిస్తా తురుము గార్నిష్‌కు సరిపడా.

పేస్టుకోసం: బియ్యప్పిండి – రెండు టేబుల్ స్పూన్లు; నెయ్యి – మూడు టేబుల్ స్పూన్లు.

తయారీ: కప్పు మైదా, సూజీరవ్వ, ఉప్పుని ఒక గిన్నెలో వేసి కలిపి పెట్టుకోవాలి ● బాణలిలో నెయ్యి వేసి వేడెక్కనివ్వాలి. కాగిన నెయ్యిలో కలిపి పెట్టుకున్న మైదా మిశ్రమాన్ని వేసి వేయించాలి. ● రెండు నిమిషాల తరువాత నీళ్లు చల్లుకుంటూ పూరీ పిండిలా కలుపుకోవాలి. ● పిండి ముద్ద తయారయ్యాక దానిపై తడిబట్టని కప్పి రెండుగంటలు పక్కన పెట్టుకోవాలి. ● ఇప్పుడు పంచదార, యాలకులను మిక్సీజార్‌లో వేసి మెత్తగా పొడిచేయాలి. ● కరిగించిన నెయ్యిని బియ్యప్పిండిలో వేసి, పేస్టులా కలిపి పెట్టుకోవాలి. ● రెండు గంటల తరువాత పిండి ముద్దను మరోసారి బాగా కలిపి దానిని చిన్నచిన్న ఉండలుగా చేయాలి. ● ఒక్కో ఉండను చపాతీలా వత్తుకోవాలి. ● మూడు చపాతీలు చేసిన తరువాత... ఒకదాని మీద ఒకటి పెట్టి పై చపాతీపైన టీస్పూను బియ్యప్పిండి పేస్టుని రాయాలి. తరువాత కొద్దిగా మైదాను చల్లాలి. ● ఇప్పుడు చపాతీని మడతలు వేయాలి. ఒక్కో మడతకు టీ స్పూను బియ్యప్పిండి పేస్టు, కొద్దిగా మైదాను చల్లుకుంటూ చపాతీ మొత్తాన్ని మడత వేయాలి. ● పూర్తయ్యాక చపాతీ రోల్స్‌ను అంగుళం ముక్కలుగా కట్ చేయాలి ● ఒక్కోముక్కను గుండ్రంగా చేసి పూరీలా వత్తుకోవాలి ● మరీ పలుచగా లేదా మరీ మందంగా కాకుండా ఒక మాదిరిగా వత్తుకుని మధ్యలో చిన్న రంధ్రం చేయాలి ● ఇప్పుడు ఈ చపాతీలను సలసల కాగుతోన్న నూనెలో వేసి మీడియం మంట మీద లేత బంగారు వర్ణంలోకి మారేంత వరకు వేయిస్తే చిరోటీ రెడీ ● చిరోటీలను ఒకదానిమీద ఒకటి పేర్చి, పైన పంచదార పొడి, పిస్తా తురుము చల్లి సర్వ్ చేసుకోవాలి.

క్లుప్తంగా...

మోదీ కనుసన్నల్లో ఈడీ అధికారులకు 'సైడ్ ఇన్‌కమ్'

ఏఐసీసీ మీడియా కమిటీ చైర్మన్ అజయ్



సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ కనుసన్నల్లో దేశవ్యాప్తంగా ఈడీ అధికారులకు సైడ్ ఇన్‌కమ్ వస్తోందని ఏఐసీసీ మీడియా కమిటీ చైర్మన్ అజయ్‌కుమార్ ఆరోపించారు. ఇందుకు రాజస్తానే ఉదాహరణ, అక్కడ దాడులు చేసిన చోట్ల ఈడీ అధికారులు లంచం అడుగుతున్నారని ఆరోపించారు. గాంధీభవన్‌లో గురువారం మీడియాతో మాట్లాడుతూ ఈడీ, ఐటీ బీజేపీ అనుబంధ సంస్థలుగా పనిచేస్తున్నాయని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌ను ఎదుర్కోలేకే బీజేపీ, బీఆర్‌ఎస్ తమ నేతలపై ఐటీ దాడులు చేయిస్తున్నాయన్నారు.

టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్‌గా తీన్మార్ మల్లన్న



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో చేరిన మర్నాడే తీన్మార్ మల్లన్నకు రాష్ట్రస్థాయిలో కీలక పదవి లభించింది. ఆయనను టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్‌గా కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ నియమించారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. తీన్మార్ మల్లన్న నియామక ఉత్తర్వులను గాంధీభవన్ వర్గాలు విడుదల చేశాయి.

కాంగ్రెస్ గ్యారంటీలను నమ్మేదెలా?



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ చేసిన ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌కే గ్యారంటీ లేదని, ఇక ఆ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఎలా నమ్ముతారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 34 సీట్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఊదరగొట్టి మోసం చేసిందని ఆయన ఆరోపించారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌లో భాగంగా ప్రతి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో రెండు అసెంబ్లీ స్థానాల్లో బీసీలకు అవకాశం కల్పిస్తామని హామీ ఇవ్వడాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ రాని పాతబస్తీలోని ఐదు స్థానాలను బీసీలకు కేటాయించి అవమానపరిచారని పేర్కొన్నారు.

గుర్తు ఇవ్వకపోతే నిరాహార దీక్ష: కేఏ పాల్



సాక్షి, న్యూఢిల్లీ: తమ పార్టీకి ఎన్నికల గుర్తు కేటాయించకపోతే నిరాహార దీక్ష చేస్తానని ప్రజాశాంతి వ్యవస్థాపక అధ్యక్షుడు పాల్ కేంద్ర ఎన్నికల సంఘాన్ని హెచ్చరించారు. ప్రజాశాంతి పార్టీ ఎన్నికల గుర్తు విషయంలో ఎన్నికల సంఘం, కేంద్రం ఇబ్బంది పెడుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తే సీఎం కేసీఆర్ ఓడిపోతారనే భయంతోనే గుర్తు రానివ్వకుండా అడ్డుకుంటున్నారనే అనుమానాలున్నాయని పేర్కొన్నారు. ఢిల్లీలో ఈసీ అధికారుల్ని గురువారం కలిసిన పాల్.. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 119 నియోజకవర్గాల్లో పోటీ చేసే తమ పార్టీకి ఇంకా గుర్తు కేటాయించకపోవడం దారుణమన్నారు. హెలికాప్టర్ లేదా ఉంగరం గుర్తులు ఇస్తామని చెప్పి.. నామినేషన్ చివరి తేదీ వచ్చినా కేటాయించకపోవడం కుట్రలో భాగమేనని ఆరోపించారు. తక్షణమే తమకు గుర్తు కేటాయించి, నామినేషన్లకు గడువు రెండు రోజులు పెంచాలని కోరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో విశాఖ ఎంపీగా పోటీ చేస్తానని పాల్ వెల్లడించారు.

ఫింగర్‌ప్రింట్ టెక్నాలజీలో తెలంగాణ సత్తా



సాక్షి, హైదరాబాద్: వేలిముద్రల ఆధారంగా పరిష్కరించిన అత్యుత్తమ కేసులలో జాతీయ స్థాయిలో రెండో స్థానంలో తెలంగాణ ఫింగర్ ప్రింట్ బ్యూరో దర్యాప్తు చేసిన కేసు నిలిచింది. ఢిల్లీలో సోమ, మంగళవారాల్లో నిర్వహించిన ఫింగర్ ప్రింట్ బ్యూరోల డైరెక్టర్ల 24వ సదస్సులో అధికారులు ఈ విషయాన్ని ప్రకటించారు. కేసుల దర్యాప్తులో ఫింగర్‌ప్రింట్ టెక్నాలజీని వాడడంలో తెలంగాణ సీఐడీ విభాగం పనితీరు అత్యుత్తమమని కితాబిచ్చారు. 2020లో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అజయ్ తండా (వి) నేలకొండపల్లి (ఎం) లో దంపతులకు మత్తు మందు కలిపిన ప్రసాదం ఇచ్చి.. ఇంట్లోని నగదు, విలువైన వస్తువులు చోరీ చేసి ప్రాణాలు తీశారు. కేసు దర్యాప్తులో భాగంగా ఫింగర్‌ప్రింట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ బి.నరేశ్ ఎంతో శాస్త్రీయంగా సేకరించిన వేలిముద్రలు.. నిందితుడు యోగిందర్‌ను గుర్తించడంలో కీలకంగా మారాయి. ఈ కేసులో నిందితుడికి కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. కాగా, డీజీపీ అంజనీకుమార్ గురువారం సీఐడీ అదనపు డీజీ మహేశ్ భగవత్ సమక్షంలో ఫింగర్ ప్రింట్ బ్యూరో డైరెక్టర్ తాతారావు, ఇన్‌స్పెక్టర్ బి.నరేశ్‌ను అభినందించారు.

16 నుంచి కాంగ్రెస్ ప్రచార హోరు

ఉధృతంగా రాహుల్, ప్రియాంక ప్రచారం.. షెడ్యూల్ రూపొందిస్తున్న టీపీసీసీ

- వారానికిపైగా రాష్ట్రంలోనే ఉండేలా ప్రణాళిక.. జిల్లాల్లో పర్యటనలు
- రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లతో ప్రజల్లోకి.. సిద్ధూ, గెహ్లోత్, సుక్కు, బఘేల్ కూడా..
- చివరి వారం రోజులు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలూ రంగంలోకి..
- చివరిగా సోనియా గాంధీ సభతో ప్రచార పర్వాన్ని ముగించాలనే యోచన



సాక్షి, హైదరాబాద్: నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగియగానే రాష్ట్రంలో ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్, ప్రియాంకా గాంధీలతోపాటు కీలక నేతలను రంగంలోకి దింపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. వారు వారం రోజుల పాటు ఇక్కడే మకాం వేసి, జిల్లాల్లో విస్తృతంగా పర్యటించేలా షెడ్యూల్ రూపొందిస్తోంది. ఈ నెల 15న నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచార గడువు ముగియనున్న నేపథ్యంలో 16వ తేదీ నుంచి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలనూ ప్రచార బరిలోకి దింపాలని భావిస్తోంది. అయితే భారీ సభలు కాకుండా రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌ల ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించింది.

అన్ని ఉమ్మడి జిల్లాల్లో పర్యటించేలా..

ఈ నెల 16 తర్వాత రాహుల్, ప్రియాంకా గాంధీలతో రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించేలా షెడ్యూల్ తయారవుతోంది. పెద్ద సభలను ఏర్పాటుచేసి ప్రజలను అక్కడికి తీసుకురావడం కంటే ప్రజల వద్దకే వెళ్లేలా కార్యక్రమాలు నిర్వహించేందుకు టీపీసీసీ సిద్ధమైంది. అన్ని కొత్త జిల్లాల్లో ఇద్దరు అగ్రనేతలతో రోడ్‌షోలు చేయించాలని, అక్కడే కార్నర్ మీటింగ్‌ల ద్వారా కాంగ్రెస్ ఎన్నికల గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించింది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు సిద్ధరామయ్య, అశోక్ గెహ్లోత్, సుఖ్వీందర్‌సింగ్ సుక్కు, భూపేశ్ బఘేల్‌లను కూడా ఎన్నికల ప్రచారానికి తీసుకురానుంది. హిమాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ అమలు చేసిన పథకాల గురించి వారు వివరించనున్నట్టు టీపీసీసీ వర్గాలు చెప్తున్నాయి. ఇక కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదంటూ బీఆర్‌ఎస్ చేస్తున్న విమర్శలను తిప్పికొట్టేలా సిద్ధరామయ్య, డీకే శివకుమార్ వంటి నేతలను ప్రచార భాగస్వాములను చేయనుంది. ఈ ప్రచారమంతా పూర్తయ్యాక చివరిగా ఏఐసీసీ అగ్రనేత, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీతో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోగానీ, ఉత్తర తెలంగాణలోని కీలక ప్రాంతంలోగానీ భారీ బహిరంగ సభ నిర్వహించి, పోలింగ్ మూడ్‌లోకి వెళ్లిపోవాలని కాంగ్రెస్ భావిస్తోంది.

నేడు కామారెడ్డిలో బీసీ గర్జన సభ

కాంగ్రెస్ పార్టీ శుక్రవారం కామారెడ్డిలో బీసీ గర్జన సభ నిర్వహించనుంది. నామినేషన్ల దాఖలుకు చివరిరోజు కావడంతో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నారు. ఆ కార్యక్రమం ముగిశాక బీసీ గర్జన సభ నిర్వహించనున్నారు. దీనిలో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించనున్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ సభలో పాల్గొంటున్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఆయన స్పష్టమైన ప్రకటన చేస్తారని.. బీఆర్‌ఎస్ ఆరోపణలకు తగిన విధంగా బదులిస్తారని టీపీసీసీ వర్గాలు చెప్తున్నాయి.

తెలంగాణ ప్రజలు మాతోనే...



ఏఐసీసీ నేత కె.సి.వేణుగోపాల్

- రాష్ట్రంలో 70 స్థానాల్లో గెలవబోతున్నాం.. గాంధీభవన్‌లో ఎన్నికల వార్‌రూం పరిశీలన.. పరిశీలకులతో జూమ్ మీటింగ్
- తాజ్‌కృష్ణలో ఠాక్రే, బోసురాజు, ఇన్‌చార్జి కార్యదర్శులతో సమీక్ష

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజలు తమతోనే ఉన్నారని, అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి, పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలోని పార్టీ నేతలంతా ఒక్కటిగా పనిచేస్తున్నారని, ఎలాంటి గ్రూపులు లేవని స్పష్టం చేశారు. కర్ణాటక స్ఫూర్తితో తెలంగాణలోనూ విజయం సాధించి తీరుతామని ఆయన అన్నారు. రాష్ట్రంలో పార్టీ పరిస్థితి, ఎన్నికల వ్యూహాలపై చర్చించేందుకు గురువారం ఆయన హైదరాబాద్‌కు వచ్చారు. మధ్యాహ్నం ఆయన తాజ్‌కృష్ణ హోటల్‌లో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, కర్ణాటక మంత్రి బోసురాజుతో పాటు తెలంగాణ ఇన్‌చార్జి కార్యదర్శులు విష్ణునాథ్, రోహిత్‌చౌదరి, మన్సూర్ అలీఖాన్‌లతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రచార సరళి, అభ్యర్థుల ఎంపిక అనంతర పరిణామాలపై వేణుగోపాల్ వారితో దాదాపు రెండు గంటలకు పైగా చర్చించారు. సాయంత్రం 4 గంటల సమయంలో తాజ్‌కృష్ణ నుంచి గాంధీభవన్‌కు వచ్చిన వేణుగోపాల్ నేరుగా ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన వార్‌రూంకు వెళ్లారు. ఈ సందర్భంగా వార్‌రూం పనితీరును పరిశీలించిన ఆయన అక్కడి నుంచే పార్టీ లోక్‌సభ, అసెంబ్లీ పరిశీలకులు, పార్టీ ముఖ్య నేతలతో జూమ్ ద్వారా సమావేశమయ్యారు. క్షేత్ర స్థాయిలోని పరిస్థితులు, ఆరుగ్యారంటీల ప్రకటన తర్వాత ప్రజల నుంచి వస్తున్న స్పందన, ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాలపై వారితో చర్చించిన అనంతరం రాత్రి 8 గంటల సమయంలో మళ్లీ తాజ్‌కృష్ణకు వెళ్లారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 70 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలవబోతోందని చెప్పారు.

వెంగళరావు తర్వాత మళ్లీ నేనే: భట్టి



- ఖమ్మం జిల్లాకు మరో చాన్స్ రానుందని వ్యాఖ్య

మధిర/సాక్షి, హైదరాబాద్: ఖమ్మం జిల్లాకు చెందిన దివంగత మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావుకు వచ్చిన అవకాశం, మళ్లీ తనకు దక్కనుందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ మధిర అభ్యర్థిగా గురువారం ఆయన నామినేషన్ సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో భట్టి మాట్లాడుతూ నెల రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతుందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మధిర దశదిశ నిర్దేశించేదిగా ఉండాలని అన్నారు. ఖమ్మం జిల్లా బిడ్డ జలగం వెంగళరావు ఉమ్మడి రాష్ట్ర సీఎంగా అనేక పరిశ్రమలు జిల్లాకు సాధించారని గుర్తు చేశారు. మళ్లీ అలాంటి అవకాశం జిల్లాకు రానున్నందున అన్నిరంగాల్లో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి జలగం వెంగళరావుకు మాత్రమే సీఎల్పీ నేతగా అవకాశం లభించగా, మళ్లీ ప్రజల ఆశీస్సులతో తాను ఆ పదవి చేపట్టానని చెప్పారు. రాష్ట్ర సంపద ప్రజలకు చెందకుండా అడ్డుపడిన దోపిడీదారుడు, దుర్మార్గుడైన కేసీఆర్‌ను ఇంటికి పంపిస్తేనే తెలంగాణకు మెరుగైన భవిష్యత్ ఉంటుందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని భట్టి స్పష్టం చేశారు. కేసీఆర్‌కు గజ్వేల్‌లో ప్రజల అసంతృప్తి సెగ తాకడంతో కామారెడ్డికి పారిపోయారని ఎద్దేవా చేశారు. వంద మంది కౌరవుల మాదిరి, శాసనసభలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో.. పాండవుల్లా ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పోరాడానని భట్టి తెలపారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ మంత్రి అవినాశ్ వజహార్ ఇతర నేతలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ చెప్తుంటే బీజేపీ ఐటీ దాడులు..

కాంగ్రెస్ నేతలు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుల ఇళ్లపై ఐటీ అధికారులు ఉద్దేశపూర్వకంగా దాడులు చేయడం సరైంది కాదని, ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నానని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఓటమి భయంతోనే బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాలు కుమ్మక్కై కాంగ్రెస్ అభ్యర్థుల ఇళ్లపై దాడులు చేస్తున్నాయని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలహీనపరిచే కుట్రకు పాల్పడుతున్నాయని గురువారం ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు. బీఆర్‌ఎస్ చెపుతుంటే బీజేపీ ఈ దాడులు చేయిస్తోందని, ఐటీ దాడులతో కాంగ్రెస్ అభ్యర్థులను భయపెట్టాలని చూడటం అవివేకమేనని భట్టి అభిప్రాయపడ్డారు.

ఆ బ్యారేజీలకు ప్రమాదం పొంచి ఉంది

- కాళేశ్వరం ప్రాజెక్టుపై సమావేశంలో నీటిపారుదల రంగ నిపుణుడు బీవీ సుబ్బారావు వెల్లడి..
- వరద ఉధృతంగా ఉండే ప్రాంతాల్లో నిర్మించడంతోనే సమస్య

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా గోదావరిపై నిర్మించిన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలకు భవిష్యత్తులోనూ ప్రమాదాలు పొంచి ఉన్నాయని నీటి పారుదల రంగ నిపుణుడు బీవీ సుబ్బారావు హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం మంచి ఆశయంతో ఎత్తిపోతల పథకాల నిర్మాణం చేపట్టినా.. ఆచరించిన మార్గాలు సరిగ్గా లేకనే సమస్యలు వస్తున్నాయని చెప్పారు. ప్లానింగ్, డిజైన్లు, నాణ్యతా లోపాలకుతోడు చుట్టుపక్కల ప్రాంతాల్లో జరుగుతున్న బొగ్గు తవ్వకాల ప్రభావంతోనూ మేడిగడ్డ బ్యారేజీ కుంగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'జాయింట్ యాక్షన్ ఫర్ వాటర్' సంస్థ ఆధ్వర్యంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై నిర్వహించిన సమావేశంలో బీవీ సుబ్బారావు మాట్లాడారు. భవిష్యత్తులో విపత్తుల నివారణ కోసం మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలపై నిపుణులతో శాస్త్రీయ అధ్యయనాలు నిర్వహించాలన్నారు.

వరద వేగంగా వచ్చే చోట కట్టడంతో..

బ్యారేజీల నిర్మాణానికి ముందు సరైన ప్లానింగ్, అధ్యయనాలు (ప్రీ–ప్రాజెక్ట్ అసెస్‌మెంట్) జరగలేదని బీవీ సుబ్బారావు ఆరోపించారు. ప్రాణహిత నది నుంచి ఎక్కువ వేగంతో వరద దూసుకొచ్చే ప్రాంతాల్లో బ్యారేజీలు నిర్మించడం వల్ల.. వాటి పునాదుల కింది నుంచి ఇసుక కొట్టుకుపోతోందని, భవిష్యత్తులో బ్యారేజీలు సైతం కొట్టుకుపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బ్యారేజీలు కట్టిన ప్రాంతాల్లో భూకంపాలు సంభవించేందుకు ఆస్కారం ఉందని జియో టెక్నికల్ నివేదికలు పేర్కొంటున్నాయన్నారు. బ్యారేజీల వైఫల్యాలపై విమర్శలు, ప్రతి విమర్శలతో చర్చను దారిమళ్లించకుండా పరిష్కార మార్గాలను కనుక్కోవాల్సి ఉందని పేర్కొన్నారు. ఇక బ్యారేజీల వైఫల్యంపై న్యాయ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పబ్లిక్ పాలసీ నిపుణుడు దొంతి నరసింహారెడ్డి కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన సమాచారాన్ని నీటిపారుదల శాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని రాష్ట్ర మాజీ సమాచార కమిషనర్ ఆర్.దిలీప్‌రెడ్డి ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు వాస్తవాలను వెల్లడించాలని కోరారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఆంజనేయగౌడ్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, కర్నె ప్రభాకర్

మళ్లీ బీఆర్‌ఎస్‌దే విజయం

"దారి చూపిన దశాబ్ది" వ్యాసాల సంకలనం ఆవిష్కరణలో మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎన్ని పొర్లు దండాలు పెట్టినా...అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీ రామారావు ధీమా వ్యక్తం చేశారు. ప్రగతిభవన్‌లో గురువారం రాష్ట్ర క్రీడా ప్రాధికార మండలి అధ్యక్షుడు డాక్టర్ ఆంజనేయగౌడ్ వ్యాసాల సంకలనం 'దారి చూపిన దశాబ్ది' పుస్తకాన్ని కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఢిల్లీ పెద్దలు, పరాయి రాష్ట్ర గద్దల చేతిలో ఇక్కడి కాంగ్రెస్, బీజేపీ నాయకులు పావులుగా మారారని వ్యాఖ్యానించారు. సాగు, సంక్షేమ, పారిశ్రామిక రంగాల్లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అమలు చేసిన విధానాలు అద్భుతమైన ఫలితాలనిచ్చాయని తెలిపారు. తన వ్యాసాల ద్వారా తెలంగాణ రాష్ట్ర పురోగతిని ఎత్తిచూపడంతో పాటు, బీజేపీ, కాంగ్రెస్‌ల అమానవీయ రాజకీయనైజాన్ని బహిర్గతం చేస్తున్న ఆంజనేయ గౌడ్ కృషి ప్రశంసనీయమన్నారు. అనంతరం ఆంజనేయ గౌడ్ సారథ్యంలో పాలమూరు గాయకుడు రేలారే ప్రసాద్ రచించి, ఆలాపించిన 'గుండెకత్తుకుందమా..గులాబీ జెండాను' పాటను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ మైనారిటీ డిక్లరేషన్‌ను విడుదల చేస్తున్న సల్మాన్ ఖుర్షీద్, రేవంత్. చిత్రంలో అజహరుద్దీన్, షబ్బీర్ అలీ తదితరులు

అధికారంలోకొస్తే ప్రత్యేక మైనారిటీ సబ్‌ప్లాన్

▶ మొదటి పేజీ తరువాయి

విడుదల చేశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ అధికార బీఆర్‌ఎస్ మెప్పు కోసం క్రికెట్ దిగ్గజం అజహరుద్దీన్‌ను జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓడించేందుకు మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ బాధ్యత తీసుకున్నాడని ఆరోపించారు. గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో పోటీ చేయని మజ్లిస్ ఈసారి అజహరుద్దీన్‌పై ముస్లిం అభ్యర్థిని పోటీకి దింపడం వెనుక మైనారిటీ ఓట్లు చీల్చే కుట్ర కనిపిస్తోందని దుయ్యబట్టారు. అలాగే మైనారిటీ పక్షపాతినని చెప్పుకొనే సీఎం కేసీఆర్ తమ పార్టీ నేత షబ్బీర్ అలీ పోటీ చేసే కామారెడ్డి స్థానం నుంచి కూడా పోటీ చేయడమేమిటని ప్రశ్నించారు. కేసీఆర్‌కు దమ్ముంటే గోషామహల్‌లో పోటీ చేసి బీజేపీ అభ్యర్థి రాజాసింగ్‌పై గెలవాలని రేవంత్ సవాల్ చేశారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే మైనారిటీ డిక్లరేషన్‌లోని హామీల అమలు బాధ్యత తీసుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్ అలీఖాన్, వర్కింగ్ ప్రెసిడెంట్ అజహరుద్దీన్, సీనియర్ ఉపాధ్యక్షుడు జాఫర్ జవీద్, కాంగ్రెస్ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు సునీతా రావ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మైనారిటీ డిక్లరేషన్‌లోని హామీలు...

- ➤ మైనారిటీ సంక్షేమ బడ్జెట్‌ను రూ. 4,000 కోట్లకు పెంచడంతోపాటు నిరుద్యోగ మైనారిటీ యువత, మహిళలకు సబ్సిడీ రుణాలు అందించడానికి ఏటా రూ.1,000 కోట్ల కేటాయింపు.
- ➤ 6 నెలల్లోగా కులగణన చేపట్టి విద్య, ఉద్యోగాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మైనారిటీలు సహా అన్ని వెనుకబడిన తరగతులకు న్యాయమైన రిజర్వేషన్లు ఉండేలా చర్యలు.
- ➤ అబ్దుల్ కలాం తౌఫా–ఎ–తలీమ్ పథకం కింద ఎంఫిల్ పూర్తి చేస్తున్న ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, ఇతర మైనారిటీ యువతకు రూ. 5 లక్షల ఆర్థిక సాయం. పీహెచ్‌డీ, అదనంగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తయిన వారికి రూ. లక్ష, గ్రాడ్యుయేషన్‌కు రూ. 25,000, ఇంటర్‌కు రూ.15,000, 10వ తరగతి పాసైన వారికి రూ. 10,000 ఆర్థిక చేయూత.
- ➤ తెలంగాణ సిక్కు మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు.
- ➤ మైనారిటీ సంస్థల్లో ఖాళీల భర్తీ, ఉర్దూ మీడియం ఉపాధ్యాయుల భర్తీకి ప్రత్యేక డీఎస్సీ.
- ➤ మసీదుల ఇమామ్‌లు, మౌజమ్‌లు, దర్గాల ఖాదీమ్‌లు, చర్చి పాస్టర్లులకు నెలకు రూ. 10,000 నుంచి 12,000 వరకు గౌరవ వేతనం
- ➤ వక్ఫ్ బోర్డు పరిరక్షణ, ఆక్రమణకు గురైన ఆస్తుల స్వాధీనం, ఆస్తుల రికార్డుల డిజిటలైజేషన్. ముస్లిం, క్రిస్టియన్ శ్మశానవాటికల కోసం భూకేటాయింపు.
- ➤ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లులేని మైనారిటీ కుటుంబాలందరికీ ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు.
- ➤ కొత్తగా పెళ్లయిన ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు ఇతర మైనారిటీ జంటలకు రూ. 1,60,000 ఆర్థిక చేయూత.
- ➤ కులీ కుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం సెట్విన్‌ల బలోపేతం.

నన్ను జైలుకు పంపింది దయాకరే

- చెన్నూరు డ్యాం నిర్మాణంలో రూ.350 కోట్లు దోచుకున్నాడు
- ప్రభుత్వ ఆస్తుల అమ్మకంతో కేసీఆర్ పాలన.. ఉచిత కరెంటు ఘనత వైఎస్‌ఆర్‌దే
- పాలకుర్తి సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

జనగామ: శత్రువులతో దోస్తీ చేస్తూ, నమ్ముకున్నోళ్లను నట్టేట ముంచడంలో మంత్రి దయాకర్‌రావు దిట్ట అని టీపీసీసీ అధ్యక్షుడు అనుముల రేవంత్‌రెడ్డి విమర్శించారు. తాను జైలుకు వెళ్లడంలో ప్రధాన కుట్రదారుడు ఇతనేనని ధ్వజమెత్తారు. జనగామ జిల్లా పాలకుర్తిలో నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినిరెడ్డి నామినేషన్ సందర్భంగా గురువారం నిర్వహించిన బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. చెన్నూరు రిజర్వాయర్ నిర్మాణం కోసం రూ.360కోట్ల బడ్జెట్ కేటాయిస్తే, దయాకర్ రూ.700 కోట్లకు పెంచి, ఇందులో రూ.350 కోట్లు జేబులో వేసుకున్నాడని ఆరోపించారు. ఆరు దశాబ్దాలపాటు ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాంగ్రెస్ పరిపాలిస్తే, ప్రత్యేక తెలంగాణ సాధన పేరిట అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ ప్రభుత్వ ఆస్తుల అమ్మకంతో పాలన చేస్తున్నాడని నిందించారు. రాజ్యసభ సీట్లను కేసీఆర్ రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్లకు అమ్ముకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంటు ఉండదని చెబుతున్న కల్వకుంట్ల ఫ్యామిలీ మాటలను ప్రజలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్ పాలనలో 24 గంటల కరెంట్ ఇస్తున్నారని నిరూపిస్తే పాలకుర్తిలో యశస్వినిరెడ్డితో పాటు కొడంగల్‌లో తాను కూడా నామినేషన్ వేయనని రేవంత్ సవాల్ విసిరారు. 2004లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకార సమయంలో ఉచిత కరెంటు, రూ.900 కోట్ల కరెంటు బకాయిల మాఫీ ఫైల్‌పై మొదటి సంతకం చేసిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు.

రేవంత్ రాజకీయ జీవితమే లోపభూయిష్టం

మంత్రి దయాకర్‌రావు ధ్వజం



పాలకుర్తి: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై మంత్రి, బీఆర్‌ఎస్ పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజమెత్తారు. ఆయన జీవితమే లోపభూయిష్టమని, అడ్వర్టైజ్‌మెంట్ పోస్టర్లు వేసుకునే వారని, డబ్బున్న అమ్మాయిని బురిడీకొట్టించి రేవంత్ పెళ్లి చేసుకున్నారని ఆరోపించారు. జనగామ జిల్లా పాలకుర్తిలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలకుర్తిలో జరిగిన సభలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. ఆ సభలో రేవంత్ తన నిజస్వరూపాన్ని మరోసారి బయటపెట్టుకున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడు గంటల కరెంట్ చాలన్న రేవంత్‌కు సిగ్గుందా అని నిలదీశారు.

పొంగులేటి ఇళ్లు, కార్యాలయాలపై ఐటీ దాడులు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం/సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో–చైర్మన్, ఆ పార్టీ పాలేరు అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన ఇళ్లు, కార్యాలయాలపై గురువారం ఆదాయపన్ను (ఐటీ) అధికారులు ఏకకాలంలో దాడులు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నివాసాలతోపాటు హైదరాబాద్‌లోని నివాసాలు, కార్యాలయాలు, ఆయన బంధువులు, ఉద్యోగుల ఇళ్లకు చెందిన 30కిపైగా ప్రాంతాల్లో ఈ తనిఖీలు జరిగాయి. తెల్లవారుజామున 5 గంటలకే హైదరాబాద్, ఖమ్మంలోని పొంగులేటి నివాసాలకు సీఆర్పీఎఫ్ బలగాలతో కలసి ఐటీ అధికారులు చేరుకున్నారు. ఆ సమయంలో పొంగులేటి, ఆయన కుటుంబ సభ్యులు ఖమ్మంలోని నివాసంలో ఉండగా అధికారులు వారందరి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పలు కంపెనీల ఆర్థిక లావాదేవీలు, పన్ను చెల్లింపుల వివరాలను సేకరించారు. సాయంత్రం 6 గంటల వరకు సోదాలు కొనసాగాయి. అధికారులు పలు బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలు సేకరించడంతోపాటు ఆఫీసుల్లోని కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అనంతరం ఖమ్మం నుంచి పొంగులేటి సతీమణి మాధురి, కుమారుడు హర్షారెడ్డి, సోదరుడు ప్రసాద్‌రెడ్డిని అధికారులు వాహనాల్లో హైదరాబాద్ తీసుకెళ్లారు.



ఐటీ అధికారుల తనిఖీ సందర్భంగా పొంగులేటి ఇంటి ముందు పోలీసు బందోబస్తు

బయటకు పంపేందుకు తొలుత నిరాకరణ...

ఐటీ దాడుల విషయం తెలుసుకున్న అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు ఖమ్మంలోని ఆయన నివాసానికి చేరుకొని పొంగులేటికి మద్దతుగా నినాదాలు చేశారు. అదే సమయంలో నామినేషన్ వేసేందుకు పొంగులేటి బయటకు వెళ్లాలనుకున్నా అధికారులు తొలుత అనుమతించలేదు. దీంతో ఆయన ఎన్నికల అధికారికి లేఖ పంపగా ఆ తర్వాత నామినేషన్ వేసేందుకు అనుమతించారు. అనంతరం ఆయన భారీ ర్యాలీగా ఖమ్మం రూరల్ తహసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి ఆఫీసుకు వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తదితరులు ఉన్నారు. తనపై ఐటీ దాడులు జరగొచ్చంటూ పొంగులేటి బుధవారం మీడియాతో మాట్లాడుతూ అనుమానం వ్యక్తం చేసిన కొన్ని గంటల వ్యవధిలోనే... అది కూడా ఆయన నామినేషన్ వేసేందుకు సిద్ధమైన రోజే ఐటీ దాడులు జరగడం గమనార్హం.

సోదాలు జరిగిన ప్రాంతాలివే...

హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 17లోని నివాసంతోపాటు నందగిరిహిల్స్ వంశీరామ్‌జ్యోతి హిల్ రిడ్జ్‌లోని ఫ్లాట్, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లోని రాఘవ ప్రైడ్, బేగంపేటలోని ఆఫీసులు, ఖమ్మంలోని ఆయన నివాసం, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కార్యాలయం, బంధువుల ఇళ్లు, ఖమ్మం రూరల్ మండలంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయం, కల్లూరు మండలం నారాయణపురంలోని ఆయన నివాసంలో ఐటీ అధికారుల తనిఖీలు జరిగాయి.

నీలం స్థానంలో కాట..

▶ మొదటి పేజీ తరువాయి

అధిష్టానం మొగ్గుచూపింది. బీఆర్‌ఎస్ నుంచి ఇటీవల కాంగ్రెస్ కండువా కప్పుకున్న నీలం మధు ముదిరాజ్‌కు మూడో జాబితాలో పటాన్‌చెరు టికెట్ కేటాయించినప్పటికీ బీఫామ్ ఇవ్వని అధిష్టానం.. తాజాగా మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ అనుచరుడైన శ్రీనివాస్‌గౌడ్‌కు టికెట్ కేటాయించింది. దీంతో దామోదర పట్టుబట్టి తన పంతం నెగ్గించుకున్నట్లయింది. అలాగే సూర్యాపేట స్థానం నుంచి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పటేల్ రమేశ్‌రెడ్డి మధ్య పెద్ద ఎత్తున పోటీ నెలకొనగా అధిష్టానం మాత్రం దామోదర్‌రెడ్డినే అభ్యర్థిగా ఎంపిక చేసింది. మరోవైపు తుంగతుర్తి అభ్యర్థిగా అనూహ్యంగా గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల శామ్యూల్ టికెట్ దక్కించుకున్నారు. మాదిగ, మాల కుల సమీకరణల్లో భాగంగానే అధిష్టానం శామ్యూల్‌ను ఎంపిక చేసిందనే చర్చ జరుగుతోంది. అలాగే పొత్తులో భాగంగా సీపీఎం కోరిన మిర్యాలగూడ టికెట్ ఎట్టకేలకు బలమైన నాయకుడు బత్తుల లక్ష్మారెడ్డికే దక్కింది. దీంతో అక్కడి కాంగ్రెస్ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నాయి. చార్మినార్ టికెట్‌ను స్థానిక నేత మహ్మద్ ముజీబ్ ఉల్లాహ్ షరీఫ్‌కు పార్టీ కేటాయించింది. గురువారం విడుదల చేసిన నాలుగో జాబితాతో కలిపి మొత్తం 118 స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించినట్లయింది. పొత్తులో భాగంగా కొత్తగూడెం స్థానాన్ని సీపీఐకి కేటాయించడం తెలిసిందే.



భారత జూనియర్ మహిళల హాకీ జట్టు కెప్టెన్‌గా ప్రీతి

ఈనెల 29 నుంచి డిసెంబర్ 10 వరకు చిలీలో జరిగే జూనియర్ మహిళల ప్రపంచకప్ హాకీ టోర్నీలో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. 18 మంది సభ్యులతో కూడిన భారత జట్టుకు హరియాణాకు చెందిన ప్రీతి కెప్టెన్‌గా వ్యవహరించనుంది. భారత జట్టు: ప్రీతి (కెప్టెన్), రుతుజా (వైస్ కెప్టెన్), ఖుష్బూ, మాధురి కిండో (గోల్‌కీపర్లు), నీలమ్, జ్యోతి, రోష్ని కుమారి, మహిమా టెటె, మంజూ చోర్సియా, జ్యోతి ఛత్రి, హీనా బానో, సుజాత కుజుర్, సాక్షి రాణా, ముంతాజ్ ఖాన్, అన్ను, దీపిక సోరెంగ్, మోనిక టొప్పో, సునెలితా. రిజర్వ్: నిరూపమా దేవి, ఈదుల జ్యోతి.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో మనిక బత్రా

అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య మహిళల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ మనిక బత్రా కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకుంది. తాజా ర్యాంకింగ్స్‌లో మనిక మూడు స్థానాలు ఎగబాకి 31వ స్థానానికి చేరుకుంది. ఈ ఏడాది మనిక దోహా డబ్ల్యూటీటీ కంటెండర్ టోర్నీలో సెమీఫైనల్‌కు, ఆసియా క్రీడల్లో క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. జాతీయ చాంపియన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ 82వ ర్యాంక్‌లో ఉంది.



జ్యోతి సురేఖకు స్వర్ణం, రజతం

ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్



బ్యాంకాక్: ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ రెండు పతకాలు గెలిచింది. గురువారం ముగిసిన ఈ టోర్నీలో విజయవాడకు చెందిన 27 ఏళ్ల జ్యోతి సురేఖ మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో రజతం, టీమ్ విభాగంలో స్వర్ణం సాధించింది. వ్యక్తిగత విభాగం ఫైనల్లో జ్యోతి సురేఖ 145–145 (8/9) 'షూట్ ఆఫ్'లో భారత్‌కే చెందిన పర్ణీత్ కౌర్ చేతిలో ఓడిపోయింది. నిర్ణీత 15 బాణాల తర్వాత ఇద్దరి స్కోర్లు సమంగా నిలిచాయి. విజేతను నిర్ణయించేందు ఇద్దరికి ఒక్కో షాట్ అవకాశం ఇచ్చారు. జ్యోతి సురేఖ బాణం 8 పాయింట్ల వృత్తంలోకి వెళ్లగా... పంజాబ్‌కు చెందిన 18 ఏళ్ల పర్ణీత్ కౌర్ 9 పాయింట్ల షాట్‌తో తొలి అంతర్జాతీయ వ్యక్తిగత స్వర్ణ పతకం సొంతం చేసుకుంది. జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్ణీత్ కౌర్‌లతో కూడిన భారత బృందం కాంపౌండ్ టీమ్ ఫైనల్లో 234–233తో చైనీస్ తైపీని ఓడించి పసిడి పతకాన్ని దక్కించుకుంది. ఇప్పటి వరకు ఏడుసార్లు ఆసియా చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న జ్యోతి సురేఖ ఓవరాల్‌గా 5 స్వర్ణాలు, 5 రజతాలు, 2 కాంస్య పతకాలు సాధించింది. మరోవైపు కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో అదితి–ప్రియాంశ్ జోడీ 156–151తో కనోక్‌నాపుస్–నవాయుత్ (థాయ్‌లాండ్) జంటను ఓడించి స్వర్ణ పతకాన్ని గెల్చుకుంది. పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగం కాంస్య పతక మ్యాచ్‌లో అభిషేక్ వర్మ 147–146తో జూ జేహూన్ (దక్షిణ కొరియా)ను ఓడించాడు.

మెగ్ లానింగ్ గుడ్‌బై

- అంతర్జాతీయ మహిళల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఆస్ట్రేలియా స్టార్
- ఏడు ప్రపంచకప్ టైటిల్స్‌లో భాగస్వామి



మెల్‌బోర్న్: మహిళల క్రికెట్‌కే మకుటం లేని మహారాణి మెగ్ లానింగ్. ఆటతో, సారథ్య నైపుణ్యంతో ఆస్ట్రేలియా జట్టుకు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించిన ఈ విజయవంతమైన సారథి, 13 ఏళ్ల ఫలప్రదమైన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. ఆస్ట్రేలియా అమ్మాయిల క్రికెట్లో ఎవర్‌గ్రీన్ 'మెగాస్టార్'గా కెప్టెన్ లానింగ్‌కు పెట్టింది పేరు. 31 ఏళ్ల వన్నె తగ్గని ఈ క్రికెటర్ తన ప్రతిభా పాటవాలతో ఏకంగా ఏడు ప్రపంచకప్‌లలో భాగమైంది. ఇందులో ఐదు టైటిల్స్ ఆమె కెప్టెన్సీలోనే వచ్చాయి. గతేడాది లానింగ్ సారథ్యంలో ఆసీస్ మహిళల జట్టు కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణ పతకాన్ని గెలిచింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికా ఆతిథ్యమిచ్చిన టి20 ప్రపంచకప్‌లో జట్టును విజేతగా నిలిపాక మళ్లీ ఆమె బరిలోకి దిగలేదు. ఆరోగ్య సమస్యలతో ఇంగ్లండ్, వెస్టిండీస్ పర్యటనకు దూరంగా ఉంది.

ఇలా అరంగేట్రం: జన్మతః సింగపూర్ అమ్మాయి అయిన మెగ్... న్యూజిలాండ్‌తో 2010లో జరిగిన టి20తో అంతర్జాతీయ అరంగేట్రం చేసింది. కెరీర్‌లో ఆఖరి మ్యాచ్ కూడా ఈ ఫార్మాట్‌లోనే ఆడింది.

అలా సంచలనం: పిన్న వయసు (21 ఏళ్లు)లోనే కెప్టెన్ అయిన 'ఆసీస్ యంగెస్ట్ క్రికెటర్'. ఒకే ఒక్క వన్డే సిరీస్‌లో అత్యధిక పరుగులు (1232) చేసిన కెప్టెన్‌గా ఘనత. టి20ల్లో అత్యధికంగా వంద మ్యాచ్‌ల్లో సారథ్యం వహించిన తొలి కెప్టెన్‌గానూ రికార్డు. మెగ్ లానింగ్ మొత్తం 179 మ్యాచ్‌ల్లో కెప్టెన్‌గా వ్యవహరించగా, ఆమె కెప్టెన్సీలో ఆసీస్ జట్టు 146 మ్యాచ్‌ల్లో గెలిచింది.

'కప్'ల కహాని: రెండు వన్డే వరల్డ్‌కప్‌లు (2013, 2022), ఐదు టి20 ప్రపంచకప్ (2012, 2014, 2018, 2020, 2023)లలో విజయవంతమైన కెప్టెన్‌గా, బ్యాటర్‌గా నిరూపించుకుంది. లానింగ్ సారథ్యంలో ఆసీస్ 2022 వన్డే వరల్డ్‌కప్‌లో, 2014, 2018, 2020, 2023 టి20 వరల్డ్‌కప్‌లో విజేతగా నిలిచింది.

బ్యాటింగ్‌లో సునామీ: న్యూజిలాండ్‌తో జరిగిన వన్డేలో కేవలం 45 బంతుల్లోనే వేగవంతమైన సెంచరీ సాధించిన ఆసీస్ క్రికెటర్‌గా రికార్డు.

కెరీర్ ప్రొఫైల్: ఆరు టెస్టులు ఆడి 345 పరుగులు, 103 వన్డేల్లో 4602 పరుగులు సాధించింది. ఇందులో 15 సెంచరీలు, 21 ఫిఫ్టీలున్నాయి. 132 టి20ల్లో 3405 పరుగులు చేసింది. 2 శతకాలు, 15 అర్ధసెంచరీలున్నాయి. ఓవరాల్‌గా 241 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో కలిపి లానింగ్ 8,352 పరుగులు చేసింది.

కివీస్‌కు సెమీస్ పిలుపు!

- న్యూజిలాండ్‌కు సెమీస్ బెర్త్ లాంఛనం
- శ్రీలంకపై 5 వికెట్లతో గెలుపు
- పాకిస్తాన్ ఆశలు గల్లంతు!

గత ప్రపంచకప్ రన్నరప్ న్యూజిలాండ్ కీలక సమరంలో తమ సత్తా చాటింది. టోర్నీలో వరుసగా నాలుగు విజయాల తర్వాత నాలుగు పరాజయాలతో తమ పరిస్థితిని క్లిష్టంగా మార్చుకున్న కివీస్ ఆఖరి ఆటలో స్థాయికి తగ్గ ప్రదర్శనను కనబర్చి దాదాపు సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. చివరి మ్యాచ్‌లో శ్రీలంకను చిత్తు చేసిన ఆ జట్టు మరే జట్టుపై ఆధారపడకుండా తమ సెమీస్ అవకాశాలను తానే సృష్టించుకుంది. కివీస్ గెలుపుతో పాకిస్తాన్ సెమీస్ ఆశలు చేజారాయి. సాంకేతికంగా, అంకెల ప్రకారం పాక్ పూర్తిగా, అధికారికంగా నిష్క్రమించకపోయినా... అసాధ్యమైన, ఊహకు కూడా అందని తరహాలో ఆ జట్టు తర్వాతి మ్యాచ్‌లో గెలవాల్సిన నేపథ్యంలో వాస్తవికంగా చూస్తే పాక్ ఆట ముగిసినట్లే!



బెంగళూరు: పదునైన బౌలింగ్, ఆపై దూకుడైన బ్యాటింగ్‌తో న్యూజిలాండ్ వరల్డ్‌కప్ లీగ్ దశను ఘనంగా ముగించింది. సెమీస్ అవకాశాలు నిలిచి ఉండాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో చెలరేగిన ఆ జట్టు తమ లక్ష్యాన్ని నిర్విఘ్నంగా పూర్తి చేసింది. గురువారం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఐదు వికెట్ల తేడాతో శ్రీలంకను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లంక 46.4 ఓవర్లలో 171 పరుగులకే ఆలౌటైంది. కుశాల్ పెరీరా (28 బంతుల్లో 51; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించాడు. 10 ఓవర్లలోపే 70/5 స్కోరుతో కుప్పకూలేందుకు సిద్ధమైన లంక... చివర్లో మహీశ్ తీక్షణ (91 బంతుల్లో 38 నాటౌట్; 3 ఫోర్లు) రాణించడంతో ఈ మాత్రం స్కోరైనా సాధించగలిగింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ట్రెంట్ బౌల్ట్ (3/37)తో పాటు ఇతర కివీస్ బౌలర్లూ సత్తా చాటి ప్రత్యర్థిని పడగొట్టారు. అనంతరం న్యూజిలాండ్ 23.2 ఓవర్లలో 5 వికెట్లకు 172 పరుగులు సాధించింది. కాన్వే (42 బంతుల్లో 45; 9 ఫోర్లు), రచిన్ రవీంద్ర (34 బంతుల్లో 42; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 74 బంతుల్లోనే 86 పరుగులు జోడించి విజయానికి పునాది వేయగా, మిచెల్ (31 బంతుల్లో 43; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఫలితంతో న్యూజిలాండ్ సెమీస్‌కు చేర డం దాదాపుగా ఖాయం కాగా... కివీస్ ఓటమిపై ఆశలు పెట్టుకున్న పాక్, అఫ్గానిస్తాన్‌కు నిరాశ తప్పలేదు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) లాథమ్ (బి) సౌతీ 2; పెరీరా (సి) సాన్‌ట్నర్ (బి) ఫెర్గూసన్ 51; మెండిస్ (సి) రచిన్ (బి) బౌల్ట్ 6; సమరవిక్రమ (సి) మిచెల్ (బి) బౌల్ట్ 1; అసలంక (ఎల్బీ) (బి) బౌల్ట్ 8; మాథ్యూస్ (సి) మిచెల్ (బి) సాన్‌ట్నర్ 16; ధనంజయ (సి) మిచెల్ (బి) సాన్‌ట్నర్ 19; కరుణరత్నే (సి) లాథమ్ (బి) ఫెర్గూసన్ 6; తీక్షణ (నాటౌట్) 38; చమీర (సి) బౌల్ట్ (బి) రచిన్ 1; మదుషంక (సి) లాథమ్ (బి) రచిన్ 19; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (46.4 ఓవర్లలో ఆలౌట్) 171. వికెట్ల పతనం:** 1–3, 2–30, 3–32, 4–70, 5–70, 6–104, 7–105, 8–113, 9–128, 10–171. **బౌలింగ్:** బౌల్ట్ 10–3–37–3, సౌతీ 8–0–52–1, ఫెర్గూసన్ 10–2–35–2, సాన్‌ట్నర్ 10–2–22–2, రచిన్ 7.4–0–21–2, ఫిలిప్స్ 1–0–3–0.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) ధనంజయ (బి) చమీర 45; రచిన్ (సి) ధనంజయ (బి) తీక్షణ 42; విలియమ్సన్ (బి) మాథ్యూస్ 14; మిచెల్ (సి) అసలంక (బి) మాథ్యూస్ 43; చాప్‌మన్ (రనౌట్) 7; ఫిలిప్స్ (నాటౌట్) 17; లాథమ్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (23.2 ఓవర్లలో 5 వికెట్లకు) 172. వికెట్ల పతనం:** 1–86, 2–88, 3–130, 4–145, 5–162. **బౌలింగ్:** మదుషంక 6.2–0–58–0, తీక్షణ 7–0–43–1, ధనంజయ 2–0–22–0, చమీర 4–1–20–1, మాథ్యూస్ 4–0–29–2.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	8	6	2	12	0.861
న్యూజిలాండ్	9	5	4	10	0.743
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	8	4	4	8	-0.338
ఇంగ్లండ్	8	2	6	4	-0.885
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	9	2	7	4	-1.419
నెదర్లాండ్స్	8	2	6	4	-1.635

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే.-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

దక్షిణాఫ్రికా × అఫ్గానిస్తాన్

వేదిక: అహ్మదాబాద్

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

287 పరుగుల తేడాతో గెలిస్తేనే పాక్ ముందుకు...

అక్షరాలా 287 పరుగులు... శనివారం ఇంగ్లండ్‌పై ఇంత భారీ తేడాతో విజయం సాధిస్తేనే పాకిస్తాన్ జట్టు ముందంజ వేసే అవకాశం ఉంటుంది. అంటే పాకిస్తాన్ ముందుగా బ్యాటింగ్ చేసి కనీసం 300 పరుగులు చేస్తే ఇంగ్లండ్‌ను 13 పరుగులకు పరిమితం చేయాలి! 350 చేస్తే 63 పరుగులకు, 400 చేస్తే 112 పరుగులకు పరిమితం చేయాల్సి ఉంటుంది. వన్డేల్లో ఇప్పటివరకు ఒక్కసారి కూడా పాక్ జట్టు 400 పరుగుల స్కోరు దాటలేదు. ఇంగ్లండ్ ఏ జట్టుకూ 400 పరుగులు సమర్పించుకోలేదు. ఇంగ్లండ్‌ను నిలువరించడం సంగతేమో కానీ పాక్ ప్రస్తుత ఫామ్ చూస్తే ఆ జట్టే కనీసం 300 పరుగులు చేసే స్థితిలో లేదు. అసలు 287 పరుగులు చేస్తే గానీ లెక్క రాసే అవకాశం కూడా లేదు! ఇక ఇంగ్లండ్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంటే మాత్రం టాస్ వద్దే పాక్ జట్టు ఖేల్ ఖతం. ఎందుకంటే ఎంతటి లక్ష్యమైనా పాక్ 3 ఓవర్లలోపే ఛేదించాల్సి ఉంటుంది! ఇది ఏ రకంగానూ ఊహకు కూడా అందనిది. ఇక నేడు దక్షిణాఫ్రికాపై అఫ్గానిస్తాన్ అయితే ఏకంగా 438 పరుగుల తేడాతో గెలవాలి కాబట్టి మరో చర్చే అనవసరం. దీనిని పక్కన పెడితే ఈ నెల 15న ముంబైలో భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి సెమీఫైనల్... 16న కోల్‌కతాలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య రెండో సెమీఫైనల్ జరగడం ఖాయం.

'టాప్' మహారాష్ట్ర

ముగిసిన జాతీయ క్రీడలు

పనాజీ (గోవా): జాతీయ క్రీడల్లో మహారాష్ట్ర 1994 తర్వాత తొలిసారి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. గురువారం ముగిసిన ఈ క్రీడల్లో మహారాష్ట్ర 80 స్వర్ణాలు, 69 రజతాలు, 79 కాంస్యాలతో కలిపి మొత్తం 228 పతకాలతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఓవరాల్ చాంపియన్ హోదాలో రాజా భళీంద్ర సింగ్ ట్రోఫీని మహారాష్ట్ర సొంతం చేసుకుంది. పురుషుల విభాగంలో తమిళనాడు స్విమ్మర్ శ్రీహరి నటరాజ్ 'ఉత్తమ అథ్లెట్'గా... మహిళల విభాగంలో ఒడిశా జిమ్నాస్ట్‌లు సంయుక్త, ప్రణతి నాయక్ 'ఉత్తమ అథ్లెట్స్'గా ఎంపికయ్యారు. 42 క్రీడాంశాల్లో 11 వేలకుపైగా క్రీడాకారులు ఈ క్రీడల్లో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ 7 స్వర్ణాలు, 5 రజతాలు, 15 కాంస్యాలతో కలిపి 27 పతకాలతో 19వ స్థానంలో... తెలంగాణ 4 స్వర్ణాలు, 10 రజతాలు, 11 కాంస్యాలతో కలిపి 25 పతకాలతో 22వ స్థానంలో నిలిచాయి. ముగింపు వేడుకలకు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

పతకాల పట్టిక (టాప్-5)

	స్వర్ణాలు	రజతాలు	కాంస్యాలు	మొత్తం
మహారాష్ట్ర	80	69	79	228
సర్వీసెస్	66	27	33	126
హరియాణా	62	55	75	192
మధ్యప్రదేశ్	37	36	39	112
కేరళ	36	24	27	87

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.